www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

రెండు మహానగరాలు
రూ.॥250/-
పేజీలు:245



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

సాగుకు రూ.35కే డీజిల్ ఇవ్వాలి
భారతదేశం ఒక 'అవకాశాల గడ్డ'
'అమృత కాలం' విద్యార్థులకు మృత్యుకాలం
07

సంపుటి 28, సంచిక: 323 | ఆదివారం | 17-05-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

# ఆగ్రహ జ్వాలలు

పెట్రో ధరల పెంపుపై మోదీ సర్కార్‌పై విరుచుకుపడిన సిపిఐ

- ప్రజలపై భారం మోపి సామాన్యుల నడ్డి విరిచిందని ఆగ్రహం
- రాష్ట్రవ్యాప్తంగా వెల్లువెత్తిన నిరసనలు
- ఆటోలను తాళ్లతో లాగుతూ, ఖాళీ సిలిండర్లతో వినూత్న ప్రదర్శనలు
- ఉన్నతవర్గాలకు అందుతున్న న్యాయం పేదలకు అందడంలేదు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శ



హైదరాబాద్‌లో..



హనుమకొండలో..

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు సంబంధించి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్‌పై సిపిఐ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ధరల పెంపుకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ప్రజలపై మోదీ సర్కార్ మోయలేని భారం మోపుతుందని మండిపడింది. సామాన్యుల నడి విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా పెట్రో ధరలకు వ్యతిరేకంగా జిల్లాలు, మండల కేంద్రాల్లో ఆటోలను తాళ్లతో లాగుతూ, మహిళలు ఖాళీ సిండర్లను ప్రదర్శిస్తూ వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ్మా పాల్గొనగా, యాదాద్రి జిల్లా భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసనలో ఎమ్మెల్సీ సత్యం పాల్గొన్నారు. కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ పరిపాలనలో ఉన్నతవర్గాలకు అందుతున్న న్యాయం పేద ప్రజలకు అందడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలపై ప్రేమలు ఒలకబోసి, అనంతరం పన్నుల భారం మోపుతున్నారని విమర్శించారు. దేశంలో ఒకే పన్ను స్లాబ్ విధానం రద్దు చేసి, ఉన్నత వర్గాలకు కొంచెం ఎక్కువగా పన్నులు వసూలు చేసి పేద ప్రజల తరువాయి 12లో





## 25 ఏళ్ల తర్వాత తెలంగాణలో సర్

- జూన్ 25 నుంచి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి సర్వే
- అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా ప్రచురణ
- ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్ విడుదల చేసిన సిఇఒ
- ఓటర్లు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా సమర్పించుకునే అవకాశం

ప్రజాపక్షం/హైదరాబాద్

జూన్ 25 నుంచి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి గుర్తింపు (ఎన్యూమరేషన్) ప్రక్రియ నిర్వహించనున్నారు. తెలంగాణ ఎన్నికల యంత్రాంగం రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియకు శ్రీకారం చుట్టనుంది. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) సి. సుదర్శన్ రెడ్డి ఎస్ఆర్‌ఐకు సంబంధించిన పూర్తి షెడ్యూల్, విధివిధానాలను వెల్లడించారు. దాదాపు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో ఈ స్థాయిలో ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బిఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధృవీకరించనున్నారు. ప్రతి ఓటరు ఇంటిని కనీసం మూడు సార్లు సందర్శించి, ముందుగానే ముద్రించిన ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, వాటిని పూరించడంలో సహకరించి తిరిగి సేకరిస్తారు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే వారి నుంచి ఫారం6 కూడా స్వీకరించనున్నారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేయనుండగా, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరించనున్నారు. అనంతరం విచారణలు, ధృవీకరణలు పూర్తి చేసి అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు ఆయన వివరించారు.

**ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు..**

ఓటర్లు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించుకునే అవకాశం కల్పించారు. ఇందు కోసం voters.eci.gov.in వెబ్‌సైట్‌తో పాటు ఈసినెట్ యాప్, టోల్ ఫ్రీ నెంబర్ 1950 ద్వారా సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 'బుక్ ఎ కాల్ విత్ బిఎల్‌ఓ' సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల జాబితాలను బూత్ వారీగా ప్రదర్శిస్తామని, వివరాల్లో తేడాలు తరువాయి 8లో



## పెట్రో ధరల పెంపు సమర్థనీయం కాదు

- వెంటనే ధరలను ఉపసంహరించుకోవాలి
- సిఎం రేవంత్‌రెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/ హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయంకాదని, పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై తీవ్ర ప్రభావం చూపనుందని, దీంతో నిత్యావసరాల తరువాయి 8లో

## బండి భగీరథ్ లొంగుబాటు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి /హైదరాబాద్



మైనర్ బాలికపై లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ పోక్సో కేసులో శనివారం ఎట్టకేలకు పోలీసులు ఎదుట లొంగిపోయాడు. న్యాయవాదుల సమక్షంలో అతడిని కుటుంబ సభ్యులే పోలీసులకు అప్పగించారు. విచారణకు పిలిచినా రాకుండా కాలయాపన చేస్తూ మధ్యంతర బెయిల్ కోసం యత్నించి విఫల మయ్యాడు. అయితే శనివారం పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేసి 5 ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. దీంతో భగీరథ పోలీసుల ఎదుట లొంగి పోయాడు. ఇదిలా ఉండగా, శనివారం బాధితురాలు, తల్లితో పాటు మేడ్చల్ కోర్టులో హాజరుకాగా, వారిద్దరి వాంగ్మూలాలను తరువాయి 12లో

## 9, 10 తరగతుల్లో త్రిభాషా విధానం

ఈఏడాది నుంచే అమలు : సిబిఎస్ఇ కీలక నిర్ణయం






**న్యూఢిల్లీ :** సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ) కీలక నిర్ణయం తీసుకుంది. 9, 10 తరగతుల విద్యార్థులకు త్రిభాషా అధ్యయనాన్ని తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. 2026 జులై 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నట్లు పేర్కొంది. విద్యార్థులు చదివే మూడు భాషల్లో కనీసం రెండు భారతీయ భాషలే ఉండాలని స్పష్టం చేసింది. ఈ కొత్త ఈ విధానం వల్ల విద్యార్థులపై ఎలాంటి అదనపు పరీక్షల భారం పడకుండా ఉండేందుకు సీబీఎస్ఈ మినహాయింపును తరువాయి 12లో

# పసిబిడ్డలు భారమా?

- మెదక్ జిల్లాలో శిశు విక్రయాల దందా..!
- తల్లి పొత్తిళ్ల నుంచే మాయం
- నాలుగేళ్లలో 31 మంది అమ్మకం





ప్రజాపక్షం/మెదక్

అమ్మ ఒడిలో పెరగాల్సిన పసికందులు... డబ్బు కోసం అమ్ముడుపోతున్న దారుణ ఘటనలు మెదక్ జిల్లాలో కలకలం రేపుతున్నాయి. కన్న తల్లిదండ్రులే కడుపులో మోసిన బిడ్డలను విక్రయించడం సమాజాన్ని కలచివేస్తోంది. ఒకప్పుడు ''పిల్లలే ఆస్తి'' అని భావించిన కుటుంబాల్లో ఇప్పుడు ''పిల్లలే భారమా..?'' అనే పరిస్థితి కనిపిస్తోంది. ఆసుపత్రుల్లో జన్మించిన గంటల వ్యవధిలోనే శిశువులు మాయం కావడం, మధ్యవర్తులు రంగంలోకి దిగడం, డబ్బు చేతులు మారడం వంటి పరిణామాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ''పేదరికం'' పేరుతో జరుగుతున్న ఈ చీకటి వ్యాపారం వెనుక అసలు కారణాలు ఏమిటి..? నిజంగా ఆర్థిక ఇబ్బందు లేనా..? లేక గుట్టుచప్పుడు కాకుండా ఏదైనా ముఠా పనిచేస్తోందా ,,? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఈ ఘటనలు చర్చనీయాంశాంగా మారాయి. మెదక్ జిల్లాలో తరువాయి 8లో

నీట్ పేపర్ లీక్..

## మరో కీలక సూత్రధారి అరెస్టు

బయాలజీ లెక్చరర్ మనీషా మంధారేను అరెస్టు చేసిన సిబిఐ అధికారులు

**న్యూఢిల్లీ :** నీట్ పేపర్ లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తుంది. ఇప్పటికే ప్రధాని సూత్రధారి అరెస్టు కాగా, తాజాగా మరో కీలక సూత్రధారి అయిన బయాలజీ లెక్చరర్ అరెస్టు అయ్యాడు. ఈనెల 3న జరిగిన నీట్‌యుజి పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ఏర్పాటు చేసిన పేపర్‌సెట్టింగ్ కమిటీలో తరువాయి 12లో

## అండమాన్‌ను తాకిన 'నైరుతి'

- నాలుగు రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు
- భారత వాతావరణశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత వాతావరణశాఖ (ఐఎండి) అంచనా వేసినట్లుగానే నైరుతు రుతుపవనాలు ముందస్తుగా భారత్‌లోకి ప్రవేశించాయి. ఆగ్నేయ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రం, నికోబార్ దీవులన్నీ, శ్రీ విజయ పురంతో సహా అండమాన్ దీవులలోని కొన్ని ప్రాంతాలకు విస్తరించాయని ఐఎండి శనివారం తెలిపింది. రానున్న మూడునాలుగు రోజుల్లో ఆగ్నేయ అరేబియా సముద్రం, నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలకు రుతుపవనాలు మరింత ముందుకు సాగడానికి పరిస్థితులు అనుకూలంగా తరువాయి 12లో





## వైద్యం.. ప్రజల ప్రాథమిక హక్కు

- ప్రభుత్వాలు వైద్యం, విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంలేదు
- దేశంలో ఇప్పటికీ 30 కోట్ల మందికి కనీస విద్య అందని దుస్థితి
- యుద్ధాలు, హింస, సామాజిక అసమానతలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం
- ఐడిపిడి 13వ జాతీయ మహాసభలో వైద్యుల ఆందోళన

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజలకు వైద్యం దయతో అందించే సేవ కాదని, అది ప్రజల ప్రాథమిక హక్కు అని పలువురు వైద్యులు ఉద్ఘాటించారు. ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ (ఐడిపిడి) 13వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లోని ఐఎంఎ బిల్డింగ్‌లోని డాక్టర్ జి.కె.కిర్లోస్కర్‌హాల్‌లో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐడిపిడి జాతీయ అధ్యక్షులు డాక్టర్ అరుణ్ మిత్ర అధ్యక్షతన జరిగిన మహాసభల ప్రారంభోత్సవ సభలో ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డిఎంఇ డాక్టర్ రమాదేవి, ఎయిమ్స్ కార్డియాలజీ విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ కె.శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తరువాయి 8లో

## భూముల ధరలు సవరిస్తాం

- ఈ నెలాఖరు నుంచి అమలులోకి వస్తాయ్
- మార్కెట్ ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు మధ్య వ్యత్యాసాన్ని తగ్గించేందుకే నిర్ణయం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- ధరణి తప్పిదాల్లో బాధ్యులపై త్వరలో చర్యలుంటాయని హెచ్చరిక



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో భూములకు బహిరంగ మార్కెట్ ఉన్న ధరలకు, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధరలకు మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించడానికి శాస్త్రీయ పద్ధతిలో భూముల మార్కెట్ విలువను (రిజిస్ట్రేషన్ ధరలు) సవరించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ నెలాఖరు నుంచే ఈ కొత్త ధరలు అమలులోకి రానున్నాయన్నారు. సచివాలయంలో శనివారం మీడియా ప్రతినిధులతో ఆయన 'ఇష్టాగోష్టి'గా మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, భూముల మార్కెట్ విలువలు, ధరణి సమస్యలు, రెవెన్యూ సంస్కరణలపై పలు అంశాలపై వివరాలను వెల్లడించారు. హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో ఇన్నర్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిని తరువాయి 8లో



## 19,20 తేదీల్లో పుతిన్ చైనా పర్యటన

**మాస్కో:** రష్యా అధ్యక్షుడు పుతిన్ వచ్చేవారం చైనాలో పర్యటిస్తారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మూడు రోజుల పర్యటన పూర్తిచేసుకుని వెళ్ళి వారం రోజులకే రష్యా అధ్యక్షుడి చైనా పర్యటన సర్వత్రా ఆసక్తి రేపుతోంది. మే 19,20 తేదీల్లో రెండురోజుల పాటు పుతిన్ చైనాలో పర్యటిస్తారని శనివారం క్రెమ్లిన్ వర్గాలు ప్రకటించాయి. రష్యా–చైనా మైత్రీబంధ 25వ వార్షికోత్సవం సందర్భంగా పుతిన్ చైనాలో పర్యటిస్తారు.





## నీటికి తడి ఉంటుందా?




నీటితో తడిసిపోవడం మనందరికీ అనుభవమే. నీరు తడిగా ఉంటుందన్న అభిప్రాయం దాదాపుగా అందరిలోనూ ఉంటుంది. అయితే, శాస్త్రపరంగా ఇది సరికాదు. మనం రోజువారీ భాషలో నీటి ని తడిగా వర్ణిస్తాం. కానీ, శాస్త్రవేత్తలు తడితనం (వెట్నెస్) అనే పదాన్ని కొంచెం భిన్నంగా నిర్వచిస్తారు. పదార్థ శాస్త్రం, ఉపరితల భౌతిక శాస్త్రం ప్రకారం, తడితనం అనేది ఒక ఘన ఉపరితలంతో ద్రవం సంపర్కంలోకి వచ్చినప్పుడు ఏర్పడే లక్షణం. అంటే ఒక ద్రవం ఒక ఘన వస్తువుపై వ్యాపించి దానిని కప్పుకుంటే, ఆ వస్తువు తడి అయింది అని అంటారు. ఈ నిర్వచనం ప్రకారం తడితనం అనేది ద్రవం, ఘన ఉపరితలం మధ్య జరిగే పరస్పర చర్యకు సంబంధించిన లక్షణం. ఈ నిర్వచనాన్ని అనుసరించి చూస్తే, నీరు స్వయంగా తడి కాదు అని కొందరు శాస్త్రవేత్తలు అంటారు. ఎందుకంటే నీరు తానే ఒక ద్రవం. అది తనపై తాను తడిగా ఉండదు. కానీ అది ఇతర వస్తువులను తడిగా చేస్తుంది. ఉదాహరణకు, నీరు నేలపై లేదా బట్టలపై పడితే ఆ వస్తువులు తడిగా మారుతాయి. అంటే నీరు తడితనాన్ని కలిగించే పదార్థం. అయితే ఇది పూర్తిగా ఏకాభిప్రాయం ఉన్న విషయం కాదు. కొంతమంది శాస్త్రవేత్తలు మరో కోణాన్ని చూపిస్తారు. వారి అభిప్రాయం ప్రకారం, నీటి అణువులు ఒకదానితో ఒకటి కలిసే స్వభావం, ఉపరితలంతో అతుక్కునే స్వభావం వల్ల నీరు కూడా ఒక రకంగా తడి లక్షణం కలిగి ఉందని చెప్పవచ్చు. కాబట్టి నీరు తడి కాదు అనే వాక్యం పూర్తిగా తప్పు కాదు, కానీ అది ఉపయోగించే నిర్వచనంపై ఆధారపడి ఉంటుంది.

## పిల్లులకూ ఇష్టాయిష్టాలు!



చాలామంది పిల్లులను ప్రేమగా నిమురుతున్నామని అనుకుంటారు. కానీ, వాటికీ ఇష్టాయిష్టాలు ఉంటాయని గ్రహించరు. అందుకే, మనుషులు తరచుగా పిల్లులను వాటికి ఇష్టంలేని విధంగా తాకుతుంటారు. పరిశోధనలు అనుసరించి, ఇలాంటి చర్యల వల్ల పిల్లల్లో అసహనం పెరుగుతుంది. కానీ, ఆహారం లేదా భద్రత కోసం మాత్రమే అలాంటి చర్యలను సహిస్తాయి. జంతు ప్రవర్తనపై చేసిన అధ్యయనాల ప్రకారం పిల్లి శరీరంలో కొన్ని ప్రాంతాలు నిమిరితే అవి సౌకర్యంగా భావిస్తాయి. ముఖ్యంగా గడ్డం భాగం, చెంపలు, చెవుల దిగువ భాగం దగ్గర నిమురితే పిల్లులు సాధారణంగా ఆనందంగా స్పందిస్తాయి. ఈ ప్రాంతాల్లో సువాసన గ్రంథులు ఉండటం వల్ల అవి తమ పరిసరాలను గుర్తించడంలో ఉపయోగపడతాయి. అందుకే ఈ ప్రాంతాల్లో స్పర్శ వాటికి సౌకర్యంగా ఉంటుంది. అదే విధంగా, కొన్ని ప్రాంతాలు పిల్లులకు అసౌకర్యాన్ని కలిగించవచ్చు. ముఖ్యంగా పొట్ట లేదా తోక భాగం తాకితే చాలా పిల్లులు అసౌకర్యంగా భావిస్తాయి. ఎందుకంటే ఆ ప్రాంతాలు చాలా సున్నితంగా ఉంటాయి. ప్రకృతిలో ఇది దాడులకు బలహీనమైన భాగం కావడంతో పిల్లులు దానిని రక్షించుకునే ప్రయత్నిస్తాయి.

## ప్రకృతి దిద్దిన సుందర దృశ్యం..



ఫిలిప్పీన్స్‌లోని బోహోల్ ప్రావిన్స్‌లో ఉన్న ఒక అరుదైన భౌగోళిక నిర్మాణం 'చాకొలెట్ హిల్స్'. వీటిని స్థానిక భాషలో ఎంగా బుంగ్లోడ్ సా సొకొలేట్‌గా పిలుస్తారు. ఈ ప్రాంతంలో కనీసం 1,260 నుండి గరిష్ఠంగా 1,776 వరకు కొండలు విస్తరించి ఉన్నాయి. సుమారు 50 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ కొండలు సమానంగా వ్యాపించి ఉండటం వాటి ప్రత్యేకత. ఈ కొండలు లైమ్‌స్టోన్‌తో ఏర్పడి, పైభాగంలో పచ్చికతో కప్పబడి ఉంటాయి. వర్షాకాలంలో ఇవి పచ్చగా కనిపిస్తాయి. కానీ ఎండాకాలంలో పచ్చిక ఎండిపోవడంతో ఇవి గోధుమరంగు (చాక్లెట్ రంగు)లోకి మారుతాయి. అందుకే వీటికి చాకొలెట్ హిల్స్ అనే పేరు వచ్చింది. వాటి ఆకారం కూడా ప్రత్యేకమే. ఇవి గడ్డి గుట్టల మాదిరిగా, గుండ్రంగా, శంఖాకారంగా సమానంగా ఉంటాయి. సాధారణంగా వీటి ఎత్తు 30 నుండి 50 మీటర్ల వరకు ఉంటుంది. అయితే కొన్ని కొండలు 120 మీటర్ల వరకు ఎత్తు ఉండడం విశేషం. ఈ సమానత్వం, విస్తృత విభజన వీటిని ప్రపంచంలోనే అరుదైన సహజ నిర్మాణంగా నిలబెడుతుంది. బోహోల్ ప్రాంతానికి ఇవి ప్రధాన పర్యాటక ఆకర్షణగా నిలిచాయి. కార్మెన్, బాటుయాన్, సాగ్బయాన్ వంటి ప్రాంతాల్లో ఇవి అధికంగా కనిపిస్తాయి. ఈ కొండలు బోహోల్ ప్రావిన్స్ జెండా, చిహ్నంలో కూడా చోటు సంపాదించాయి, అక్కడి సహజ సంపదను సూచిస్తాయి. అదనంగా, ఫిలిప్పీన్స్ ప్రభుత్వం వీటిని జాతీయ భౌగోళిక స్మారకంగా ప్రకటించింది. యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో చేర్చేందుకు ప్రతిపాదించింది.

## అతిగా నవ్వడం ప్రమాదమే!

చరిత్రలో కొన్ని అరుదైన సంఘటనలు నమోదయ్యాయి. అందులో, నియంత్రణ లేకుండా అతిగా నవ్వడం వల్ల సంభవించిన మరణాలు కూడా ఉన్నాయి. కాబట్టి, ఎక్కువగా నవ్వితే ప్రాణహాని తప్పదని విపరీతంగా ప్రచారమవుతున్నది. కానీ, అలాంటి మరణాలకు నవ్వు కారణం కాదు. నవ్వువల్ల ప్రేరేపితమైన శారీరక ప్రతిస్పందన కారణం. ఉదాహరణకు, ఎక్కువసేపు నిరంతరంగా నవ్వడం వల్ల శ్వాసలో అంతరాయం కలగవచ్చు లేదా ఇప్పటికే ఉన్న గుండె సమస్యలు తీవ్రమై సమస్యాత్మకంగా మారవచ్చు. తార్కికంగా చూస్తే, ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి కేవలం నవ్వడం వల్లే మరణించడం చాలా అరుదు. ఎక్కువగా ఈ సంఘటనలు ముందుగా ఉన్న ఇతర వైద్య సంబంధిత అంశాలతో సంబంధం కలిగి ఉంటాయి. ఉదాహరణకు, గుండె జబ్బులు, ఆస్తమా, లేదా నాడీ సంబంధిత సమస్యలు ఉన్నవారిలో తీవ్రమైన భావోద్వేగాలు ఒక్కోసారి ప్రాణాలు తీసేస్థాయికి వెళతాయి. ఆ విధంగా ట్రిగర్ చేసే అంశాల్లో నవ్వు ఒకటి కావచ్చు... కానీ, నవ్వే ప్రాణాలు తీస్తుందనడానికి శాస్త్రీయమైన నిర్ధారణ ఏదీ లేదు. అదే విధంగా, నవ్వు వల్ల ఊపిరి ఆడకపోవడం అనే వాదన కూడా పూర్తిగా సరైనది కాదు. సాధారణ నవ్వు వల్ల ఊపిరి ఆడకపోవడం జరగదు. కానీ చాలా అరుదైన సందర్భాల్లో, తీవ్రమైన నవ్వు వల్ల శ్వాసలో తాత్కాలిక అంతరాయం కలగవచ్చు. దీనిని భూతద్దంలో చూపాల్సిన అవసరం లేదు.

– బిఎస్ఎస్ మైత్రేయి

# అమెరికా–చైనా మధ్య మూడేళ్ల సంధి

బీజింగ్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా ప్రజా రిపబ్లిక్ అధ్యక్షుడు షి జిన్‌పింగ్ మధ్య రెండ్రోజులపాటు జరిగిన చర్చల ఫలితాలకోసం యావత్ ప్రపంచం ఎదురు చూసింది. ఎందుకంటే ఒకటి ఒకటి స్థిరపడిన అగ్రరాజ్యం, రెండవది వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక, సైనిక శక్తి. ట్రంప్ ఏకపక్షంగా సుంకాల పెంపుదల చర్యలతో ప్రపంచ దేశాలను గడగడలాడిస్తున్నారు. (ఆయనకు ఆ అధికారం లేదని యుఎస్ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.) సైనికంగా బెదిరిస్తున్నారు. వెనిజులా అధ్యక్షుడు మదురో దంపతులను బందీలుగా పట్టుకురావటం, ఇరాన్‌పై ఇజ్రాయెల్‌తో కలిసి యుద్ధానికి దిగటం ఇందుకు ఉదాహరణలు. ఇరాన్‌తో యుద్ధం అమెరికా బలహీనతలను ప్రపంచానికి చాటింది. దాన్నుండి బయటపడే మార్గంకోసం వెకులాడుతూ గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. చైనా బలమైన ఆర్థిక శక్తిగా 2వ స్థానంలో ఉంది. ఆర్థిక, సైనిక శక్తిగా అమెరికా బెదిరింపులకు జడవని స్థితిలో ఉంది. భౌగోళికంగా అమెరికా –చైనా మధ్య దూరం 9500 మైళ్లు. అంతదూరం ప్రయాణించి అమెరికన్ సైనికులు చేయగలిగిందేమీ లేదని ట్రంప్ స్వయంగా విలేకరులు తైవాన్ ప్రస్తావన తెచ్చిన సందర్భంలో అంగీకరించారు. ఈ నేపథ్యంలో చూచినప్పుడు, ఇరుదేశాల మధ్య తీవ్రమైన వైరుధ్యాలున్నప్పటికీ మరో మూడేళ్లు (ట్రంప్ పదవీకాలం) ఆపైన ప్రత్యక్ష ఘర్షణ లేకుండా ప్రయాణం సాగించాలని ట్రంప్, జిన్‌పింగ్ అంగీకరించారు. తొలిరోజు చర్చల్లోనే జిన్‌పింగ్ ట్రంప్‌కు రెండు విషయాలు స్పష్టం చేశారు. ఒకటి, అమెరికా ప్రాభవం ప్రపంచంలో తగ్గుతున్నది. (అది తన పూర్వాధ్యక్షుడు జోబైడెన్ ప్రభుత్వం గూర్చి అని ట్రంప్ సర్దుకున్నారు). రెండు, తైవాన్ చైనా మెయిన్‌లాండ్‌లో భాగం. దానితో యుద్ధం వస్తే అమెరికా దాని రక్షణకు వస్తుంది, అదే జరిగితే అది చైనా, అమెరికా మధ్య సంఘర్షణకు దారితీయవచ్చు. చరిత్రలోకి వెళితే, అమెరికా 1979లో చైనా ప్రజారిపబ్లిక్‌ను చైనాకు ఏకైక లీగల్ ప్రభుత్వంగా గుర్తించింది. తైవాన్‌తో అధికారిక దౌత్యసంబంధాలు రద్దు చేసుకుంది. అప్పటి నుంచి వ్యూహాత్మక అస్పష్టతను నటిస్తూ, యథాతథస్థితిని ఏకపక్షంగా మార్చటానికి తాము వ్యతిరేకం అంటూ చెబుతున్నది. పరోక్షంగా తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ దాన్ని చైనాకు పక్కలో బల్లెంలాగా ప్రోత్సహిస్తున్నది. అయితే జిన్‌పింగ్ ప్రశ్నకు ట్రంప్ జవాబివ్వలేదు. మరో విడత ఆయుధ సరఫరాలకు క్లియరెన్స్ అంశం ప్రస్తుతం ట్రంప్ ముందుంది. మూడో ప్రధాన అంశం. ఇరాన్ యుద్ధం. హోర్ముజ్ జల సంధిని స్వేచ్ఛా రవాణాకోసం తెరవటంలో ట్రంప్ జిన్‌పింగ్ సహాయం కోరారు. జిన్‌పింగ్ ఆ భావనను బలపరిచారు. అయితే ఇరాన్ సర్వసత్తాక సార్వభౌమత్వం కలిగిన దేశం అయినందున బలప్రయోగానికి తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు.

అంతర్జాతీయ ప్రాముఖ్యతగల అంశాలపై ప్రాథమిక భేదాభిప్రాయాలు కొనసాగుతున్నప్పటికీ, తమ రెండు దేశాల సంబంధాలలో 'స్థిరత్వం' ప్రవేశపెట్టాలని ఇరువురు నేతలు అంగీకరించారు. జిన్‌పింగ్‌తో సంభాషణలపట్ల ట్రంప్ ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. రెండు దేశాలు ''అద్భుతమైన వాణిజ్య ఒప్పందాలు'' అంగీకరించాయి, అనేక సమస్యలు పరిష్కరించుకున్నాయి'' అని ట్రంప్ చెప్పారు. ''స్థిరమైన ఆర్థిక, వాణిజ్య సంబంధాలు నెరపటం లో ఇరుపక్షాలు ముఖ్యమైన సమష్టి అవగాహనలకు వచ్చాయి. వివిధ రంగాల్లో ఆచరణాత్మక సహకారం విస్తరించటంలో, పరస్పర ఆందోళనలను సవ్యంగా పరిష్కరించుకోవటంలో అటువంటి అవగాహనకు వచ్చాం'' అని జిన్‌పింగ్ అన్నారు. గతంలో కుదుర్చుకున్న అన్ని ఒప్పందాలు అమలు జరపాలని, వాణిజ్యం, పెట్టుబడులపై కౌన్సిళ్లు ఏర్పాటు చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. ''వచ్చే మూడు సంవత్సరాలపాటు చైనా–అమెరికా సంబంధాలను స్థిరంగా, నిర్మాణాత్మకంగా నిర్వహించే 'నూతన దార్శనికతను' షి, ట్రంప్ అంగీకరించారని'' చైనా విదేశాంగ శాఖ ప్రకటన పేర్కొన్నది.

అమెరికా నుంచి 200 బోయింగ్ విమానాలు, మరింతగా ఆయిలు, సోయాబీన్ కొనుగోలు చేసేందుకు, అమెరికా బీఫ్ (గో మాంసం) ఎగుమతులపై ఆంక్షలు సడలించేందుకు చైనా అంగీకరించింది. కాగా అమెరికా నుంచి అత్యాధునిక ఎన్‌విడియా చిప్స్ కొనుగోలు పునరుద్ధరించేందుకు 10 చైనా కంపెనీలను అమెరికా అంగీకరించింది. అరుదైన ఖనిజాల ఎగుమతిపై విధించిన ఆంక్షలను సడలించవచ్చు.

సుంకాల సమస్యలను తాను చైనా నాయకునితో చర్చించలేదని ట్రంప్ చెప్పారు. అయితే అధికారుల స్థాయి చర్చల పర్యవసానంగా, ఇరు దేశాల సంబంధాల్లో స్థిరత్వం, సుహృద్భావం ప్రవేశపెట్టాలన్న నిర్ణయానికనుగుణంగా, గత అక్టోబర్‌లో దక్షిణ కొరియాలో ట్రంప్, జిన్‌పింగ్ కలుసుకున్నప్పుడు అంగీకరించిన 'సంవత్సరంపాటు వాణిజ్య పోరాటంలో విరామం' పొడిగించబడే అవకాశం ఉంది.

''ఈ రెండూ గొప్ప దేశాలు. దీన్ని జి2 అంటాను'' అన్నారు ట్రంప్. ఈ పదాన్ని చైనా ప్రభుత్వం ఇంతవరకు ఉపయోగించ లేదు. ''అధ్యక్షుడు ట్రంప్ అమెరికాను మళ్లీ గొప్ప దేశం చేయా లనుకుంటున్నారు. చైనా ప్రజలను జాతీయ పునరుజ్జీవనం దిశగా నడిపించటానికి నేను అంకితమైనాను'' అన్నారు అధ్యక్షుడు షి జిన్‌పింగ్. ఇదీ లక్ష్యాలలో మౌలిక వ్యత్యాసం. తరచూ అగ్రనాయక సమావేశాలు మంచిదే. ఈ రెండు దేశాల వైఖరులు ప్రపంచ పరిణామా లను ప్రభావితం చేస్తాయి. అమెరికా, చైనా సంబంధాల ప్రభావం ఎక్కువగా మన దేశంపై ఉంటుంది. అది తన 'వ్యూహాత్మక స్వేచ్ఛ'కు పదును పెట్టాల్సి ఉంటుంది.

# మార్పు వైపు తమిళ రాజకీయం



టి.లక్ష్మీ నారాయణ

ప్రముఖ తమిళ సినీ నటుడు జోసెఫ్ విజయ్ నేతృత్వంలో నూతనంగా కొలువుదీరిన ప్రభుత్వం, గవర్నర్ ఆదేశం మేరకు బలనిరూపణ చేసుకోవడానికి తమిళనాడు శాసనసభ సమావేశం జరిగింది. ఆసక్తి కొద్దీ ఒక ఆంగ్ల టివి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించాను. టివి ఛానల్ బహుశా కృత్రిమ మేధను ఉపయోగించుకుని సభ్యులు మాట్లాడిన సారాంశాన్ని ఆంగ్లంలో తర్జుమా చేసి, వినిపించింది. వీక్షించినందుకు సంతృప్తి కలిగింది. గత కొన్ని సంవత్సరాల నుండి లోక్ సభ, రాజ్యసభ, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ శాసనసభల సమావేశాల ప్రత్యక్ష ప్రసారాలను చూడాలంటేనే జుగుప్సకలుగుతుంది. గతంలో, కరుణానిధి, జయలలిత ప్రభుత్వాల కాలంలో తమిళనాడు శాసనసభ కూడా అపఖ్యాతిని మూటగట్టుకున్నది. కానీ, మే 13న జరిగిన సమావేశం నిర్వహణ తీరు బాగుంది. అత్యధికులు మొదటిసారి గెలిచిన వారే సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి సభకు కొత్త. ప్రతిపక్ష నాయకుడు యువకుడు. అయినా, స్థూలంగా, అర్థవంతంగా, హుందాగా, ప్రశాంతంగా సభ జరిగింది. ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన 'బలనిరూపణ తీర్మానం'పై జరిగిన చర్చ, సభ్యులు ప్రస్తావించిన అంశాలను ముఖ్యమంత్రి శ్రద్ధగా వ్రాసుకుని వాటిపై స్పందించిన తీరు, ప్రజాస్వామ్యం పట్ల కాస్త విశ్వా సం పెంచుతుంది. విజయ్ ముఖ్యమంత్రి కాగానే కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో ఒకటి, విద్యాలయాలు, దేవస్థానాల సమీపంలో మద్యం దుకాణాలను తక్షణం తొలగించాలన్న మంచి నిర్ణయం. మరొకటి, వివాదాస్పద నిర్ణయం. విజయ్ వ్యక్తిగత జ్యోతిష్యుడిని ముఖ్యమంత్రి ప్రత్యేక అధికారిగా నియమించారు. దానిపై విమర్శలను ఎదుర్కొన్నా రు. ఆ అంశాన్ని సభ్యులు శాసనసభలో ప్రస్తావించారు. దానిపై పునరాలోచిస్తానని విజయ్ సానుకూల సమాధానం చెప్పి, ఆ నియామకాన్ని రద్దు చేశారు.

ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ, ప్రజలను విభజించే సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్నారు. సనాతన ధర్మాన్ని వ్యతిరేకస్తూ నిర్మించబడిన ద్రవిడ ఉద్యమం పునాదులపై నిర్మించబడిన పార్టీ డియంకె. ఉదయనిధి సనాతన ధర్మంపై గతంలో కూడా తన అభిప్రాయాన్ని గట్టిగానే వినిపించారు. కానీ, ఇప్పుడు శాసనసభలో ఆ మాటలను పునరుద్ఘాటించడం వెనుక ఎన్నికల తదనంతరం తమిళనాట రాజకీయాల్లో శరవేగంగా మారిన పరిస్థితులు కారణం కావచ్చు. తన వ్యాఖ్య ద్వారా ఉదయనిధి ఒక స్పష్టత ప్రజలకు ఇవ్వదలచుకున్నారేమో! డిఎంకె తన భావజాలం నుండి పక్కకుపోదని, సనాతన ధర్మం చుట్టూ పరిభ్రమించే బిజెపితో చేతులు కలపదన్న సంకేతాన్ని ఇవ్వాలనుకున్నారేమో! కాంగ్రెస్ మాట వరసకు కూడా తమతో సంప్రదించకుండా విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో నొచ్చుకున్న డిఎంకె లోక్‌సభలో తమ సీట్ల కేటాయింపును మార్చాలని స్పీకర్‌కు శ్రీమతి కనిమొళి లేఖ వ్రాసిన పూర్వరంగంలో కొందరు అనుమానాలు రేకెత్తించారు. అలాగే, బిజెపితో జట్టుకట్టిన ఎఐఎడిఎంకెతో డిఎంకె అపవిత్ర కూటమికి తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లుందంటూ ఊహాగానాలు చెక్కర్లు కొట్టాయి. ప్రసారమాధ్యమాలు వాటికి ప్రాధాన్యత ఇచ్చి, ప్రజల్లోకి తీసుకెళ్లాయి. ఇలాంటి వాటికి తెరదించాలనుకున్నారేమో!

తాజాగా జరిగిన ఐదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో తమిళ ప్రజలిచ్చిన తీర్పు విలక్షణమైనది. పశ్చిమ బంగాల్‌లో పెనం మీంచి పొయ్యిలో పడ్డట్లుంది. కేరళంలో వామపక్షాలకు పదేళ్ళు అవకాశం ఇచ్చాం, మళ్ళీ ఒకసారి కాంగ్రెస్ కూటమికి అవకాశం ఇద్దామనుకున్నట్లుంది. ఈ మూడు రాష్ట్రాలలో ప్రజలు స్థూలంగా మార్పుకు అనుకూలంగా ఓటు వేశారు. మూడు రాష్ట్రాల్లో అధికార మార్పిడికి వేరువేరు కారణాలు ఉండవచ్చు. విజేత పార్టీల సిద్ధాంతాలు ఎంత భిన్నమైనప్పటికీ, ఓటర్ల ప్రవర్తన మాత్రం దాదాపు ఒకేలా ఉంది. ప్రజలు మార్పు కోరుకుంటే ఏ 'దుర్గం' కూడా శాశ్వతం కాదని ఈ ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. తమిళనాడులో డిఎంకె ఐదేళ్ళే అధికారంలో ఉన్నది. లౌకిక ప్రజాస్వామ్యం సమాఖ్య వ్యవస్థ మరియు రాష్ట్ర స్వయం ప్రతిపత్తి పరిరక్షణకై మోదీ ప్రభుత్వంతో నికార్సుగా పోరాడారు. శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలియజేయకుండా శాసన ప్రక్రియలో ప్రతిష్టంభన, ఆటంకాలను సృష్టించారు. ఈ సమస్యపై సుప్రీం కోర్టును ఆశ్రయించి, విజయం సాధించారు. ద్రావిడ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇచ్చారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడు వివిధ రంగాలలో మెరుగ్గానే ఉన్నదని అధికారిక గణంకాలు వెల్లడిస్తున్నాయి. ఉదయనిధి స్టాలిన్‌ను ఉప ముఖ్యమంత్రిగా పదోన్నతి కల్పించడంపై విమర్శలను ఎదుర్కొన్నారు. డిఎంకెను ఎన్నికల్లో ప్రజలు ఓడించారు. ప్రజలకు అసంతృప్తి లేకపోతే మార్పుకు అనుకూలంగా 35% ఓట్లు వేయరు. ఎన్నికల ఫలితాలు ద్రవిడ రాజకీయాల్లో ఒక నూతన ఒరవడికి శ్రీకారం చుట్టాయి.

ఈ మధ్య కాలంలో వివిధ దేశాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలను గమనిస్తే మార్పు కోణం అంతర్జాతీయ దృగ్విషయంగా కనబడుతున్నది. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, హంగరీ మరియు బల్గేరియా దేశాల్లోను, పశ్చిమ బంగాల్, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాల్లో ఈ తరహా సారూప్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలు ఓటర్ల మనోభావాల యొక్క సంక్లిష్టమైన వైవిధ్యాన్ని కూడా ప్రతిబింబిస్తున్నాయి. 'ప్రభుత్వాల మార్పు'లో నేటి యువతరం క్రియాశీలక పాత్ర పోషించినట్లు గమనించవచ్చు. ఎన్నికల ప్రక్రియపై బాహ్య ప్రభావం కూడా ఉంటుంది. దానికి కొన్ని పరిమితులు ఉంటాయి. సర్వసాధారణంగా, శాసనసభ ఎన్నికల ఫలితాలు, గత ఐదు లేదా అంతకంటే ఎక్కువ కాలం అధికారంలో ఉన్న పార్టీ/ కూటమి పాలనను ప్రధానంగా కొలబద్దగా తీసుకుని, తమ జీవన ప్రమాణాలలో మెరుగుదలను ఆశిస్తూ, ప్రజలు తీర్పు ఇచ్చారు. ఆరు దశాబ్దాల పాటు పాతుకుపోయిన రెండు ద్రావిడ పార్టీల ఆధిపత్య రాజకీయాలు, వ్యవస్థీకృతమైన అవినీతి పట్ల ప్రజలు విసుగుచెందారనిపిస్తోంది.



**విజయ్ విజయం – ఎలా సాధ్యమయింది:** విజయ్ ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కజగం(టివికె) 2024 ఫిబ్రవరిలో అరంగేట్రం చేసింది. 2025 సెప్టెంబరులో కరూర్‌లో జరిగిన విజయ్ ర్యాలీలో, తొక్కిసలాటలో, పిల్లలతో సహా 41 మంది మరణించారు. అది అత్యంత విషాదకరమైన దుర్ఘటన. పర్యవసానంగా విజయ్ కేసులు, ఆరోపణలు, విమర్శలను ఎదుర్కోవాల్సి వచ్చింది. బహుశా ఆ ఘటనతో ప్రజల మధ్యకు వెళ్ళడానికే విజయ్ సంకోశించి ఉండవచ్చు. ప్రత్యర్థి రాజకీయ పార్టీల నాయకులు రాష్ట్రంలోని మూలమూలలకు వెళ్ళి ఎన్నికల ప్రచారం చేస్తున్నా తాను మాత్రం పరిమితంగానే ఎన్నికల ర్యాలీలు, ప్రదర్శనల్లో పాల్గొన్నారట. విస్తృతమైన అభిమానులు 'సైలెంట్'గా ఒక పెను తుఫానును సృష్టించారని చెబుతున్నారు. గత కొన్నేళ్ళుగా చేసిన కృషి ఈ విజయం వెనుక ఉన్నట్లు కనబడుతుంది. 2009లో, విజయ మక్కల్ ఇయక్కం పేరిట సంక్షేమ కార్యక్రమాల లక్ష్యంతో అభిమానుల సంస్థను నెలకొల్పారట. దాని ఆధ్వర్యంలో 80,000కు పైగా అభిమాన సంఘాలు ఏర్పాటు చేయబడ్డాయట. రాజకీయ పార్టీల నిర్మాణ వ్యవస్థల కంటే బలమైన, విస్తృతమైన 'నెట్ వర్క్' స్థాయికి ఆ సంఘాలు ఎదిగి, శ్రమించి, ఎన్నికల్లో పని చేశాయట. తమిళ సంస్కృతిలో అంతర్భాగంగా పరిగణించబడుతున్న జల్లికట్టు ఆందోళనకు విజయ్ మద్దతుగా నిలవడం కూడా ప్రజలు గుర్తుంచుకున్నారట. యువత మహిళలు, మరికొన్ని శక్తు లు మార్పుకోసం నిలిబడ్డాయి.

సామాజిక న్యాయం, సమానత్వానికి కట్టుబడిన ఒక లౌకిక సంస్థగా టివికె ప్రకటించుకున్నది. పార్టీకి వ్యవస్థాగతమైన నిర్మాణం లేకపోయినా, అధికారంలో ఉన్న బలమైన డిఎంకె, బిజెపి పొత్తుతో ఎన్నికల సమరంలో దిగిన ప్రధాన ప్రతిపక్ష పార్టీ ఎఐఎడిఎంకెని దీటుగా ఎదుర్కొని చావు దెబ్బకొట్టడం భ్రష్టుపట్టిన మన ఎన్నికల ప్రజాస్వామ్యంలో ఒక అద్భుతంగానే పరిగణించాలి. రాష్ట్ర రాజధాని చెన్నయ్ పరిధిలోని 22 స్థానాలలో 20 టివికె గెలిచింది. మధురై, కోయంబత్తూరు, సేలం, ఈరోడ్డు, త్రిచి, తదితర ముఖ్యమైన నగరాలు, పట్టణాల పరిధిలోని నియోజకవర్గాల్లో అత్యధికం గెలిచింది. 38 జిల్లాలుంటే 25 జిల్లా కేంద్రాలలో గెలిచింది. రాష్ట్ర వ్యాపితంగా దీనికి కారణమేమై ఉండవచ్చని మా ప్రాంతం నుండి వెళ్ళి చెన్నయ్ లో స్థిరపడ్డ ఒక మిత్రుడ్ని అడిగితే రియల్ ఎస్టేట్ వ్యాపారంలో అధికార పార్టీ గుత్తాధిపత్యం అవినీతి అక్రమాలు ఒక ప్రధాన కారణమని చెప్పాడు. ఏఐఎస్ఎఫ్ ఉద్యమ సహచరుడితో మాట్లాడితే విజయ్ విజయానికి దోహదపడ్డ ప్రధానమైన అంశాలు, సహకరించిన సమూహాలకు సంబంధించి ఒక స్పష్టత ఇచ్చారు. ఎంజిఆర్, జయలలిత తర్వాత ప్రముఖ సినీనటులు విజయ్ కాంత్, కమల్ హాసన్‌లు రాజకీయాల్లో వారి భవిష్యత్తును పరీక్షించుకున్నారు. రజనీకాంత్ పార్టీ పెట్టడానికే వెనకడుగు వేశారు. మార్పుకు భౌతిక పరిస్థితులు, రాజకీయ సానుకూల వాతావరణం లేకపోతే సాధ్యం కాదు.

గతంలోకి చూస్తే, 1925లో, ఇ.వి. రామస్వామి (పెరియార్) కాంగ్రెస్ పార్టీని వీడి, వైదికబ్రాహ్మణ ఆధిపత్యాన్ని విమర్శిస్తూ, సాంఘిక సంస్కరణలు, హేతువాదం, మహిళల హక్కుల కోసం ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1944లో, జస్టిస్ పార్టీ మరియు ఆత్మగౌరవ ఉద్యమం విలీనమై ద్రవిడర్ కజగంగా ఏర్పడ్డాయి. ద్రవిడర్ కజగంను పెరియార్ ఎన్నికల రాజకీయాల నుండి దూరంగా పెట్టారు. ఈ సంస్థ తమిళ గుర్తింపుపై ప్రధానంగా దృష్టిసారించింది. పెరియార్‌తో వచ్చిన విభేదాల కారణంగా సి.ఎన్.అన్నాదురై 1949లో ద్రవిడ మున్నేట్ర కజగం(డిఎంకె)ను ఏర్పాటు చేశారు. ఇక్కడ గమనించాల్సిన అంశం, కాంగ్రెస్‌తో విభేదించి పెరియార్ ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభిస్తే, పెరియార్‌తో వచ్చిన విభేదాల కారణంగా అన్నాదురై డిఎంకెను ఏర్పాటు చేశారు.


1965 నాటి హిందీ వ్యతిరేక ఉద్యమం సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంది. కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ డిఎంకె ఎన్నికల రంగంలోకి ప్రవేశించింది. 1967 సాధారణ ఎన్నికల్లో స్వతంత్ర పార్టీ ఎనిమిది రాష్ట్రాల నుండి 44 లోక్ సభ స్థానాల్లో గెలిచి లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష పార్టీగా ఆవిర్భవించింది. ఆ పార్టీతో 1967లో జరిగిన మద్రాసు శాసనసభ ఎన్నికల్లో డిఎంకె పొత్తుపెట్టుకుని, మొదటిసారి సి.ఎన్.అన్నాదురై నాయకత్వంలో అధికారంలోకి వచ్చింది. దాంతో తమిళనాడులో కాంగ్రెస్ పాలన అంతమైంది.

**మార్పువైపు అడుగు పడింది:** నేడు అధికారంలోకి వచ్చిన టివికె కూడా ద్రావిడ భావజాలాన్నే కొనసాగిస్తుందన్న భావన కల్పిస్తూ, ప్రముఖ సాంఘిక సంస్కరణవాద ఉద్యమ నాయకుడు పెరియార్, మాజీ ముఖ్యమంత్రి కామరాజ్ (కాంగ్రెస్), డా. బి.ఆర్. అంబేద్కర్, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన శివగంగ సంస్థానం మహారాణి వెల్లు నాచ్చియార్, ఏడున్నర సంవత్సరాలు జైలు జీవితం గడిపిన స్వాతంత్ర్య సమరయోధురాలు సంఘ సంస్కర్త గాంధేయవాది అంజలై అమ్మాల్ లను ఆదర్శంగా పెట్టుకున్నారు. విజయ్ ముఖ్యమంత్రిగా నూతన ఒరవడి ప్రారంభించారు. ముఖ్యమంత్రి విజయ్ మరో ముందడుగు వేసి, మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్‌ను, ప్రతిపక్ష నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌ను ఇంటికెళ్ళి కలిశారు. తనకు మద్దతుగా నిలిచిన మరియు ప్రత్యర్థి రాజకీయ పార్టీల నేతలను, వారి కార్యాలయాలు లేదా ఇళ్ళకు వెళ్ళి కలవడం ద్వారా ఒక మంచి ప్రజాస్వామ్య సాంప్రదాయాన్ని ఆచరించారు. ఎందుకో మాజీ ముఖ్యమంత్రులు పన్నీర్ సెల్వం, పళని స్వామిలను ప్రత్యేకంగా కలిసినట్లు లేదు. ఎఐఎడిఎంకె చీలిక వర్గం నేతలను బల నిరూపణకు ముందు తాను వెళ్ళి కలవడం ఒక తప్పటడుగే.

# మశూచి టీకా పితామహుడు ఎడ్వర్డ్ జెన్నర్

కరోనా వైరస్ విలయతాండవం చేసి ఎందరో ప్రాణాలను బలితీసుకుంది. కొవిడ్ బారిన పడకుండాకాపాడుకోవడానికి అందరం వ్యాక్సిన్లు తీసుకున్నాం. మరి అప్పట్లో ఉష్ణ మండల ప్రాంత ప్రజలను ఎక్కువగా పట్టిపీడించే వ్యాధులలో మశూచి ఒకటి. అమ్మవారు, అమ్మతల్లి అని పిలువబడే ఈ వ్యాధి కొందరు అంధులై మరికొందరు అందవిహీనులుగా తయారయ్యేవారు. కొందరు ప్రాణాలు పోగొట్టుకునేవారు. అంతటి భయంకర మశూచి కి నివారణోపాయాన్ని కనుగొని మానవ జాతికి ఎంతో మేలుచేసిన మహావైద్య శాస్త్రవేత్త ఎడ్వర్డ్ జెన్నర్.

1749 మే 17 న ఇంగ్లాండ్ లోని బర్కిలీ అనే పట్టణంలో ఎడ్వర్డ్ జెన్నర్ జన్మించాడు. తండ్రి మత బోధకుడు. చిన్నతనం నుండి జెన్నర్‌కు ప్రకృతి అంటే చాలా మక్కువ. వీలు దొరికినప్పుడు ఆ పట్టణ పరిసరాల్లో ఉన్న సెవర్న్ నదీ తీరాన్ని, చిన్న కొండల్ని, లోయల్ని దర్శించేవాడు. వివిధ వస్తువులు, పక్షుల ఈకలు, గుడ్లు సేకరించేవాడు. వాటి గురించిన వివరాలు, సేకరించిన స్థలం, తేదీ మొదలైన ఒక వివరాలు రాసి అందంగా అమర్చేవాడు. అలా తన తెలివితేటలతో అందరినీ ఆకట్టుకునేవాడు. 13వ ఏట గ్రామంలో మెడికల్ అప్రెంటిస్‌గా పని చేశాడు. 21వ ఏట లండన్‌లో జాన్ అంటారు అనే సర్జన్ వద్ద వైద్యశాస్త్రంలో ప్రత్యేక శిక్షణ పొందాడు. శస్త్రచికిత్సల్లో జండర్ నైపుణ్యం జెన్నర్‌ను ఎంతగానో ప్రభావితం చేసింది. వారిద్దరూ గురు శిష్యుల వాత్సల్యంతో మిత్రులైనారు. ఆ సమయంలో జోసెఫ్ బాంక్స్ అనే ప్రకృతి శాస్త్రవేత్తతో జెన్నర్ కు పరిచయం కలిగింది. జోసెఫ్ తన సముద్ర అన్వేషణ యాత్రలో సేకరించిన కొన్ని వేల నమూనాలను జెన్నర్ కొన్ని నెలల్లోనే వర్గీకరించి వాటి వివరాలు అన్నిటినీ క్రోడీకరించి, ప్రదర్శించి ఎన్నో ప్రశంసలు పొందాడు. జోసెఫ్ మరొక యాత్రకు జెన్నర్ ను ఆహ్వానించినా, గ్రామీణ ప్రాంతంలో స్థిరపడి ప్రజలకు సేవచేయాలని ఉద్దేశంతో జెన్నర్ వెళ్లలేదు. కానీ తన గురువు హంటర్‌కు అవసరమయ్యే జంతువుల నమూనాలు, బ్రతికి ఉన్న జంతువుల వివరాలను రాసి పంపిస్తూ ఉండేవాడు. అలాంటి సమయంలో ఒకరోజు ఆవు పాల వ్యాపారం చేసే ఒక మహిళ జెన్నర్ వద్దకు వచ్చింది. తనకు మశూచి ఆవు నుండి అంటుకుందని చెప్పింది. ఆ విషయమే జెన్నర్ గోమశూచిపై పరిశోధనలు చేయడానికి ఉసిగొల్పింది. తర్వాత జెన్నర్ బెర్కిలీకు వెళ్లి మెడికల్ ప్రాక్టీస్ మొదలుపెట్టాడు. మశూచితో ప్రాణాలు పోగొట్టుకునే వారే జెన్నర్ మనసులో మెదిలేవారు. అలా జెన్నర్ మశూచిని నివారించే పద్ధతిని కనుగొనాలని దృఢంగా నిశ్చయించుకున్నాడు.



గోమశూచి సోకిన ఒక మహిళ శరీరంపై పుండ్లు పడ్డ చోటు నుంచి రసిని తీసి ఆరోగ్యంగా ఉన్న బాలుడికి సూది మందులా ఎక్కించాడు. దానివల్ల ఆ బాలుడికి కూడా కొంత గోమశూచి సోకింది. ఏడు వారాల తర్వాత అసలైన మానవ మశూచి సోకిన వ్యక్తి నుండి రసిని తీసి సూది మందులా ఎక్కించగా ఆ బాలునికి ఎటువంటి మశూచి సోకలేదు. గోమశూచి రసి ఆ బాలునిలో నిరోధక శక్తిని పెంచింది కనుక ఆ శక్తి వల్లనే అసలు మశూచి రసిని ఆ బాలుని శరీరంలోకి ఎక్కించిన ఏమీ కాలేదని జెన్నర్ గ్రహించాడు. అలా జెన్నర్ తన పరిశోధనలో సఫలీకృతుడైనా మొదట ఎన్నో విమర్శలకు గురైనాడు అయినా తన లక్ష్యాన్ని వదిలిపెట్టలేదు సరి కదా మరిన్ని పరిశోధనలు కొనసాగించాడు. తన వైద్య పద్ధతికి జెన్నర్ వ్యాక్సినేషన్ అని పేరు పెట్టాడు. లండన్‌లోని సెయింట్థామస్ ఆసుపత్రిలోని 'క్లయినీ' అనే వైద్యుడు జెన్నర్ తయారుచేసిన వాక్సీనన్ను మశూచి రోగిపై ప్రయోగించాడు. సత్ఫలితాన్ని చూసిన అతడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ఓ గ్రామ వైద్యుడు మశూచి నివారణోపాయం కనుగొన్నాడంటూ రాజవైద్యుడు 'సర్ వాల్టర్ పార్కర్'కు తెలిపాడు. అతడు జెన్నర్‌ను లండన్‌కు ఆహ్వానించాడు.

జెన్నర్ టీకా పద్ధతి ప్రపంచమంతా పాకి మశూచి తీవ్రత తగ్గసాగింది. దాంతో జెన్నర్ కీర్తి ప్రతిష్ఠలు పెరిగాయి. ఈ టీకా పద్ధతిని మతాధికారులూ ప్రోత్సహించారు. బ్రిటీష్ పార్లమెంటు 1802లో, 1806లో జెన్నర్‌కు భారీ ఎత్తున నిధులను సమకూర్చి పెట్టింది. జీవనభృతిని కూడా మంజూరు చేసింది. లండన్ ఆహ్వానం అందుకొనినా, జెన్నర్ తన జన్మస్థలం బర్కిలీని వదిలిపెట్టలేదు. దూరప్రాంతాలనుండి కూడా ప్రజలు ఉచితంగా వాక్సినేషన్ చేయించుకుని వెళ్ళడం మొదలుపెట్టారు.

జెన్నర్ ఎన్నో పరిశోధనలు చేసినప్పటికీ, మశూచి టీకా ఆయనకు కీర్తి ప్రతిష్టలను తెచ్చి పెట్టింది. ఈ వాక్సినేషన్ పద్ధతిని ఆధారంగా చేసుకుని ఫ్రెంచి శాస్త్రజ్ఞుడు లూయిస్ పాశ్చర్ అనేక రోగాలకు నిరోధక వాక్సిన్లు కనిపెట్టాడు. పక్షులు గ్రుడ్ల నుండి వెలువడిన వెంటనే వాటి వింత ప్రవర్తనపై జెన్నర్ ఒక వ్యాసం సమర్పించాడు. అది అతని తర్వాత వంద సంవత్సరాలకు శాస్త్రీయంగా ఆమోదించబడింది. జీవితాంతం వరకు పరిశోధనల్లో గడిపిన జెన్నర్ 1823, జనవరి 26న ప్రశాంతంగా కన్నుమూశాడు. ఆయన స్మృతికి చిహ్నంగా లండన్ నగరంలోని ట్రఫాల్గర్ స్క్వేర్‌లో ఆయన శిలాప్రతిమను నిర్మించి నివాళులర్పించాడు.

(మే 17, ఎడ్వర్డ్ జెన్నర్ జయంతి)

సుధాకర్.ఏ.వి, 9000674747

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ (భూ.సే) శాఖ
రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం
వికారాబాద్, వికారాబాద్ జిల్లా

ఫారం నెం : VII
(చట్టం -30/2013 లోని రూల్-25లో గల సబ్-రూల్ (1) మరియు సెక్షన్ 19(1)ను చూడండి)

డిక్లరేషన్

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నెంబర్: జి/2754/2025 తేది: 13.05.2026
రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఫైల్ నెంబర్ బి/16543/2025 తేది: 12.05.2026
గెజిట్ నెంబర్: వికెబి- 44/2026 తేది: 13.05.2026

వికారాబాద్ జిల్లా, దోమమండలం మండలం, దొంగయెన్నేపల్లిగ్రామంలో గల మొత్తం ఎసి. 23.10 ఎకరాల భూమి ఎన్‌హెచ్-167ఎన్ పై బుద్వేల్ వద్ద గల ఔటర్ రోడ్ (ఓఆర్ఆర్) నుండి నాచారం వరకు 81 కిమీ పొడవు రేడియల్ రోడ్-2 ఏర్పాటు కొరకు ప్రజా ప్రజా ప్రయోజనార్థం అవసరమైఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/ కలెక్టర్వారు భావిస్తున్నారు. అందువలన, వికారాబాద్ జిల్లా, దోమమండలం, దొంగయెన్నేపల్లిగ్రామంలో పై సదరు ప్రాజెక్ట్ కొరకు సేకరణ క్రింద భూమి ఎసి. 23.10 ఎకరాలు అనగా 9.34 హెక్టార్లు ప్రామాణిక కొలతలతో ఎక్కువ లేదా తక్కువ భూమియొక్క సవివర వివరణ దిగువ విధంగా ఉన్నది.

షెడ్యూల్

జిల్లా: వికారాబాద్ మండలం: దోమ గ్రామం: దొంగయెన్నేపల్లి

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూమి స్వభావం | భూమి రకం | సేకరించనున్న విస్తీర్ణం (ఎకరములలో) | పట్టాదారుని పేరు | సరిహద్దులు: తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు: రకం | సంఖ్య | కట్టడములు: స్వభావం | కొలతలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 148/ఆ/2 | పట్టా | ఖుష్కి | 0.08 | మాడిరోజా భర్త చంద్ర శేకర్ రెడ్డి | సర్వే నెం. 148 | సర్వే నెం. 148 | సర్వే నెం. 153 | సర్వే నెం. 148 | - | - | - | - |
| 2 | 148/ఇ | పట్టా | ఖుష్కి | 0.18 | ముద్రేచ్చ సురేష్ తండ్రి తులిషా | సర్వే నెం. 148 | సర్వే నెం. 147 | సర్వే నెం. 153 | సర్వే నెం. 148 | - | - | - | - |
| 3 | 148 | పట్టా | ఖుష్కి | 0.15 | రోడ్డు | సర్వే నెం. 148 | సర్వే నెం. 147 | సర్వే నెం. 153 | సర్వే నెం. 148 | - | - | - | - |
| 4 | 147/రూ | పట్టా | ఖుష్కి | 1.04 | జేపాండు తండ్రి పూర్య | సర్వే నెం. 148 | సర్వే నెం. 147 | సర్వే నెం. 140 | డోర్నాల్ పల్లె వి.బి. | - | - | - | - |
| 5 | 147/రు | సీలింగ్ పట్టా | ఖుష్కి | 0.09 | జె.హన్మంతు తండ్రి పూర్య | సర్వే నెం. 147 | సర్వే నెం. 147 | సర్వే నెం. 140 | డోర్నాల్ పల్లె వి.బి. | - | - | - | - |
| 6 | 140/2 | లావణి పట్టా | ఖుష్కి | 0.07 | చంద్రమ్మ భర్త తుల్జ్యా నాయక్ | సర్వే నెం. 148 | సర్వే నెం. 140 | సర్వే నెం. 139 | సర్వే నెం. 147 | - | - | - | - |
| 7 | 139/అ2 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 0.01 | కె.వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి సంజీవరెడ్డి | సర్వే నెం. 153 | సర్వే నెం. 139 | సర్వే నెం. 154 | సర్వే నెం. 140 | - | - | - | - |
| 8 | 139/అ1/2 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 0.02 | కొప్పుల సురేందర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి | సర్వే నెం. 153 | సర్వే నెం. 139 | సర్వే నెం. 154 | సర్వే నెం. 140 | - | - | - | - |
| 9 | 154/అ1/2 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 1.26 | కొప్పుల సురేందర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి | సర్వే నెం. 154 | సర్వే నెం. 139 | సర్వే నెం. 154 | సర్వే నెం. 148 | మామిడి చెట్లు | 15 | రాయి కంచె | 15 |
| 10 | 154/ఈ/1/1 | పట్టా | ఖుష్కి | 0.17 | ఎం. తుల్చ్యా తండ్రి టాక్రియ | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 11 | 154/ఈ/1/2 | పట్టా | ఖుష్కి | 0.16 | ముడావత్ బుజ్జి తండ్రి ఎం. తుల్చ్యా నాయక్ | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 12 | 154/ఈ/2/1 | పట్టా | ఖుష్కి | 0.17 | ఎం.అశోక్‌కుమార్ వర్మ తండ్రి నరహరి రావు | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 13 | 154/ఈ/2 2/1 | పట్టా | ఖుష్కి | 0.10 | మహేందర్కర్ బాలాజీ రావు తండ్రి లేట్ మహేందర్కర్ బాలాజీ | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 14 | 154/ఈ/2/2/2 | పట్టా | ఖుష్కి | 0.10 | డి.సరిక భర్త సంతోష్ | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 15 | 154/ఇ | పట్టా | ఖుష్కి | 0.22 | సబవాత్మణి భర్త దామ్లా | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 16 | 154/అ2 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 1.27 | కె.వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి సంజీవ రెడ్డి | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | మామిడి చెట్లు | 15 | రాయి కంచె | 15 |
| 17 | 154/ఆ1 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 0.23 | కె.వెంకట్‌రెడ్డి తండ్రి రామ్ చంద్ర రెడ్డి | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | చెట్లు | 50,30 | పైప్ లైన్ | 1,50,50 మీ.లు |
| 18 | 154 ఆ | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 0.23 | కొపుల మనోహర్ రెడ్డి తండ్రి రామ్‌చంద్రారెడ్డి | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 156 | సర్వే నెం. 154 | చెట్లు | 50,30 | రాయి కంచె, పైప్‌లైన్ | ,50,50 మీ.లు |
| 19 | 154 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 0.05 | రోడ్డు | సర్వే నెం. 154 | సర్వే నెం. 154 | సర్వే నెం. 156 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 20 | 156/ఇ/5 | పట్టా | ఖుష్కి | 1.08 | ముడావత్కిషన్ తండ్రి భిమ్లు | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 154 | - | - | - | - |
| 21 | 156/ఇ/3/1/1 | పట్టా | ఖుష్కి | 1.29 | పాపగారియోగేంద్రనాథ్‌రెడ్డి తండ్రి పాపగారి బాల వీరారెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| 22 | 156/ఇ/2/1 | పట్టా | ఖుష్కి | 3.00 | రమణిమిధ తండ్రి జనార్థన్ రెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| 23 | 156/ఇ/2/3 | పట్టా | ఖుష్కి | 3.00 | మీదా సుశీల్ రెడ్డి తండ్రి కృష్ణ రెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| 24 | 156/అ/2/1 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 1.00 | చాడ పద్మ భర్త చాడ సుధాకర్ రెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| 25 | 156/అ/2/2 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 1.00 | ఎం.కిష్టమ్మ భర్త లేట్ ఎం.మదన్ రెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| 26 | 156/అ/2/3 | దస్తు గర్ద ఇనాం | ఖుష్కి | 2.00 | ఎలాగంటి సత్య నారాయణరెడ్డి తండ్రి ఎలాగంటి రామచంద్రరెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| 27 | 156/ఇ/2/2 | పట్టా | ఖుష్కి | 0.33 | చాడ సుధాకర్ రెడ్డి తండ్రి రాజ రెడ్డి | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | సర్వే నెం. 156 | - | - | - | - |
| మొత్తంవిస్తీర్ణం | | | | ఎ.23.10 గుంటలు | | | | | | | | | |

చట్టం నం. 30/2013 లోని సెక్షన్ 15 క్రింద ఏర్పాటు చేసిన విధంగా ఆసక్తి గల వ్యక్తులు అభ్యంతరాలు విన్న తరువాత మరియు తగు విచారణ జరిపిన మీదట ఈ డిక్లరేషన్ ఇవ్వబడినది. భూ సేకరణ కారణం వల్ల ఇట్టి కుటుంబాలకు పునరావాసం కల్పించబడలేదు. అందువలన, పునరాశ్రయం తలెత్తదు.

ప్రాజెక్ట్ నిర్మాణ దశలో అవసరమైన త్రవ్వబడే లేదా తొలగించబడే లేదా వినియోగించబడే గనులు మరియు ఖనిజాల వంటివి బదులుగా, సదరు భూమిలో ఉన్న బొగ్గు, ఇనుప రజను, పలక లేదా ఇతర ఖనిజాలు ఉన్నయెడల, అవి అవసరం లేదు. భూమి యెక్క ప్లాన్ భూ సేకరణ అధికారి & జిల్లా వికారాబాద్, వారి కార్యాలయంలో ఏదేని పని దినమున తనిఖీ చేసుకోవచ్చును.

సం/- తహశీల్దార్ దోమ మండలం
సం/- రెవెన్యూ డివిజనల్ అధికారి /ఎల్.ఎ.ఓ. వికారాబాద్ జిల్లా
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వికారాబాద్ జిల్లా
సం/- కలెక్టర్ వికారాబాద్ జిల్లా

DIPR Ro No. 202/LA-PP/ADVT/AGENCY/2026-27

# పోరాటాలతోనే హక్కుల సాధన

బిజెపివి అవకాశవాద రాజకీయాలు

ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి

ఉత్సాహపూరిత వాతావరణంలో మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా మహాసభలు






**ప్రజాపక్షం/ వైరా :** మహిళా పోరాటాలతోనే హక్కులు సాధించబడ్డాయని ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు మహిళలు సిద్ధం కావాలని తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెదునూరి జ్యోతి పిలుపునిచ్చారు. ఎందరో సంఘ సంస్కర్తలు, అమరుల పోరాటాల ఫలితంగా ఆస్తి, విద్య, సమానత్వపు హక్కు సహా పలు హక్కులను సాధించామని ప్రస్తుత పాలకులు ఆ హక్కులను నీరు గారుస్తూ మహిళా వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభలు శనివారం వైరాలోని తుల్లూరు తులశమ్మ నగర్ (కమ్మ వారి కళ్యాణ మండపం)లో జరిగాయి. పోటు కళావతి, దండి శ్రీజ, సిహెచ్ సీతామహాలక్ష్మి, బేబీ రాణి అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన నెదునూరి జ్యోతి మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా మహిళల జీవితాల్లో మార్పులు వస్తున్నాయని ప్రగతిశీల మార్పుల దిశగా మహిళా సమాఖ్య పని చేస్తుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ చట్ట సభల్లో కల్పించేందుకు బిల్లు ప్రవేశ పెట్టడం వెనక బిజెపి అవకాశవాద రాజకీయం దాగి ఉందన్నారు. ప్రస్తుత పార్లమెంటు సభ్యులకు అనుగుణంగానే బిల్లును ప్రవేశపెట్టవచ్చు కానీ బిజెపి ఆ దిశగా ఆలోచించకుండా డిలిమిటేషన్‌తో ముడి పెట్టిందని ఆమె తెలిపారు. కేవలం విపక్షాలను విమర్శించడం కోసం మాత్రమే బిల్లును ప్రవేశ పెట్టారు తప్ప బిల్లుపై బిజెపికి చిత్తశుద్ధి లేదన్నారు. దేశంలో మహిళలపై బిజెపి పాలనలో దాడులు పెరుగుతున్నాయని బిజెపి పాలిత రాష్ట్రాల్లో కనీస న్యాయం గురించి ప్రశ్నించడం నేరంగా పరిగణిస్తున్నారని ఆమె తెలిపారు. మను ధర్మ శాస్త్రాన్ని ప్రబోధించడం ద్వారా బిజెపి ప్రజలను తప్పుదారి పట్టిస్తుందని ఆమె తెలిపారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానాలు శ్రామిక మహిళలకు శాపంగా మారాయని పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు బతకలేని స్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుని పట్ల పోలీసులు, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని, సత్వరం బండి భగీరథను అరెస్టు చేసి తగు రీతిలో శిక్షించాలని జ్యోతి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. తులం బంగారం, నెలకు రూ.2,500 ఖాతాల్లో జమ, విద్యార్థులకు స్కూటీలు సహా అన్ని హామీలను నెరవేర్చాలని, సమాన పనికి సమాన వేతనం లభించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

**మహిళా చైతన్యంతోనే సమాజ మార్పు : చంద్రకళ**

మహిళా చైతన్యంతోనే సమాజంలో మార్పు వస్తుందని మహిళల స్థితిగతులను బట్టి సమాజాభివృద్ధిపై అంచనా వేయవచ్చునని వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ కాపా చంద్రకళ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు పూర్తి స్థాయిలో అట్టడుగు వర్గాలకు చేరడం లేదని అవి పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు మహిళా సమాఖ్య పోరాటాలు దోహదపడాలని ఆమె కోరారు. నాయకత్వ లేమి కూడా మహిళలకు శాపంగా మారుతుందని అత్యుత్తమ నాయకత్వం తయారు కావాలని ఆమె ఆకాంక్షించారు. మహిళల్లో ఆరోగ్యం పట్ల కూడా చైతన్యం అవసరమని జబ్బులకు భయపడితే ప్రాణాలకే ప్రమాదమని మారిన ఆధునీక యుగంలో ప్రతి వ్యాధికి చికిత్స ఉందని దానిని త్వరితగతిన పొందడం ద్వారా ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని డాక్టర్ కాపా చంద్రకళ సూచించారు. మహిళా సమాఖ్య జిల్లా మహాసభలను పురస్కరించుకుని ఐద్వా నాయకురాలు బుగ్గవీటి సరళ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి సందేశాలు ఇచ్చారు. బలమైన మహిళా ఉద్యమాలే ప్రజా చైతన్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయని వారు తెలిపారు. గ్రామ స్థాయి నుండి మహిళా ఉద్యమాన్ని నిర్మించడమే మహిళల పట్ల జరుగుతున్న వివక్ష, దాడులకు పరిష్కారమని వారు సూచించారు.

ప్రతి ఘటనపైన మహిళలు స్పందించే తత్వాన్ని అలవర్చు కోవాలని వారు సూచించారు. ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు, మహిళా సమాఖ్య నిర్మాణ బాధ్యులు దొండపాటి రమేష్, మహిళా సమాఖ్య నాయకురాలు ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, బత్తినేని నీరజ, నల్లమోతు శైలజ, మందడపు రాణి, కర్నాటి నళిని, ఏపూరి పద్మ, కారం కోటమ్మ, మేళ్లచెరువు లలిత, జమ్ముల లక్ష్మి, రంజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు. మహాసభ ప్రారంభ సూచికంగా మహిళా సమాఖ్య పతాకాన్ని బత్తినేని నీరజ ఆవిష్కరించారు. మహిళా సమాఖ్య నాయకురాలు తాటి నిర్మల సంతాప సందేశాన్ని ప్రవేశపెట్టగా కార్యదర్శి నివేదికను ఏపూరి లతాదేవి ప్రవేశపెట్టారు. ఆహ్వాన సంఘ అధ్యక్షురాలు నల్లమోతు శైలజ అధ్యక్ష ఉపన్యాసం చేశారు.

## దేవాదుల పూర్తికి రూట్ మ్యాప్ సిద్ధం

2027 డిసెంబర్ చివరినాటికి పూర్తి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దేవాదుల ఎత్తిపోతల పథకం(జెసిఆర్‌డిఎల్ఐఎస్)ను 2027 డిసెంబర్ చివరినాటికి పూర్తి చేసేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల, శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై శనివారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ(సీతక్క) లతో కలసి మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. లోకసభ సభ్యుడు బలరాం నాయక్, ఉమ్మడి వరంగల్ జిల్లాల ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె. ఆర్.నాగరాజు,మురళినాయక్, దొంతు మాధవరెడ్డి, జి. సత్యనారాయణ,రామచంద్ర నాయక్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నీటిపారుదలశాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్,సలహాదారు ఆదిత్య దాస్ నాథ్, ఇ. ఎన్.సి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2004–2005 లో అప్పటి కాంగ్రెస్ పార్టీకి చెందిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో రూ.6,016 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్మాణం గడిచిన బిఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురి కావడంతో అంచనా వ్యయం రూ.18,400 కోట్ల కు పెరిగిందని ఆయన తెలిపారు.ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై రూ.14,422 కోట్లు ఖర్చు పెట్టామని మరో రూ.3,978 కోట్లతో 2027 డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేసినట్లు ఆయన చెప్పారు. 38.16 టిఎంసిల నీటితో హనుమకొండ ,వరంగల్,జనగామ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు కరీంనగర్ జిల్లాలకు చెందిన 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు.ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 87.70 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ప్రధాన పంప్ హౌస్‌లు, పైప్‌లైన్ వ్యవస్థలు, సొరంగ తవ్వకాల పనులు ఎక్కువగా పూర్తయ్యాయని చెప్పారు. అయితే కాల్వల లైనింగ్, పంపిణీ కాల్వల పనులు, కొన్ని నిర్మాణాల ఆలస్యం, భూసేకరణ సమస్యలు పూర్తి స్థాయి వినియోగాన్ని అడ్డుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు.ఫేజ్1లోని ప్యాకేజీ45 పూర్తిగా ముగిసిందని, ప్యాకేజీ46 పనులు 96.86 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అయితే బొల్లికుంట సమీపంలో 700 మీటర్ల కాల్వ లైనింగ్ పనులు కోర్టు కేసు కారణంగా నిలిచిపోయి వేల ఎకరాలకు సాగునీటి లాభాలు ఆలస్యమవుతున్నాయని ఆయన చెప్పారు.ఫేజ్2లో హెడ్‌వర్క్స్, పంప్ హౌసులు, ప్రధాన పైప్ లైన్ వ్యవస్థలు ఎక్కువగా పూర్తయ్యాయని మంత్రి తెలిపారు.

## అకాల వర్షాలతో రైతుల ఇబ్బందులు

కేంద్రం నుంచి స్పందనలేదు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** అకాల వర్షాలతో రైతులు ఇబ్బంది పడుతున్నా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం దారుణమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. పిఎస్ఎస్ స్కీంలో ఉన్న శనగ, పొద్దుతిరుగుడు పంటలపై 25శాతం సీలింగ్ పరిమితిని 50 శాతానికి వెంటనే పెంచాలని మంత్రి డిమాండ్ చేశారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ మరియు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి మొక్కజొన్న కొనుగోళ్లు, నిల్వ సౌకర్యాలు, గన్ని బ్యాగుల లభ్యత, రవాణా ఏర్పాట్లు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రైతుల నుండి 9.57 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న సేకరించినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయకపోయినా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్వంత నిధులతో రూ.4 వేల కోట్ల వ్యయంతో మొక్కజొన్న కొనుగోలు చేపట్టిందన్నారు. అదేవిధంగా, రాష్ట్రంలో సాగవుతున్న జొన్న పంటను కూడా రూ.1,000 కోట్లతో సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు రాష్ట్ర రైతుల సమస్యలను కేంద్ర దృష్టికి తీసుకెళ్లి, శనగ, పొద్దుతిరుగుడు కొనుగోలు పరిమితిని 50 శాతానికి పెంచించడంతో పాటు, మొక్కజొన్న, జొన్నలను పిఎస్ఎస్‌లో చేర్చేలా కృషి చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, వారి కష్టానికి తగిన ప్రతిఫలం అందించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆ బాధ్యతల నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకుని పనిచేస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమమే పరమావధిగా రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతోందని స్పష్టం చేశారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై బిఆర్ఎస్ విమర్శలు 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లే'

ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం విషయంలో బిఆర్ఎస్ నాయకుల తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందని ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదిన్నరేళ్లు అధికారంలో ఉన్న సమయంలో కేసీఆర్ చేసిన ద్రోహంపై అప్పటి మంత్రులు ఒక్క మాట కూడా మాట్లాడలేదని, ఇప్పుడు ముసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. 2013లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల పోరాటంతో అప్పటి ప్రభుత్వం డిపిఆర్ కోసం రూ.6 కోట్లు కేటాయించిందని గుర్తుచేశారు. అయితే 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాజకీయ ప్రయోజనాల కోసం జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్‌కు ప్రాజెక్టు మూలాన్ని మార్చారని ఆరోపించారు. డిపిఆర్ తయారీకి కెసిఆర్‌కు ఏడు సంవత్సరాలు పట్టిందని విమర్శించారు. ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వకుండా రూ.27 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత కెసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని అనుమతులు తీసుకొచ్చి ఇప్పటికే రూ.7 వేల కోట్లు ఖర్చు చేసిందని తెలిపారు. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చే యాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని, భూసేకరణ కోసం రూ.6 వేల కోట్లు వెచ్చిస్తున్నామని చెప్పారు. డిపిఆర్‌కు ఏడేళ్లు ఎందుకు పట్టిందో బిఆర్ఎస్ సమాధానం చెప్పాలి అని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ప్రశ్నించారు. దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు కాంగ్రెస్ హయాంలోనే బీజం పడిందన్నారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు పనులు చేయని మాజీ మంత్రులు ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరమన్నారు. కరివెన దగ్గర కుర్చీ వేసుకుని కూ ర్చుని ప్రాజెక్టు పూర్తి చేస్తానని కెసిఆర్ చెప్పారని గుర్తుచేశారు.



ఇటీవల ఎమ్మెల్సీగా, తెలంగాణ ఉద్యమకారుల కమిటీ సభ్యులుగా నియమితులైన ఎం.కోదండరాం. శనివారం మఖ్దూంభవన్‌కు విచ్చేసిన సందర్భంగా ఆయనను సత్క-రిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్.

## 21 నుంచి సరస్వతీ అంత్య పుష్కరాలు

కాళేశ్వరానికి 40 లక్షల మంది భక్తుల రాక అంచనా..

విస్తృత ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సరస్వతీ అంత్య పుష్కరాలు ఈనెల 21 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో కాళేశ్వరంలో భారీ ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దాదాపు 30 నుంచి 40 లక్షల మంది భక్తులు పుష్కరాలకు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని మంత్రులు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో శనివారం జరిగిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మే 21 ఉదయం 5.43 గంటలకు జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పుణ్యస్నానం ఆచరించి పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. మొదటి రోజు రాష్ట్ర గవర్నర్ కూడా పుణ్యస్నానాల్లో పాల్గొంటారని తెలిపారు. పుష్కర ఘాట్‌ల వద్ద పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీటి సదుపాయాలు, వైద్య సేవలు, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించినట్లు చె ప్పారు. వివిధ పీఠాధిపతులు, స్వామీజీల రాక దృష్ట్యా ప్రత్యేక ప్రోటోకాల్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఇటీవల విజయవంతంగా నిర్వహించిన మేడారం జాతర తరహాలోనే సరస్వతీ అంత్య పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి రోజు హోమాలు, ఘాట్ హారతులు, సాంస్కృతిక కార్యక్రమాలు, తెప్పోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ, పెద్ద సం ఖ్యలో భక్తులు రానున్నందున శానిటేషన్, రవాణా, ట్రాఫిక్, భద్రత, తాగునీటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, 2012 సరస్వతీ పుష్కరాలకు కేవలం 2 లక్షల మంది మాత్రమే హాజరయ్యారని, గత ఏడాది ఆది పుష్కరాలకు సుమారు 40 లక్షల మంది వచ్చినట్లు తెలిపారు. ఈసారి ప్రత్యేకంగామ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. అధికారుల వివరాల ప్రకారం, ఘాట్‌ల వద్ద టెంట్ హౌస్‌లు, 100 గదుల చౌల్ట్రీ, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు, నిరంతర విద్యుత్ సరఫరా, తాత్కాలిక బస్ స్టేషన్లు, షటిల్ బస్సులు, వైద్య శిబిరాలు, అంబులెన్సులు, సిసిటివిపర్యవేక్షణ, వాచ్ టవర్లు, మొబైల్ కనెక్టివిటీ, సూచిక బోర్డులు వంటి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

## పెట్రోల్ , డీజిల్ పెంపు ప్రజలపై మోయలేని భారం: చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రజలపై డీజిల్ పెట్రోల్ ధరలు పెంచి మోయరాని భారాన్ని మోపిందని శనివారం ఓ ప్రకటనలో విమర్శించారు. 5 రాష్ట్రాల ఎన్నికలలో ఎన్‌డిఎ కు ఓట్లు వేయించుకొని అవసరం తీరాక పెట్రోల్ డీజిల్ రూపంలో భారం మోపారని వారన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పుడు పెట్రో ధరలు తగ్గించకుండా, పెరిగినప్పుడు మాత్రం సమానంగా ధరలు పెంచడం విచారకరమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కంటి తుడుపు చర్యలను పాటిస్తూ ప్రజలపై మాత్రం అధిక ధరలు మోపుతున్నారని వెంకట్ రెడ్డి విమర్శించారు.

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
ఇరిగేషన్ సర్కిల్, హిల్ కాలనీ, నల్లగొండ జిల్లా.

నల్లగొండ జిల్లా, హిల్ కాలనీ, ఇరిగేషన్ సర్కిల్ నుండి టెండర్లు ఆహ్వానించుచున్నారు. టెండర్ నోటీసు నెం. 02SE/ICHC/2026-27, Dt: 15.05.2026, పని పేరు: "Removing and Shifting of old Rubber seals to Dam workshop and Providing of new Rubber seals for Radial crest Gates of Nagarjuna sagar Dam, Nalgonda (D)" for ECV of Rs. 41,16,204/- తేది: 18.05.2026 నుండి 25.05.2026, 3:00PM వరకు దరఖాస్తులు లభిస్తాయి మరియు చివరి తేది: 25.05.2026, 4:00 PM వరకు స్వీకరిస్తారు. తదుపరి సమాచారము కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్‌ను సంప్రదించగలరు.

Sd/- B.V.Mallikarjuna Rao, 15.05.2026.
పర్యవేక్షక ఇంజనీర్, ఇరిగేషన్ సర్కిల్, హిల్.

DIPR R.O. No. : 2523-PP/CL/ADVT/2026-27, Date: 16-05-2026

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పుస్తక ప్రదర్శన...



**ప్రజాపక్షం/యాచారం :** యాచారం మండల కేంద్రంలోని గ్రంథాలయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పుస్తక ప్రదర్శన నిర్వహిండం జరిగింది. ప్రతినిత్యం గ్రంథాలయానికి వచ్చి బుక్స్ చదువుతున్న సినియర్‌లకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి కిషన్‌నాయక్ మాట్లాడుతూ గ్రంథాలయాలు మనకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. విజ్ఞాన్ని అందిచే బాండాగారం గ్రంథాలయని అయన కోనియాడారు. విద్యార్థులు, యువతి యువకులకు గ్రథాలయం ఉపయోగపడుతుందని తెలిపారు. అందరు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శ్రీనాథ్,కాంగ్రేస్ పార్టీ నాయకులు మస్కు శరణం,గ్రంథాలయ నిర్వాకుడు బి. సత్తయ్య, ఎంఈఒ కార్యాలయం సిబ్బంది ,రిడర్స్ పాల్గోన్నారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి



**ప్రజాపక్షం/యాచారం :** ఇందిరమ్మ ఇండ్లు మంజూరి అయిన ప్రతి నిరుపేద కుటుంబం ఇల్లు కుట్టుకోవాలని ఎంపిడిఒ రాధ రాణి అన్నారు. శనవా రం యాచారం మండల పరిధిలోని చౌదర్‌పల్లి, చిన్న తూండ్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అమే మాట్లాడుతూ ఇండ్లులేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ళు మంజూరి చేసింది దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇండ్ల నిర్మాణ విషయంలో ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. బిల్లులు సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. దళారులను నమ్మవద్దని అమే తెలిపారు. ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు చెందిన ప్రజలకు అండగా ప్రభుత్వం ఉందన్నారు. ఎవరైన కట్టుకునే పరిస్థితి లేని వారు అధికారుల దృష్టికి తెవాలన్నారు. అందరు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శులు, లబ్ధిదారులు తదితరులు పాల్గోన్నారు.

## ఉద్యమకారుల గుర్తింపు కమిటీ అభినందనీయం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని ఉద్యమకారుల సంక్షేమ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి పేర్కొన్నారు. ఉద్యమకారులను గుర్తించిన నేపథ్యంలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్, సిరాసుద్దీన్, రవికుమార్ గౌడ్, మేకల వెంకటేష్, ఉమా ప్రసాద్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

## జెపి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన మైనార్టీ చైర్మన్ ఇఫ్రాన్ అలీ



**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రసిద్ధి చెందిన జెపి దర్గాలో తెలంగాణ రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఇఫ్రాన్ అలీ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జెపి దర్గాను సందర్శించి మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ ఇఫ్రాన్ అలీ మాట్లాడుతూ బాబా అశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకువెళ్తుందని వివరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు కొత్త పథకాలకు శ్రీకారం చూట్టడం జరుగుతుందని తెలిపారు. దర్గాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సిరాజ్, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నేతలు మహ్మద్ ఇబ్రహీం, అబ్దుల్ ఖదీర్, యూసుఫ్, నజర్‌లు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణకు ప్రజలందరూ కృషి చేయాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దోమలను నియంత్రించేందుకు ప్రజలందరు కృషి చేయాలని, ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలనే విషయాన్ని గమనించాలని షాద్‌నగర్ హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ జె.శ్రీనివాసులు సూచించారు. శనివారం జాతీయ డెంగ్యు దినోత్సవం సందర్భంగా ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఆధ్వర్యంలో సంధ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ దోమలు కుట్టకుండా చూద్దాం..పుట్టకుండా చూద్దాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడేగా పాటిద్దాం.. దోమల అంతానికి కళ్లెం వేద్దామని నినాదాలు ఇస్తూ ర్యాలీ కొనసాగించారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, దోమల ద్వారా డెంగ్యు, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్య, మెదడువాపు వ్యాధులు వస్తాయని గుర్తు చేశారు. ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకునేందుకు ప్రజలందరు కృషి చేయాలని, నీరు నిల్వ లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. డెంగ్యు వ్యాధి ఎడిస్ దోమ కుట్టడం వల్ల వస్తుందని, డెంగ్యు వ్యాధి చికెన్ గున్యా వ్యాధి కంటే ఎక్కు శక్తిని మనిషి శరీరంలో నుండి తీసివేస్తుందని వివరించారు. వ్యాధి వచ్చిన 50మందిలో ఒకరు చనిపోయే ప్రమాదం ఉందని, దోమలు నిల్వ ఉన్న నీటి పరిసరాల్లో పెరుగుతాయని గుర్తు చేశారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని దోమలను నియంత్రించేందుకు ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి వైద్యాధికారులు డాక్టర్ సంధ్య, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ ప్రవీణ, హెల్త్ సూపర్ వైజర్ శ్రీరామ, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



# 100 శాతం చెత్త సేకరణే లక్ష్యం

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో సాట్ చెత్త సేకరణ వాహనాల ద్వారా 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ నిర్వహించాలని కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. మౌలాలి సంజయ్ గాంధీ నగర్, మల్కాజిగిరి మహేంద్రహిల్స్, ఇందిరా నెహ్రూ నగర్, ఆనంద్‌బాగ్, తుకారాం గేట్ ప్రాంతాల్లో ఆయన అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. మౌలాలిలోని సంజయ్ గాంధీ నగర్ మజిదు రోడ్డులో డిసి, డిఈ, రాంకీ ప్రతినిధులు, ఈపిటిఆర్ఐ, ఎంటమలాజి సిబ్బందితో కలిసి కమిషనర్ క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించారు. దోమల లార్వా పెరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, ఫాగింగ్, యాంటీ లార్వల్ ఆపరేషన్ల అమలుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. దోమల వ్యాప్తి నివారణకు ముందస్తు చర్యలు, ముమ్మరం చేయాలని, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ఆర్‌పిఎఫ్ ట్రైనింగ్ సెంటర్లోని వినియోగంలో లేని బావిని పరిశీలించిన కమిషనర్, నిల్వ నీటితో దోమల లార్వా పెరిగే ప్రమాదం ఉందన్నారు. బావిని శుభ్రపరిచి పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహేంద్రహిల్స్, ఇందిరా నెహ్రూ నగర్ కొండ ప్రాంతాల్లో సాట్ ఆటోలు ప్రతి ఇంటికి చేరడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తించిన కమిషనర్, ఇంటింటి చెత్త సేకరణ తప్పనిసరిగా జరిగేలా సాట్ ఆటో డ్రైవర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. మౌలాలిలోని ఆనంద్‌బాగ్ మెయిన్ రోడ్ ఏఎన్ఆర్ నగర్ కాలనీలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను కూడా కమిషనర్ పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో మాట్లాడి పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు, సమయపాలన, పనితీరుపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. చివరగా తుకారాం గేట్, న్యూ వెంకటేశ్వర నగర్ ప్రాంతాల్లో సాట్ ఆటో డ్రైవర్లతో సమావేశమైన కమిషనర్, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఒక్క కలెక్షన్ పాయింట్ కూడా మిస్ కాకుండా చెత్త సేకరణ చేపట్టి, నగర పరిశుభ్రతను మెరుగుపర్చాలని సూచించారు.

### మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలి

నగర పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఫీల్డ్ స్థాయి పనితీరుపై మల్కాజిగిరి మున్సిపల్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి జోనల్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఏలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ నగర పరిశుభ్రత ను మరింత మెరుగుపరిచే దిశగా అధికారులకు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా సాట్ ఆటోల ద్వారా 100 శాతం ఇంటింటి చెత్త సేకరణ కవరేజ్ సాధించి, మిగిలిన గ్యాప్‌లను పూర్తిచేయాలని ఆదేశించారు. రోడ్ల అంచులు, మిడియన్‌లను నిరంతరం శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక స్వీపింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. నగరంలో గుర్తించిన భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే మ్యాపింగ్ చేసి తొలగించాలని ఆదేశించారు. స్వీపర్ల హాజరును క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తూ గైర్హాజరు సమస్యలను నియంత్రించాలని అధికారులకు సూచించారు. నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ స్పష్టం చేశారు.



## ప్రీ-ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ జిల్లా కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, అదనపు కమిషనర్ (ఎన్నికలు) కుమారి చంద్రకళతో కలిసి 15 అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్‌ఓలతో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ఎస్ఐఆర్ షెడ్యూల్, సన్నాహక కార్యక్రమాలు, ఎన్నికల డేటా ఖచ్చితమైన మ్యాపింగ్ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా అధికారులు పలు కీలక సూచనలు జారీ చేశారు. ఎస్ఐఆర్ షెడ్యూల్‌పై ఎన్నికల సంఘం ప్రకటించిన మార్గదర్శకాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. ప్రీఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని, బిఎల్ఓ సూపర్‌వైజర్లు, బిఎల్ఓలకు సమగ్ర శిక్షణ అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గణన పత్రాలను సకాలంలో ముద్రించి అందుబాటులో ఉంచాలని, ఎస్ఐఆర్ సమయంలో తప్పుడు మ్యాపింగ్ జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై తరచుగా అడిగే ప్రశ్నలకు సంబంధించిన సమాచారాన్ని కమిషనర్ విడుదల చేశారు. ప్రక్రియ సజావుగా సాగేందుకు బిఎల్‌ఓలు, ఎన్నికల అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు.

## పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తక్షణమే తగ్గించాలి

### బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. శనివారం షాద్‌నగర్‌లో కేంద్రం పెంచిన ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అంధించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్ముడుపోయి ఆయిల్ కంపెనీలను ప్రైవేట్ పరం చేయడంతోపాటు ఇష్టం ఇచ్చినట్లు ధరలు పెంచుతుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని మండిపడ్డారు. దేశంతో ప్రభుత్వం ఉండా..లేదా అన్నట్లుగా కనిపిస్తుందని అన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలను పెంచి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదని, కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వమని మండిపడ్డారు. అంతర్జాతీయ మార్కెట్ క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగాయని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజల మీద భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పెంచిన ధరలను తక్షణం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రమేష్ యాదవ్, కొత్తూరు మండల ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి శేఖర్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ నాయకులు రాములు గౌడ్, జంగయ్యలు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి కేంద్రీకరించండి సారూ!

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం ఇచ్చిన జెఏసి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు పాలవర్గం చర్యలు తీసుకోవాలని పెండింగ్ ప్రాజెక్టుల జెఏసి కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు పెండింగ్ ప్రాజెక్టుల విషయంపై వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జెఏసి నేతలు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి చలనం రావడం లేదని, ఎక్కడి ప్రాజెక్టులు అక్కడే ఉన్నాయని వివరించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి ఉన్నారని, ఈ ఐదేళ్ళ కాలంలోనైనా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రాన్ని తీసుకువచ్చామనే విషయాన్ని పాలకులు గుర్తించాలని కోరారు. ఇప్పటికే ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలను సైతం ఇచ్చామని గుర్తు చేశారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే వెనుకబడిన పాలమూరు జిల్లా అభివృద్ధి సాధించేందుకు అస్కారం ఉంటుందని వివరించారు. షాద్‌నగర్‌కు ఎత్తులో ఉన్న లక్ష్మీ దేవిపల్లి వద్ద రిజర్వాయర్‌ను నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఇందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చురుకుగా పని చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పెండింగ్ ప్రాజెక్టుల జెఏసి నేతలు బేక్క జనార్ధన్, పరమేశ్వర్ గౌడ్ తదితరలు పాల్గొన్నారు.

# కార్పొరేట్ల కాపలాదారుడు మోదీ

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కార్పొరేట్ల కాపలాదారుడు భారత ప్రధాని నరేంద్రమోదీ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి విమర్శించారు. సిపిఐ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు స్థానిక పార్టీ అబ్దుల్లాపూర్ మెట్ మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ అధ్యక్షతన పెద్ద అంబర్పేట్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆ పార్టీ నాయకులు ఆందోజు రవీంద్ర చారీ, ముత్యాల యాదిరెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అయిదు రాష్ట్రాల ఎన్నికల తరవాత ప్రజల పైన భారం పడుతుందని దేశ ప్రజలు అనుకున్నట్లే పెట్రోల్, డిజిల్‌తో పాటు గ్యాస్ ధరలు కూడా అధికంగా పెరగటాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ తీవ్రంగా కండిస్తుందన్నారు. తక్షణమే పెట్రోల్, డిజిల్, గ్యాస్ నిత్యవసరల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.అంతకు ముందు పార్టీ కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.పెరిగిన పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ నిత్యవసర ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ కార్పోరేట్లు అంబానీ, ఆదాని వాళ్ళ మెప్పు పొందడానికి వాళ్ల భజన చేస్తున్నాడని ఆరోపించారు. పెట్రోల్ డీజిల్ ధరలు పెరగటం వలన నిత్యాచారాల ధరలపై పెను బారం పడి సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు గురి కావడం వలన నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ దేశ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సమితి జిల్లా కార్యదర్శి దాసరి ప్రసాద్, రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి,సైదులు ముదిరాజ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు, ఆవుల యాదగిరి,మంగళపల్లి రవి,పానుగంటి సాయిలు, దవుల రాములు,పావిరాల అశోక్, అనిల్, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,గణేష్ నాయక్.మండల కార్యవర్గ కౌన్సిల్ సభ్యులు మహిళా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలో సమస్యలపై పాదయాత్ర



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ డివిజన్ పరిధిలోని జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో గల పలు సమస్యలు, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కాలనీలో పర్యటించి సమస్యలను స్వయంగా పరిశీలించినట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్యలతో పాటు పార్కు, కమ్యూనిటీ హాల్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించి అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి చిన్న చిన్న సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు.జనప్రియ వెస్ట్ సిటీ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనప్రియ వెస్ట్ సిటీ కాలనీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సిటీ స్కాన్‌ను అందుబాటులో తేవాలి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో సిటీ స్కాన్ ను త్వరగా ప్రజలకు అందుబాటులో తీసుకోరావాలని వనస్థలిపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా శనివారం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేందర్ ను కలిసి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా చింతల రవికుమార్ మాట్లాడుతూ గత ఆరు నెలల క్రితం ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి సహకారంతో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృషితో ఏరియా ఆసుపత్రికి సిటీ స్కాన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరాడంతో ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, కానీ అధికారుల నిర్లక్ష్యంతో సిటీ స్కాన్‌ను త్వరగా ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. అధికారులు తక్షణమే స్పందించి సిటీ స్కాన్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆయన కోరారు. సిటీ స్కాన్ లేకపోవడం ద్వారా గర్భిణీ స్త్రీలు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులకు సిటీ స్కాన్ ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, కొలిశెట్టి సంజయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ఆనంద్‌రాజు, శక్తి కిషోర్, పరమేశ్వర్ గౌడ్, విజయ్, కిషోర్, వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.


## శేరిలింగంపల్లిలో డెంగీ, మలేరియాపై అవగాహన ర్యాలీ

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా పిహెచ్‌సి, శేరిలింగంపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని శేరిలింగంపల్లిలో ఘనంగా నిర్వహించా రు. కార్యక్రమంలో ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి అమర్ సింగ్ నాయక్, జిల్లా మలేరియా అధికారి డా.చి.రాకేష్, అర్బన్ హెల్త్ ప్రోగ్రామ్ అధికారి డా.టి. వినోద్, డా. పునమ్, శ్రీకాంత్‌లు పాల్గొని శేరిలింగంపల్లి సిగ్నల్ నుండి రైల్వే స్టేషన్ వరకు ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కుటుంబ సం క్షేమ శాఖ సంచాలకులు అమర్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ శేరిలిగంపల్లి మండలంలో డెంగ్యూ, మలేరియా పరిస్థితిని సమీక్షించి, జిల్లా మలేరియా అధికారి, ఎంటమాలజీ బృందాన్ని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వెక్టర్ బోర్న్ వ్యాధుల నివారణ చర్యలపై విలువైన సూచనలు ,సలహాలు అందించారు. నీటి నిల్వలు, అపరిశుభ్రత ప్రాంతాలు, హైసింత్ మొక్కలతో నిండిన చెరువులు, పొంగిపోర్లుతున్న కాలువలు, దోమల పెరుగుదలకు అనుకూల ప్రాంతాలను గుర్తించి సూమారు 200 ప్రాంతాలలో జిపిఎస్ గూగుల్ లొకేషన్ వివరాలను సేకరించి సిఎంసి బృందాలను, మున్సిపల్ అధికారులను పంపించి చెరువులు, నాలలను శుభ్రపరచడానికి పంపించామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి నీటి డ్రమ్‌లు, ప్లాస్టిక్ కంటైనర్లు, పాత కూలర్ల లోపలి భాగాలను శుభ్రపరుచుకొని దోమల పెరుగుదలను అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ శేరిలింగంపల్లి మెడికల్ అధికారి ఉమా దిపిక, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నియంత్రించేందుకు సొంత నిధులతో బోరు వేయించిన ఎమ్మెల్సీ

### హర్షం వ్యక్తం చేసిన నాగులపల్లి గ్రామస్తులు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తాగునీటి ఎద్దడి నియంత్రించేందుకు ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తన సొంత నిధులతో బోరు వేయించారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సర్పంచ్ రాధిక అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో బోరు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నాగులపల్లి గ్రామంలో తాగునీటి ఎద్దడి ఉందని సర్పంచ్ రాధిక అశోక్‌రెడ్డి తన దృష్టికి తీసుకువచ్చారని, దాంతో తక్షణమే స్పంధించిన బోరు వేయించడం జరిగిందని పేర్కొన్నారు. మంచినీటి కోసం ఎక్కడ ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించుందుకు కృషి చేస్తానని అన్నారు. బోరులో నీరు సమృద్ధిగా రావడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. దాంతో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈదులపల్లి సర్పంచ్ సులోచన గణేష్ గౌడ్, ఉప సర్పంచ్ కిరణ్‌గౌడ్, నాయకులు జయరాం గౌడ్, వార్డు సభ్యులు మొగుటం కుమార్, రజిత, లక్ష్మీ నరసింహాస్వామి, బౌరయ్య, గోపాల్‌రెడ్డి, నరసింహారెడ్డి, నరసింహా, నారాయణ, సందీప్, రఘురాంరెడ్డి, కుమార్‌గౌడ్, మహేష్, శ్రీధర్, గోపాల్‌రెడ్డి, జంగయ్య, చంద్రశేఖర్, శ్రీకాంత్, మాల్‌రెడ్డిలు పాల్గొన్నారు.



## అన్నీదానాల్లోకెల్ల అన్నదానం గొప్పది



**ప్రజాపక్షం/మియాపూర్:** ఆకలిగొన్న వారి ఉచితంగా అన్న వితరణ చేయడం మానవీయతకు నిదర్శనం అని హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్ కు మార్ అన్నారు. భారీ స్థాయిలో అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కొండ విజయ్ కుమార్ హజరై ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ గడిచిన ఏడాదికాలంగా ఉచితంగా పోషక విలువలతో కూడిన భోజనం ఉచితంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. చందానగర్ లోని గంగారం హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత భోజన అందించడం ద్వారా వేలాది మంది ఆకలిని తీర్చగలగడం గొప్ప పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యురాలు అన్నే అపర్ణ, అన్నె సందీప్,హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాలు కూల్చివేత

**ప్రజాపక్షం/చర్లపల్లి:** చర్లపల్లి డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 30లో నాలాకు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని కాప్రా రెవెన్యూ అధికారులు శనివారం కూల్చివేశారు. గత కొన్ని నెలలుగా చిన్న చర్లపల్లి నాలా పక్కన నిర్మించిన అక్రమ నిర్మాణాలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు బూడిద ప్రేమ్ కుమార్‌గౌడ్ సంవత్సర కాలంగా పోరాటం చేశారు. అక్రమంగా నిర్మించిన నిర్మాణాలపై తెలంగాణ సిఎం, మంత్రులు, రెవెన్యూ అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసిన ఫలితంగానే రెవెన్యూ అధికారులు స్పందించి కూల్చివేతలు పోలీస్ బందోబస్తుతో చేపట్టారని, స్థానికంగా కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిళ్లు, బెదిరింపులు ఉన్నప్పటికి వెనక్కి తగ్గకుండా భూములు పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిందని ప్రేమ్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.




## ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటు ఎంతో అభినందనీయమని కాప్రా మండల తహసీల్దార్ బైరెడ్డి రాజేష్ అన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ వద్ద కాప్రా ప్రెస్ క్లబ్(ప్రధాన పత్రికలు), భాగ్యనగర్ సిటీ లయన్స్ క్లబ్, కుషాయిగూడ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంఆర్ఒతో పాటు డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి, కృష్ణారెడ్డి, డిఐ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ప్రెస్‌క్లబ్ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. క్లబ్ అధ్యక్షులు జ్యోతిర్మయచారి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, లయన్స్ గవర్నర్లు మండా సురేష్, శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎ శ్రీనివాస్, కోశాధికారి సురేష్, నాయకులు విజయ్‌గౌడ్,శేర్ మణెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ 74 శాతం పూర్తి

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లాలోఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియ 74శాతం పుర్తియిదని జిల్లా అదనపుకలెక్టర్ వెంకటచారి తెలిపారు. శనివారం హైదరాబాద్ నుండి ఓటర్ల ప్రత్యేక సమగ్ర షెడ్యూల్ ,మ్యాపింగ్ ప్రక్రియపై రాష్ట ఎన్నికల అధికారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడు తూ ఓటరు జాబితాప్రత్యేక సమగ్ర సవరణపై రాష్ట ఎన్నికల సంగం ఆదేశా ల ప్రకారంచర్యలు చేపడుతమారి తెలిపారు. ఓటర్లు మ్యాపింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న బూత్ స్థాయి అధికారుల నియామకానికి చర్యలు తీసుకుంటామని అయన తెలిపారు. రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి బూత్ స్థాయి ఏజెంట్ల నియామకానికి చర్యలు తీసుకుంటామని రాష్ట ప్రధాన ఎన్నికల అధికారికి ఆయన వివరించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డిఓలు వాసుచంద్ర, అనిత, నేహత్ హాలీ, తహసీల్దార్ లక్ష్మి నారయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు మహిళల దారుణ హత్య

* తాండూరులో మిస్సింగ్...మొహినాబాద్‌లో పూడ్చివేత..
* మిస్సింగ్ కేసును ఛేదించిన తాండూరు పోలీసులు

**ప్రజాపక్షం/తాండూరు:** నమ్మించి నయవంచనకు పాల్పడ్డారు. అప్పుగా తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమని అగినందుకు ఆ ఇద్దరి మహిళలు దారుణ హత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా మొహినాబాద్ ఫాంహౌస్ సమీపంలో వెలుగు చూసింది. మహిళల జంట హత్యలు జిల్లాలో తీవ్ర కలకలం సృష్టించిన ఈ ఘటనను తాండూరు పోలీసులు ఛేదించారు. తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు మహిళలు మిస్సింగ్ అయిన విషయం తెలిసిందే. కాగా ఈ కేసును దర్యాప్తు చేస్తున్న పోలీసులకు విస్తుపోయే నిజాలు బయపడ్డాయి. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్ గ్రామానికి చెందిన అబేదా బేగం (60) అంగన్వాడి ఆయాగా పనిచేస్తూ ఈ నెల 5న ఇంటి నుండి అదృశ్యమైంది. ఆమె ఆచూకీ లభించక పోవడంతో ఈ నెల 10న బషీరాబాద్ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు అదే విధంగా తాండూరు పట్టణ ఇందిరమ్మ కాలనీకి చెందిన మహబూబ్‌బి (58) ఈ నెల 9న అదృశ్యమైంది. వారి కుటుంబ సభ్యులు ఈనెల 10 యాలాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఇద్దరి మహిళల మిస్సింగ్ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు దర్యాప్తును మమ్మురం చేశారు. వేరువేరు పోలీసు స్టేషన్‌లో నమోదైన మిస్సింగ్ కేసుల దర్యాప్తు చేపట్టిన తాండూరు రూరల్, పోలీసులకు తాండూరు పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న భార్యాభర్తలు రెహమాన్, కరమీమా బేగమ్‌లపై అనుమానం వచ్చింది. దీంతో తమదైన శైలిలో విచారించిన తాండూరు పోలీసులకు దిమ్మతిరిగే విషయాలు బయటపడ్డాయి. అప్పు తీసుకున్న ఇద్దరు భార్యభర్తలు రెహమాన్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. భార్య కరీమాబేగం, రెహమాన్ లు ముందు వేసుకున్న పథకం ప్రకారం మొహినాబాద్ ఫామ్‌హౌస్‌లో పనిచేసుతన్న తమ బావమరిదితో కలిసి అప్పిచ్చిన ఇద్దరూ మహిళలను నమ్మించి డబ్బులు తిరిగి ఇస్తామని చెప్పి పిలిపించి మొహినాబాద్ చేవెళ్ళలోని వేర్వేరు ఫాంహౌజ్‌లలలో దారుణ హత్య చేశారు. హత్యచేసి చేసిన అక్కడే పూడ్చిపెట్టారు. ఈ జంట హత్యల కేసు రంగారెడ్డి జిల్లా పరిధిలో తీవ్ర కలకలం రేపింది. వికారాబాద్ జిల్లా తాండూరు ప్రాంతానికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలు కొంత కాలంగా కొందరితో ఫైనాన్స్ డబ్బుల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బాధితులకు రావాల్సిన డబ్బులు తిరిగి ఇస్తామని నమ్మబలికిన నిందితులు వారిని విడివిడిగా మోహినాబాద్ ఫాంహౌజ్‌కు తరలించారు. ఒక మహిళను మొహినాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక ఫాంహౌజ్‌లో, మరో మహిళను చేవెళ్ల పోలీసు స్టేషన్ పరిధిలోని మరో ఫాంహౌజ్‌లో కిరాతకంగా హత్య చేశారు. అనంతరం ఎవ్వరికి అనుమానం రాకుండ మృతదేహాలను ఫాంహౌజ్‌లోనే గుట్టు చప్పుడు కాకుండా పూడ్చిపెట్టారు. విచారణ చేపట్టిన తాండూరు పోలీసులు ఫాంహౌజ్‌లకు చేరుకుని ఒక మృతదేహా న్ని స్వాధీనం చేసుకున్నారు. మరో మహిళ శవాన్ని వెలికి తీయాల్సి ఉంద ని, ఈ మేరకు క్లూస్ టీం, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా పోలీసులు కేసును వేగవంతం చేశారు. కాగా పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు ఉన్నట్లు సమాచారం. జంట మహిళల హత్య కేసును ఛేదించడం తాండూరు పోలీసులను అభినందిస్తున్నారు.



### పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపునకు

# సిపిఐ నాయకుల నిరసనలు

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ శనివారం సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అధ్యక్షతన జగద్గిరిగుట్ట కార్యాలయం నుంచి ఆటో ట్రాలీని తాడుతో లాగుతూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చివరి బస్‌స్టాప్ వద్ద ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఉమా మహేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యేసురత్నం మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా దేశంలో చమురు సంక్షోభం ఏర్పడిందని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు బ్యారెల్ ధరలు తగ్గినప్పటికీ గత పదేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా చమురు కంపెనీలకు లాభాలు చేకూర్చారని ఆరోపించారు. రెండు నెలల వ్యవధిలోనే నష్టాల పేరుతో మళ్లీ ధరలు పెంచడం తుగ్లక్ చర్యగా అభివర్ణించారు. అమెరికా ఒత్తిడికి తలొగ్గి రష్యా నుంచి చమురు కొనుగోళ్లు తగ్గించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రజల సంక్షేమం కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చమురు ధరలు ఎక్కువగా ఉన్నప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలు నియంత్రణలో ఉండేవని, ప్రస్తుతం బిజెపి ప్రభుత్వం ప్రజలపై అధికభారం మోపుతోందని ఆరోపించారు. వెంటనే పెంచిన ధరలను తగ్గించి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్‌రావు, రాములు, కోశాధికారి సదానంద్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, బాబు, శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, శ్రీనివాస్‌చారి, గుర్రప్ప, శ్రీనివాస్, రవి, ముసలయ్య, ఇమామ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరిలో:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలన్నా డిమాండ్‌తో సిపిఐ, అనుబంధ సంఘాలు శనివారం నిరసనలతో ఆందోళనలు చేపట్టారు. ప్లేకార్డులు చేతబూని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా ప్రధాన నేతలు 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ నిల్వలు దేశంలో పుష్కలంగా ఉన్నాయంటూ ప్రకటించి ఎన్నికలు ముగియగానే ధరలను పెంచి సామాన్య జనం నడ్డి విరిచారన్నారు.

**జవహర్‌నగర్‌లో.....** జవహర్‌నగర్ ప్రధాన రహదారిలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్, పార్టీ శ్రేణులు నిమ్మల నర్సింలు, స్వరూప నాయక్, అంబాల ఎల్లయ్య, ఆశోక్‌చారి, తదితరులు నిరసనలో పాల్గొన్నారు. **నాచారంలో....** సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పెట్రోల్ ధరను తగ్గించాలన్న డిమాండ్‌తో జరిగిన నిరసనలో పార్టీ శ్రేణులు గిరిబాబు, విజయ్‌కుమార కృపాకర్, కెఎం రెడ్డి, నరసింహ,తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరి చౌరాస్తాలో ...** సిపిఐ, సిపిఎం సంయుక్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు యాదగిరి, రొయ్యల గిరిజ ఎస్‌కె అజీజ్, రాములు, లింగం, సయ్యద్, శీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

**కూకట్‌పల్లిలో :** కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శనివారం బాలానగర్, ప్రశాంతి నగర్ ప్రధాన రహదారిపై సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వరుసగా ఇంధన ధరలు పెంచడం వల్ల సామాన్య ప్రజలు, రైతులు, చిన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కె.మనోచారి, పాండు, రాజుగౌడ్, రాములు, హనుమంతు, లక్ష్మి , తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్‌లో:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచుతూ సామాన్య మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తోందని మేడ్చల్ జిల్లా సిపిఐ సీనియర్ నాయకులు కల్లూరి జయచంద్ర ఆరోపించారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధిలోని ఆర్‌జికె కాలనీ వద్ద పెంచిన పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెంపును నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు పట్టుకొని నిరసన చేపట్టారు.

ఈ సందర్భంగా కల్లూరి జయచంద్ర మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగిన బిజెపి సభలో దేశ ప్రధాని మోదీ పొదుపు మంత్రం జపించిన కొన్ని రోజులకే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరిచిందని రానున్న కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు మరింతగా పెరిగి సామాన్యులు బతకలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి సదాశివ, ఎఐటియుసి మండల అధ్యక్షులు బి.పాండు, సిపిఐ కార్యవర్గ సభ్యులు ఈ మురళి, సిపిఐ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ చౌదరి, డి.యాదవ్ శ్యామ్, సత్యనారాయణ, వినోద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.









## నేపాలీ ముఠాలో నలుగురు నిందితుల అరెస్ట్

చోరీ చేసిన సొత్తంతా స్వాధీనం

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వృద్ధ దంపతులను కట్టిపడేసి దోపిడీకి పాల్పడిన నేపాలీ ముఠాలోని కీలక నిందితులైన నలుగురు నిందితులకు పోలీసులు అరెస్టు చేసా రు. ఈ దోపిడీలో కీలకంగా వ్యవహరించిన పనిమనుషుల్లా చేరి అదే ఇంట్లో మకాం వేసిన నేపాలీ దంపతులతో పాటు వారికి సహకరించి న ఇద్దరు ఉన్నారు. నేపాల్ దేశానికి చెందిన సునీత సబీనా, బిస్వాల్, కమల్ బహదూర్ చౌలానే, జంకర్ బహదూర్ చాలానేలు అరెస్టయిన వారిలో ఉన్నారు. మల్కాజిగిరి సిపి సుమతి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాప్రాల్ ప్రాంతం కౌకూర్‌లోని మోహన్స్ గోల్ఫ్ ఎన్‌క్లేవ్ ఫ్లాట్‌లో ఉంటున్న ఆర్మీ, రిటైర్ట్ ప్రొఫెసర్ మురళీ మోహన్ ఇంట్లో ముందస్తు పథకం ప్రకారం గత ఏప్రిల్ 25 న మీనా అనే నిందితురాలు ఇంట్లో పనిమనిషిగా చేర్పించి అక్కడే భర్త రాజేష్‌తో పాటు ఈ నెల 12న రాత్రి ప్రణాళిక ప్రకారం ఆ దంపతులకు తోడైన మరో ఐదుగు రు నేపాలీ ముఠా సభ్యులు ఇంట్లో చొరబడ్డారు. ఇంటి యజమానులను బెదిరించి మత్తు మందిచ్చి అపస్మారక స్థితిలో చేరుకోగానే ఇల్లంతా చిందర వందర చేసి 60 తులాల బంగారు ఆభరణాలు, 15 కిలోల వెండి వస్తువులు, 3వేల యుఎస్ డాలర్లు, రెండు ఫోన్లను దోచుకొన్నారు. ఆటో, స్కూటీపై వెళ్లినవారం తా మార్గ మధ్యంలో స్కూటర్‌ను వదిలేసి నేపాల్‌కు వెళ్లేందుకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ చేరుకొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ప్రత్యేక బృందాలు సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల్లో నలుగురిని అరెస్టు చేసి దోపిడీ చేసిన సొత్తంతా స్వాధీనం చేసుకొన్నారు. దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందికి సిపి ప్రత్యేక రివార్డుల కోసం ప్రభుత్వానికి సిఫారసు చేసి సత్కరించారు.








## రాహుల్ గాంధీని కలిసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/పరిగి :** పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం ఢిల్లీలోని రాహుల్ గాంధీని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కుమార్తె వివాహం జరిగిన సందర్భంగా రాహుల్ గాంధీ ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించడం జరిగిందని తెలిపారు.



## విహెచ్‌ను సన్మానించిన మెట్టు గణేష్ యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** బిసి సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారులుగా పదవీ బాధ్యతలను స్వీకరించి వి.హనుమంతరావును తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి కాంగ్రెస్ ప్రచార కమిటీ మెంబర్ డాక్టర్ లోకేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేష్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు సహదేవ్ గౌడ్, పోలగోని లక్ష్మ ణ్ గౌడ్‌లు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. విహెచ్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మెట్టు గణేష్ యాదవ్ మాట్లాడుతూ హనుమంతరావు చేసిన సేవలు మరువలేనివని రాష్ట్రంలోని బిసి వర్గాల సంక్షేమం అభ్యున్నతికి మరింత దోహదపడతా యని ఆశాభవం వ్యక్తం చేశారు.

## విద్యావారోత్సవాలలో ఎఐపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం /వికారాబాద్ :** 99రోజుల ప్రజాపాలన భాగంగా వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యావారోత్సవాల సందర్భంగా ఎఐపై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది అని ప్రిన్సిపల్‌పివీ గీతలక్ష్మి పట్నాయక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ,ప్రస్తుతం మారుతున్నటువంటి సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఏఐ పట్ల సమాజం పట్ల అవగహన కలిగి ఉండాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మితిమిరిన సాంకేతిక పరిజ్ఞానం కూడా అనర్థాలకు దారిస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపక బృందం సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటు విలువ ప్రతి పౌరుడికి తెలియాలి

ఎస్ఐఆర్‌లో ఓటు ఉండాలి

బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ఓటు విలువను ప్రతి పౌరుడికి తెలియజేస్తూ ఎస్ఐఆర్‌లో ఓట్లు ఉండేలా నాయకులు, బిఎల్‌ఏలు అప్రమత్తతో పనిచేయాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్‌లో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద పాల్గొని పార్టీ నాయకులకు, బిఎల్‌ఏలకు పాటించవలసిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమం నిర్వహణ, ప్రాముఖ్యత పాటించాల్సిన నియమ, నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. పారదర్శకత, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందేలా ప్రతి నాయకుడు, బిఎల్‌ఏలు పనిచేయాలని, 2002 జనాబా ప్రాతిపదికన ఎన్నికల సంఘం ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడంతో పాటు డూప్లికేట్ ఓట్లు, పర్మినెంట్ మైగ్రేటెడ్ ఓట్లు, అసలు మనుషులులేని పేర్లతో ఉన్న ఓట్లను గుర్తించడం, కుటుంబ సభ్యుల ఓట్లను మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను చేర్చడం, ఇంకా ఏమైనా చేర్పులు, మార్పులు ఉంటే వాటిని సరిదిద్దేలా నాయకులు, బిఎల్‌ఏలు, సంక్షేమ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్, యువత ఒక బాధ్యతగా తీసుకుని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయ పరుచుకుంటూ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగ పరుచుకునేలా పనిచేయాలని సూచించారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ అధినేత కేసిఆర్ నాయకత్వంలో పార్టీ బలోపేతం కోసం చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకంతో పాటు పార్టీ పటిష్టతకు మరింతగా ప్రజల్లోకి ఎలా దూసుకువెళ్లాలి అనే, తీసుకోవాల్సిన కార్యాచరణను వివరించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గాజులరామారంలో ఎస్ఐఆర్‌పై అవగాహన సద స్సు**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం చిత్తారమ్మ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఐఆర్ పై బిఆర్ఎస్ పార్టీ నాయకులు, బిఎల్‌ఏల కు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి పార్టీ నాయకులకు, బిఎల్‌ఏలకు ఎస్ఐఆర్ పై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ యువత ఓ బాధ్యతగా తీసుకుని ప్రజలను చైతన్య పరుస్తూ అధికారులను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు విజయ రాంరెడ్డి, బాల్ రాజు, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

## వడివడిగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం



**ప్రజాపక్షం/వికారాబాద్ :** జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగం పుంజుకున్నాయి. వికారాబాద్ జిల్లాకు మొదటివిడుతలో2345, రెండో విడుతలో10,518 ఇళ్ల మంజూరయ్యాయి. లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ కూడా అందజేశారు. 8,536 ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. 2,569 మంది బేస్మిట్ పనులు పూర్తి చేయగా ఒక్కొకరికి రూ.ఒక్కో లక్ష చొప్పున అందజేశారు. మరో 1332మంది రూఫ్ లెవెల్ వరకు పూర్తిచేశారు. 2,711మంది రూఫ్‌కాస్ట్ లెవెల్ వరకు పూర్తి చేయడంతో రు.4లక్షల చొప్పున బిల్లులు మంజూరు చేశారు. ఇప్పటికి పూర్తిఅయిన వాటిని ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో ఒక్కటైన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలనే యోచనలో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేందుకు ఆరు నెలలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను పరుగులు పెట్టిస్తున్నాయి. రేషన్ కార్డుల మంజూరు. ఉచిత విద్యుత్ ,ఆర్టీసీలో మహిళ ఉచిత ప్రయణం రు.500కే గ్యాస్ సిలిండర్ తదితర వటిపై దృష్టి సారించారు. ఇందిరమ్మ ఇళ్లపై ఎక్కువ ఫోకస్ పెట్టారు. అయితే హౌసింగ్ శాఖలో ఇంజనీర్ల కొరత కారణంగా కొంత మేర ఇబ్బందులు ఎదురవుతున్నా అధికమించి పథకాన్ని వేగవంతం చేస్తున్నారు. అధిగమించి పథకాన్ని వేగవంతం అందేలా చొరవ చూపుతున్నారు. జిల్లాకు రెండు విడుతల్లో మంజూరైన ఇళ్లు 13,464, ప్రొసీడింగ్స్ పొందిన లబ్దిదారులు 12,868, నిర్మాణ దశలో 8536, ఇంకా ప్రారంభం కానివి 4327, గృహప్రవేశాలకు సిద్ధంగా ఉన్నవి 295,చెల్లించిన మొత్తం రూ.149.45 కోట్లుఅని తెలుస్తుంది. రెండు విడుతల్లో సూ స్థలం ఉన్నవారికే ఇందరమ్మ ఇళ్ల మంజూరు చేశారు.

స్థలం లేని వారి పరిస్థితి ఏమిటనేది ఇంకా తెలియడంలేదు గత ప్రభుత్వ హయంలో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించాలని స్థలం లేని పేదలు కోరుతున్నారు. బిఆర్ఎస్ హయంలో జిల్లాకు 5740డబుల్ ఇళ్లు అప్పుడు మంజూరయ్యాయి. 2016లో నిర్మాణ పనులను ప్రారంభించారు. 2257 ఇళ్లు వివిధ దశాల్లో ఉన్నాయి. వీటిలో 1031 పూర్తియ్యాయి.

దారూర్‌లో 120 మర్పల్లిలో 120 యాలాల్ మండలం కోకట్‌లో 180 ,తాండూర్ పట్టణంలో 401,పరిగిలో 180 చౌడపూర్ మండలం అడవి వెంకటపూర్‌లో 30ఇళ్లు కేటాయించేందుకు సిద్దంగా ఉన్నాయి. వీటిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది . జిల్లా కలెక్టర్ దీపక్ తీవారీప్రత్యేక శ్రద్ధతో జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.

## విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

మాతా శిశు ఆసుపత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/తాండూరు:** ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంతటి వారైన సరే కఠిన చర్యలు తప్పవని జిల్లా అధనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. శనివారం తాండూరులోని మాత శిశు ఆసుపత్రిని జిల్లా అధనపు కలెక్టర్ ఆకస్మీక తనిఖీ చేశారు. మాత శిశు ఆసుపత్రిలో జరిగిన ఘటనపై జిల్లా అధనపు కలెక్టర్ అరా తీశారు. అలాగే భవన పరిస్థితి, మరుగుదొడ్లు, పారిశుధ్యం సౌకర్యాలను పరిశీలించారు. నియమాలు, మర్గాదర్శకాలను తప్పని సరిగా పాటించాలని లేని పక్షంలో కఠిన



చర్యలు తీసుకుంటామని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్యం, సిబ్బంది హాజరు రిజిస్టర్, మందుల నిల్వలు, రోగులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలతో పాటు , సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పరిశుభ్రతను ఖచ్చితంగా పాటించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చిరంచారు. వైద్యులు, సిబ్బంది, సమయ పాలనతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో సూపరిండెంట్ డాక్టర్ శరత్, ఆర్ఎంఒ అనిల్,సునిత, మున్సిపల్ కమీషనర్ మధుసుధన్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## బండి సంజయ్ ఇంట్లో తనిఖీలు

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** పోక్సో కేసులో తప్పించుకు తిరుగుతున్న బండి భగీరథ్ కోసం ప్రభుత్వం లుకౌట్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో పోలీసులు వేట ప్రారంభించారు. ఇందులో భాగంగానే శనివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్‌నెం3, శ్రీనికేతన్‌కాలనీ మైత్రీ రెసిడెన్సీలోని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఇంట్లో సైబరాబాద్ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా భగీరథ్ అక్కడ లేకపోవడంతో పోలీసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇదిలాఉండగా.. ఢిల్లీ, కరీంనగర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో సైబరాబాద్ పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి భగీరథ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## బిఆర్ఎస్ నేతల భేటీ



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల సన్నాహకాలపై తెలంగాణ భవన్‌లో శనివారం కీలక సమావేశం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గం ఇంచార్జిలతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ.. జిహెచ్ఎంసి కార్పొరేషన్ ఎన్నికలు జూలై లేదంటే సెప్టెంబర్ లోగా జరిగే అవకాశాలు ఉన్నాయని.. ఇంచార్జిలందరూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని దిశానిర్దేశం చేశారు. డివిజన్ల వారీగా పార్టీని బలోపేతం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇంచార్జి ఆర్‌వి మహేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్‌ల ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:**జిల్లాలో రెవెన్యూ డివిజన్ల వారీగా ఏర్పుటు చేసే ప్రజావాణి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్లలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం కోసం ప్రభుత్వం ఇటీవల డివిజన్ల వారీగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని సూచించిందన్నారు.ఇది కూడా ప్రతి సోమవారం నిర్వహిస్తారని ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు సమర్పించుకోవచ్చని ఆమె తెలిపారు.

## ముగిసిన హెల్త్ చాలెంజ్ 'క్యాటథాన్' వేడుకలు



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** టెంపెస్ట్ అడ్వర్టైజింగ్ సంస్థ తన ఉద్యోగుల ఆరోగ్యం, ఫిట్‌నెస్ కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 21 రోజుల హెల్త్ చాలెంజ్ 'క్యాటథాన్' ముగింపు వేడుకలు నగరంలోని సెయిలింగ్ అనెక్స్‌లో ఘనంగా నిర్వహించినట్లు టెంపెస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ తురాబ్ లక్డావాలా తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ స్ఫూర్తితో ప్రారంభమైన ఈ 'క్యాటథాన్' పోటీలలో టెంపెస్ట్ సంస్థకు చెందిన హైదరాబాద్, ముంబై, బెంగళూరు, పుణే శాఖల ఉద్యోగులు పాల్గొన్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, గౌరవ అతిథిగా యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ వర్సిటీ ఆఫ్ తెలంగాణ విసి డా.కిశోర్ గోపినాథన్ (పిహెచ్‌డి) మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ఆఫీస్ సంస్కృతిలో భాగంగానే ఉద్యోగులు ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు కూడా ప్రాధాన్యం ఇవ్వడం ఎంతో ముఖ్యమన్నారు. ఈ చాలెంజ్‌లో మూడు వారాల పాటు అత్యధిక అడుగులు నడవాలనే లక్ష్యంతో ఒకరితో ఒకరు పోటీపడి మొదటి, మూడు స్థానాల్లో నిలిచిన రేఖా ఓస్వాల్, ప్రసాద్ బి పవార్, అనంత కుండోజ్వార్ తదితరులకు అవార్డులు అందజేశారు.

## పారిశుద్ధ్య ఏజెన్సీకి జరిమానా



**ప్రజాపక్షం/చార్మినార్:** పారిశుధ్య నిర్వహణపై చార్మినార్ జెడ్‌సీ కె.సత్యనారాయణ ఆరా తీశారు. ఈ మేరకు ఆయన శనివారం ఉదయం జోన్ పరిధిలోని చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పై అధికారులతో చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం సరిగ్గా లేకపోవడం, చెత్త పేరుకుపోవడం గ్రహించిన ఆయన సంబంధిత ఎక్సోరా ఏజెన్సీ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం కారణంగా ఎక్సోరా ఏజెన్సీపై రూ.20 వేల జరిమానా విధించారు. అనంతరం ఎమ్మెల్సీ మీర్జా రెహ్మత్ బేగ్‌తో కలిసి షా అలీబండలోని ఆశా థియేటర్ వద్ద కొనసాగుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో మాజీ కార్పొరేటర్ ముజాఫర్ అలీ, చార్మినార్ డిప్యూటీ కమిషనర్ సరిత, జోనల్ ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ ఇందిరాదేవి, శానిటేషన్ డిఈ శ్రీరాములు, జలమండలి డైరెక్టర్, మేనేజర్లు, డిఈలు, ఎఇలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక



**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫలక్‌నుమాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా లైబ్రరీ డే, కెరీర్ గైడెన్స్, క్రీడాకారులైన విద్యార్థుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కెరీర్ ప్రాముఖ్యతను వివరించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ డేవిడ్ రచించిన 30 పుస్తకాలు, డా.బాబురావు రచించిన 30 పుస్తకాలు, డా.వి.సుహాసిని రచించిన 20 పుస్తకాలు, ఇతర అధ్యాపకుల నుంచి సేకరించిన మొత్తం 100 పుస్తకాలను లైబ్రరీకి విరాళంగా అందించారు.

### ఉప్పల్ ప్రయాణికులకు అలర్ట్


# నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపులు

బస్ స్టాప్ కూడా మార్పు !

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉప్పల్ రింగ్ రోడ్డు మీదుగా ప్రయాణించే వాహనదారులకు, ప్రయాణికులకు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) సూచన చేశారు. ఉప్పల్ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్ ఫ్లైఓవర్ పిల్లర్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో, నేటి నుండి ఉప్పల్ రింగ్ రోడ్డులోని వరంగల్ వైపు వెళ్లే రహదారిని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని పెద్ద ఎత్తున ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం బస్ స్టాప్‌ను కూడా తాత్కాలికంగా మార్చారు.

**నల్ల చెరువు కట్ట వద్దకు వరంగల్ బస్ స్టాప్**

ప్రస్తుతం ఉప్పల్ ఎంఎంసి కార్యాలయం పక్కన ఉన్న వరంగల్, హనుమకొండ, యాదగిరిగుట్ట బస్సుల స్టాప్‌ను తాత్కాలికంగా నల్ల చెరువు కట్ట సమీపానికి మార్చడం జరిగింది. కాబట్టి ఆయా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులందరూ నల్ల చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టాప్ నుండే బస్సులను వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.




**ట్రాఫిక్ మళ్లింపు వివరాలు ఇవే..**

పనుల నిమిత్తం రోడ్డు మూసివేస్తున్నందున వాహనదారులు కింద పేర్కొన్న ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. వరంగల్ వైపు నుండి వచ్చే వాహనాలు మే ఫీల్ హోటల్ దాటిన తర్వాత ఉప్పల్ భగాయత్ ద్వారా నాగోల్ వెళ్లాలి. అక్కడ సర్వీస్ రోడ్డు గుండా ప్రయాణించి, ఫ్లైఓవర్ కింద యూటర్న్ తీసుకొని హైదరాబాద్ నగరంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది. హైదరాబాద్ నుండి వరంగల్ వెళ్లే వాహనాలు సర్వే ఆఫ్ ఇండియా జంక్షన్ వద్ద పిస్తా హౌస్ పక్క నుండి బీరప్ప గడ్డ మీదుగా ప్రయాణించి, జాతీయ రహదారిలోకి ప్రవేశించి వరంగల్ వెళ్లవచ్చు. ఉప్పల్ భగాయత్ రోడ్డు చాలా చిన్నదిగా ఉన్నందున వరంగల్ నుండి హైదరాబాద్ వచ్చే భారీ వాహనాలు (ఆర్‌టిసి బస్సులు, లారీలు) ఈ రూట్ లోకి అనుమతించరు. వీటిని ఓఆర్ఆర్ హయత్ నగర్ మీదుగా హైదరాబాద్‌లోకి మళ్లిస్తారు. హైదరాబాద్ నుండి వరంగల్ వెళ్లే భారీ వాహనాలు సైతం ఎల్.బి నగర్, హయత్ నగర్ మీదుగా ఓఆర్ఆర్ నుంచి ఘట్‌కేసర్ ద్వారా వరంగల్ హైవేకి చేరుకోవాల్సి ఉంటుంది. ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు, ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలందరూ పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సహకరించాల్సిందిగా కోరారు.

## టిమ్స్ సనత్‌నగర్ పేరు మార్పు చేయాలి



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ప్రస్తుతం టిమ్స్ సనత్‌నగర్‌గా పిలుస్తున్న ఆసుపత్రి పేరును టిమ్స్ వెంగళరావునగర్ లేదంటే ఇతరత్రాగా మార్చాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దేవిరెడ్డి నాగార్జునరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి.నవీన్‌యాదవ్‌కు ఆయన లేఖ రాశారు.కోవిడ్19 మహమ్మారి సమయంలో రాష్ట్రంలో ఆరోగ్య సేవల అవసరం పెరగడంతో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని..అందులో భాగంగా పశ్చిమ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఆసుపత్రి ప్రస్తుతం టిమ్స్ సనత్‌నగర్ పేరుతో కొనసాగుతోందన్నారు. అయితే, ఆ ఆసుపత్రి సనత్‌నగర్ పరిధిలో కాకుండా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ సర్కిల్ పరిధి వెంగళరావునగర్ డివిజన్లో ఉన్నందున ప్రస్తుత పేరు సరైన భౌగోళిక గుర్తింపును ప్రతిబింబించడం లేదన్నారు. ఆసుపత్రి ఉన్న ప్రాంతానికి అనుగుణంగా పేరు మార్చడం ద్వారా ప్రజల్లో స్పష్టత ఏర్పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంగళరావునగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ పటేల్, కార్యదర్శి బి.సురేఖ, పూదోట శౌరిరాజు, అర్జున్, సి.హనుమంతరావు, రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, రవి తదితరులు ఉన్నారు.


## 'ఊపిరి వంతెన' ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఉస్మానియా వర్సిటీ:** సామాజిక బాధ్యతను కలిగించే విధంగా రూపుదిద్దుకున్న కవితా సంపుటి ఊపిరి వంతెన పుస్తకాన్ని ఉస్మానియా యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య మొలుగారం కుమార్ ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజ్ డీన్ ప్రొఫెసర్ లింగప్ప గోనాల్ సహకారంతో యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన పెండ్యాల ఆంజనేయులు రచించిన కవితా సంపుటి ఊపిరి వంతెన పుస్తకావిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన విసి మొలుగారం కుమార్ మాట్లాడుతూ, సమాజానికి స్ఫూర్తి నింపే విధంగా 'ఊపిరి వంతెన' ద్వారా ఆంజనేయులు కవిత్వం ఉందన్నారు. ఈ కవిత్వం ముందు తరాలకు ఉపయోగపడుతుందని వివరించారు. ఆత్మీయఅతిథిగా హాజరైన ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.కాశీం మాట్లాడుతూ, యూనివర్సిటీలో చిన్న ఉద్యోగిగా పని చేస్తూనే సామాజిక బాధ్యతతో సామాజిక స్పృహ కలిగించే విధంగా ఆంజనేయులు కవితలు ఉన్నాయని ప్రశంసించారు. తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యమున్న కుటుంబం నుంచి వచ్చిన ఆంజనేయులు తన తండ్రి ఆస్తులను కాకుండా ఆశయాలను పంచుకొని కవిత్వాన్ని సమాజానికి అందించారని కొనియాడారు. ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ లింగప్ప గోనాల్ మాట్లాడుతూ, సామాజిక అంశాలను తన కవిత్వంగా ఎంచుకొని పుస్తకం తీసుకువచ్చినందుకు ఆంజనేయులును అభినందించారు. ఓయూ తెలుగు శాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్ రఘు ఊపిరి వంతెన పుస్తకాన్ని సమీక్షించారు. తన 103 కవితల ద్వారా తన జీవిత సారంతో పాటు సమాజంలోని అనేక అంశాలను ఆంజనేయులు ప్రతిబింబించారని పేర్కొన్నారు. ఊపిరి వంతెన పుస్తక కవి పెండ్యాల ఆంజనేయులు మాట్లాడుతూ, జీవిత అనుభవం, మానవతా విలువలే తన గురువులని పేర్కొంటూ అక్షరం నా ఊపిరి ఉస్మానియా నా జీవనాడి అని వివరించారు. కవిత్వంలో సహకరించిన ప్రొఫెసర్ బాగయ్య, డాక్టర్ కే.బాలకృష్ణ, దండి గౌరీశంకర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.స్వాతి, ఓయూ తెలుగు శాఖ అధ్యక్షురాలు ప్రొఫెసర్ విజయలక్ష్మి, బోధన, బోధ నేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల నిర్వహణ హర్షణీయం

ఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామ్యంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు అవసరం అని కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికలు జరపాలని నిర్ణయించి, ఎన్నికల తేదీలను ప్రకటించడంపై ఐఎన్‌టియుసి తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు, తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మొగుళ్ల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల నిర్వహణకు కృషి చేసిన ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు, మాజీ ఎంపి జి. సంజీవరెడ్డిను మొగుళ్ల రాజిరెడ్డితో పాటు ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్ తదితరులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జి.సంజీవ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల హక్కులను రక్షించడంతో పాటు పటిష్టం చేస్తామని వాగ్దానం చేసే ఐఎన్‌టియుసి అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో విజయం కోసం కార్మికులందరూ ఐక్యంగా కృషి చేయాలన్నారు. మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ హయాంలో పరిస్కారం కానీ జలమండలి కార్మికుల అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌ను రాబోయే జలమండలి గుర్తింపు కార్మిక సంఘాల ఎన్నికల్లో కార్మికులు భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజా, నాయకులు వినోద్ గౌడ్, ఇందూరి తిరుపతి, శ్రీనివాస్, బి. మహేష్, జంపయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు రూ.5,454 కోట్ల రైల్వే బడ్జెట్

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి




**ప్రజాపక్షం/యాకుత్‌పురా:** తెలంగాణకు రూ. 5,454 కోట్ల రైల్వే బడ్జెట్ కేటాయించారని.. రాబోయే కాలంలో 42 రైల్వేస్టేషనులను పునరుద్ధిస్తామని.. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్లను తెలంగాణలో ప్రవేశపెట్టబోతున్నారని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. పాతబస్తీలోని ఉప్పుగూడ రైల్వేస్టేషన్, మలక్‌పేట్ అమృత్ రైల్వే స్టేషన్‌ల ఆధునీకరణ పనులలో భాగంగా స్టేషన్ భవన నిర్మాణం, పార్కింగ్, సర్క్యులేటింగ్ ఏరియా, ప్రయాణికుల సౌకర్యాలు, భద్రతా చర్యలను కిషన్‌రెడ్డి పరిశీలించి అధికారులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, రైల్వేస్టేషన్‌లలో ప్రజలకు మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చర్లపల్లి నుంచి తిరుపతి వరకు రేపు ట్రైన్ ప్రారంభమవుతోందని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం రూ.47,984 కోట్ల విలువైన రైల్వే మౌలిక సదుపాయాల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కాజీపేట్ రైల్వే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనులు వేగంగా సాగుతున్నాయని, ఈ ఏడాది చివరినాటికి ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఎంఎంటీఎస్ రెండో దశను యాదాద్రి వరకు విస్తరించనున్నట్లు వెల్లడించిన మంత్రి, కొమురవెల్లి సమీపంలో నిర్మించిన కొత్త రైల్వేస్టేషన్ త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు. తాజా కేంద్ర బడ్జెట్లో ప్రకటించిన 7 హైస్పీడ్ రైలు కారిడార్లలో 3 తెలంగాణకు సంబంధించినవేనని, ఇవి హైదరాబాద్‌ను పూణే, బెంగళూరు, చెన్నైలతో అనుసంధానిస్తాయని చెప్పారు. ప్రస్తుతం తెలంగాణలో 5 వందే భారత్, 6 అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయని తెలిపారు. మంత్రి వెంట హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్‌కుమార్ వర్మతో పాటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి

అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి




**ప్రజాపక్షం / సిటీ బ్యూరో:**రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డి తెలిపారు. కలక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం తీసుకుని సామాజిక సేవలో ముందుండాలని చెప్పారు. రాష్ట్ర గవర్నర్ పిలుపు మేరకు సభ్యత్వ నమోదు కార్యక్రమం జూన్ 15వరకు జరుగుతోందన్నారు. ఈకార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో చేపట్టి సభ్యత్వం ఎక్కువ అయ్యేలా చూడాలని ఆయన కోరారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:**ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ(దిశ)ఛైర్మన్,చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు,కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు.శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్‌లో దిశ సమావేశాన్ని నిర్వహించారు. ఇట్టి సమావేశంలో వి ద్య,వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, వ్యవసా యం,గ్రామీణ అభివృద్ధి, బ్యాంకర్లు, పంచాయితీ రాజ్,శిశు సంక్షేమం,పౌర సరఫరాలు, పరిశ్రమలు,పశు సంవర్ధక, మత్స్యశాఖ,ఉద్యానవన, మిషన్ భగీరథ, రూరల్ వాటర్ సప్లై, జాతీయ రహదారులు,గృహ నిర్మాణ, మార్కెటింగ్,అటవీ, ఇరిగేషన్, ఆర్ అండ్ బి, మున్సిపల్ శాఖల అధికారులతో చేపట్టిన పనులు, పథకాలు అమలుపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డితో కలిసి దిశ ఛైర్మన్ కొండా విశ్వేశ్వ ర్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ దిశ అంటే ఒక మార్గం, అభివృద్ధి అని,కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అమలయ్యేలా జిల్లా అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని దిశా కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తేగా,ఆయన స్పం దిస్తూ గోపాలమిత్ర పథకంలో భాగంగా అధికారులు నిరంతరం అందుబాటులో ఉండి పశువులకు సత్వరమే వైద్య సేవలు, సలహాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. దిశ స మావేశంలో పాల్గొన్న షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకరయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి లు తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఎంపి,కలెక్టర్ దృష్టికి తె చ్చారు.దిశ సమావేశంలో షాద్ నగర్ శాసన స భ్యులు వీర్లపల్లి శంకరయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు చంద్రా రెడ్డి,కొమ్మిశెట్టి కిరణ్మయి,ఉద్యానవన శాఖ అధికారి సురేష్,విద్యాశాఖ అధికారి సుశిందర్ రావు, సివిల్ సప్లయ్ అధికారులు వనజాత, హరీష్, మున్సిపల్ కమిషనర్లు, పాల్గొన్నారు.

## అది ఆలయ భూమే: హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట సర్వే నంబర్ 348/1లోని 14.10 ఎకరాల భూమి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయానిదేనని హైకోర్టు తేల్చింది. రూ.వెయ్యి కోట్ల విలువైన ఈ భూమికి 12 వారాల్లోగా కంచె ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ఈ మేరకు తీర్పు వెలువరించారు. ఆలయ భూమిని ఆక్రమించి ప్లాట్లు, నిర్మాణాలు చేపట్టారని ఆలయ చైర్మన్ నరేందర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు పరిశీలించిన కోర్టు, రెవెన్యూ రికార్డులు, పహాణీల ఆధారంగా భూమి ఆలయానిదేనని నిర్ధారించింది. దేవాదాయ కమిషనర్ అనుమతి లేకుండా ధార్మిక సంస్థల ఆస్తులపై జరిగే లావాదేవీలు చెల్లవని స్పష్టం చేసింది. ఆలయ భూ ములను రక్షించడం అధికారుల బాధ్యత అని పేర్కొంది.

## అంతర్రాష్ట్ర మొబైల్ దొంగల ముఠా అరెస్ట్



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** క్యూర్ పరిధిలో వరుస మొబైల్ ఫోన్ల దొంగతనాలు, స్నాచింగ్‌లకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కంచన్‌బాగ్ పోలీసులు విజయవంతంగా రట్టు చేశారు. సమన్వయంతో జరిపిన ఈ దర్యాప్తులో ఆరుగురు ముఠా సభ్యులను అరెస్ట్ చేసి, వారి నుంచి పెద్ద ఎత్తున మొబైల్ ఫోన్లు, విడిభాగాలను స్వాధీనం చేసుకున్నారు. ఏప్రిల్ 15న సయ్యద్ నజీర్ అహ్మద్ అనే వ్యక్తి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డిఎమ్ఆర్ఎల్ ఎక్స్ రోడ్ సమీపంలో వెళ్తుండగా, మోటార్ సైకిల్‌పై వచ్చిన అపరిచిత వ్యక్తులు ఆయన వద్ద ఉన్న శాంసంగ్ గెలాక్సీ జెడ్ ఫోల్డ్5 మొబైల్ ఫోన్ లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీస్ బృందం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుల కదలికలను నిరంతరం పర్యవేక్షించి హైదరాబాద్, సికింద్రాబాద్, తెలంగాణలోని ఇతర ప్రాంతాలలో క్రమపద్ధతిలో ఆపరేషన్ నిర్వహించి ఆరుగురు నిందితులను వేర్వేరు విడతల్లో అదుపులోకి తీసుకున్నారు. నిందితులు అంబటి నరేష్ అలియాస్ కావటి నరేష్, బనాలా అరుణ్ కుమార్ అలియాస్ నాని, మేకల చిరంజీవి అలియాస్ చిరు, తోటసూరి అలియాస్ సురేష్ అలియాస్ సూర్య, సందీప్ జైస్వాల్ (దొంగిలించిన వస్తువులను కొనుగోలు చేసే వ్యక్తి)లను అదుపులోకి తీసుకోగా.. ముఠాలో భాగస్వాములైన తోట వసంత్, శశి, ప్రేమ్‌తో పాటు మరికొందరు నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారు. నిందితులను అరెస్ట్ చేయడం లో కీలక భూమిక పోషించిన పోలీసు సిబ్బందిని రాజేంద్రనగర్ డిసిపి అభినందించారు.

## ఆక్రమణలను తొలగించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాగ్‌లింగంపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్లు, పార్కులు, బహిరంగ ప్రదేశాలు, పేవ్‌మెంట్‌లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఆక్రమణదారులకు ముందస్తు నోటీసులు అవసరం లేదని స్పష్టం చేసింది. గతంలో ఆక్రమణలను ప్రోత్సహించిన అధికారులపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నెల రోజుల్లో అమలు నివేదిక సమర్పించాలని ఆదేశించింది. హెచ్ఐజీ2 ప్రాంతంలో రోడ్ల ఆక్రమణలపై ఎల్.అరుణ్‌కుమార్‌తో పాటు 13 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

# సాగుకు రూ.35కే డీజిల్ ఇవ్వాలి

### లేకపోతే 25 నుండి జాతీయస్థాయిలో రైతుల ఆందోళన
### పార్లమెంటుకు భారీ ప్రదర్శన
### సన్నద్ధం కావాలని రైతు సంఘాలకు అఖిలభారత కిసాన్ సభ పిలుపు

**న్యూఢిల్లీ:** వ్యవసాయ అవసరాల నిమిత్తం డీజిలు సరఫరా చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వస్థాయిలలో ఉన్న అన్ని రకాల పన్నులను తక్షణం మినహాయించాలని అఖిలభారత కిసాన్‌సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది. వ్యవసాయ అవసరాల నిమిత్తం లీటరు డీజిలు రూ.35లకే సరఫరా చేయాలని, రైతుల డిమాండ్లను రాబోయే ఏడు రోజులలో పరిష్కరించకపోతే మే 25వ తేదీ నుండి రైతులు జాతీయస్థాయిలో ఆందోళన ప్రారంభిస్తారని హెచ్చరిక చేసింది. ఈ మేరకు ఎఐకెఎస్ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, జాతీయ కార్యదర్శి కృష్ణదేవ్ సింగ్ ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో రైతులు జిల్లా,రాష్ట్రస్థాయి కేంద్రాలలో నిరసన ప్రదర్శనలకు సన్నద్ధం కావాలని, అదేవిధంగా భారీ ప్రదర్శనగా పార్లమెంటుకు వెళ్ళేందుకు కూడా రైతులు సన్నద్ధం కావాలని అన్ని రైతు సంఘాలకు ఎఐకెఎస్ నాయకులు పిలుపు ఇచ్చారు.

''దేశంలో రైతులను పన్నులు దండుకునే పాడి ఆవులుగా పరిగణిస్తూ,విమానయాన పరిశ్రమకు మాత్రం ఎర్ర తివాచీ పరచి రాయితీలు ఇవ్వడాన్ని ఎట్టి పరిస్థితుల్లో మేం సహిచేదిలేదు. కేంద్ర ప్రభుత్వం పెంచిన చమురు ధరలను వెనక్కు మళ్ళిస్తుందా లేక వ్యవసాయ అవసరాల నిమిత్తం డీజిలును లీటరు రూ.35 లకు సరఫరా చేస్తారా నిర్ణయించుకోవాలి. లేకపోతే దేశంలో రైతాంగం సామూహిక సమైక్య ప్రతిఘటన, నిరసన ఎదుర్కొనేందుకు సిద్ధం కండి'' అని రాజన్ క్షీరసాగర్ హెచ్చరించారు.

భారతదేశంలో ముడి చమురు బ్యారెల్ ధర 2026 ఆర్థిక సంవత్సరంలో 67.68 డాలర్లకు తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం ఈ ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయకుండా అధికపన్నుల భారాలు మోపడాన్ని కొనసాగించింది, 35 నుండి 40 శాతం మేరకు రష్యా చమురు తగ్గువ ధరకు దిగుమతి చేసుకున్నప్పటికీ కూడా రైతులకు మేలు కలగలేదు. ప్రపంచ వ్యాప్తంగా సంక్షోభ పరిస్థితులు ఉన్నప్పటికీ రష్యా ద్వారా వచ్చిన చమురువల్ల కొంత ఉపశమనం కలిగింది. కానీ తర్వాత అమెరికా ఒత్తిడివల్ల కేంద్ర ప్రభుత్వం రష్యా చమురు దిగుమతి చేసుకోవడం ఆపేసింది. బిజెపి ప్రభుత్వం ఆర్థిక వెసులుబాటును రైతులకు ఉపశమనం కలిగించడానికి ఉపయోగించకుండా, ఖజానా నింపుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చింది, చమురు వినియోగంలో రాయితీలు ఇవ్వడంలో రైతులను చిన్నచూపు చూస్తూ, విమానయాన రంగానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చిందో కూడా స్పష్టంగా కళ్ళకు కనిపిస్తోందని ఎఐకెఎస్ నాయకులు తమ ప్రకటనలో విమర్శించారు. విమానయాన రంగానికి కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వడాన్ని సోదాహరణంగా ప్రముఖంగా ప్రస్తావించారు.



మొదటి ప్రాధాన్యతగా జెట్ ఇంధనం (ఎటిఎఫ్) కొనుగోలు చేసేందుకు చాలా చాలా తక్కువ పన్నులు విధించారు. ఉత్తర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు కేవలం ఒకేఒక్క శాతం వ్యాట్ పన్ను ఎటిఎఫ్‌పై విధించింది. మహారాష్ట్రలో డీజిపై మాత్రం 21 శాతం వ్యాట్ పన్ను విధించారు. ఈ తేడా ఏ స్థాయిలో ఉందో పోల్చిచూస్తే అర్థం అవుతుంది. అదేవిధంగా బీహార్‌లో ఎటిఎఫ్‌పై వ్యాట్‌ను 29 శాతం నుండి కేవలం నాలుగు శాతానికి తగ్గించేశారు.

ఇక రెండో ప్రాధాన్యతాంశం ఏమిటంటే, ఎటిఎఫ్‌పై పన్నులను తగ్గించడంకోసం రాష్ట్రాలకువ్యవ విజ్ఞప్తుల లేఖలు రాసేందుకు కేంద్ర మంత్రులు చాలా క్రియాశీలంగా ప్రవర్తించారు. కానీ వ్యవసాయ రంగానికి సరఫరీ చేసే డీజిలు ధర తగ్గించేందుకు మాత్రం కేంద్ర మంత్రులు ఆ స్థాయిలో అలాంటి జోక్యం చేసుకోలేదు. మూడో ప్రాధాన్యతాంశం ఏమిటంటే, ఎటిఎఫ్‌పై ఎగుమతి సుంకాలను కేవలం రెండు రోజుల క్రితమే లీటరుకు రూ.33 ల నుండి రూ.16 లకు తగ్గించారు. కానీ రైతులు మాత్రం శిక్షకు గురవుతూ,సుంకాల భారాల కింద నలిగిపోతూనే ఉన్నారు. ఇది కేవలం నిర్లక్ష్యం మాత్రమే కాదు, ఉద్దేశపూర్వకమైన స్థిరంగా కొనసాగుతున్న వర్గ వివక్ష అని రాజన్‌క్షీరసాగర్ విమర్శించారు.

ఎటిఎఫ్ ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం తనంతట తానుగా గ్రాంటులను మినహాయింపులను ఇస్తోంది, రైతులు మాత్రం డీజిలు ధరల కింద పడి నలిగిపోతున్నారు, చేసేదిలేక రైతులు మౌనంగా ఉండిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**ఎలాంటి పన్నులు లేకుండా వ్యవసాయానికి డీజిల్ ఇవ్వాలి**

రైతులకు ఎలాంటి పన్నుల భారాలు లేకుండా వ్యవసాయ అవసరాల నిమిత్తం డీజిలు సరఫరా చేయాలని ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి కృష్ణదేవ్ సింగ్ డిమాండ్ చేశారు. తక్షణం రైతులకు కేంద్రం,రాష్ట్రాలలో ప్రభుత్వాలు పన్నుల మినహాయింపులు ఇవ్వాలని కోరారు. రోడ్ టాక్స్,మౌలిక సదుపాయాల పన్నులను కూడా వీటి నుండి మినహాయించాలని, లీటరు డీజిలు ధరను రూ.35లుగా నిర్ణయించి రైతులకు సరఫరా చేయాలని అఖిలభారత కిసాన్‌సభ డిమాండ్ చేస్తోందని చెప్పారు. రైతులకు తక్షణం ఉపశమనం కలిగించాలని, రైతులు కేవలం డీజిలుపైనే ఆధారపడి ఉంటారని, ట్రాక్టర్లను, హార్వెస్టర్లను నడిపించే ముఖ్యమైన ఇంధనం అదేనని, వ్యవసాయ పంపులకు, నీటిని తోడేందుకు డీజిలే ప్రధాన సాధనమని రవాణా ముఖ్యమైన అంశమని ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం దాదాపుగా రూ.7.41 లక్షల కోట్లు ప్రతి సంవత్సరం పెట్రోలియం రంగం ద్వారా వసూలు చేస్తోందని, ఇందులో కేంద్ర ప్రభుత్వం వాటి రూ.4.28 లక్షల కోట్లు కాగా, రాష్ట్రాల వాటా రూ.3.20 లక్షల కోట్లుగా ఉందని, ఈ గణాంకాలు ఒక్కటి గమనిస్తే రైతులకు డీజిలు సరఫరా నిమిత్తం పన్నులను రద్దు చేయవచ్చుననే విషయం చాలా స్పష్టంగా తెలుస్తోందని పేర్కొన్నారు.

## విజయ్ వద్దే హోంశాఖ

- కె.ఎ. సెంగోట్టయ్యన్‌కు ఆర్థికశాఖ
- తమిళనాడులో మంత్రులకు శాఖల కేటాయింపు



**చెన్నై :** ఇటీవల తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరగా, ముఖ్యమంత్రి, మరో 9 మంత్రులుగా ప్రమాణం చేశారు. వారికి శనివారం ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శాఖలు కేటాయించారు. తన తొలి ప్రభుత్వంలో సిఎం విజయ్ పోలీస్, సాధారణ పరిపాలన, మహిళలు, యువత, పిల్లల సంక్షేమం వంటి కీలకమైన పోర్ట్‌ఫోలియోలను నిర్వహిస్తారని, సీనియర్ నాయకుడు కె.ఎ. సెంగోట్టయ్యన్‌ను ఆర్థిక మంత్రిగా నియమించినట్లు లోక్‌భవన్ శనివారం తెలిపింది. హోం శాఖను తన వద్దే ఉంచుకోవడం ద్వారా, తమిళనాడులో ముఖ్యమంత్రులు ముఖ్యమైన పోర్ట్‌ఫోలియోలను తమ వద్దే ఉంచుకునే సంప్రదాయాన్ని విజయ్ కొనసాగిస్తున్నారు. విజయ్‌తో సహా 10 మంది మంత్రుల పోర్ట్‌ఫోలియోలను ముఖ్యమంత్రి సిఫార్సు మేరకు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ఆమోదించారని తమిళనాడు లోక్‌భవన్ పత్రికా ప్రకటన తెలిపింది. ఈనెల 10న విజయ్ నేతృత్వంలోని మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసిన వారం రోజుల తర్వాత ఈ పోర్ట్‌ఫోలియోల కేటాయింపులు జరిగాయి. లోక్‌భవన్ తెలిపిన వివరాల ప్రకారం, విజయ్ ప్రజా, సాధారణ పరిపాలన, పోలీస్, మహిళలు, యువజన సంక్షేమం, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమం, పురపాలక పరిపాలన, పట్టణ, నీటి సరఫరా శాఖలను నిర్వహిస్తారు. ఎన్. ఆనంద్‌ను గ్రామీణాభివృద్ధి, జలవనరుల శాఖ మంత్రిగా నియమించారు. ఆదవ్ అర్జున ప్రజా పనులు (భవనాలు, రహదారులు, చిన్న ఓడరేవులు), క్రీడాభివృద్ధి శాఖలను చూసుకుంటారు. డాక్టర్ కె.జి. అరుణ్‌రాజ్ ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖల మంత్రిగా ఉంటారని ఆ ప్రకటన తెలిపింది. పి. వెంకటరమణన్‌కు ఆహార, పౌర సరఫరాల శాఖను కేటాయించగా, ఆర్. నిర్మల్‌కుమార్ ఇంధన వనరులు, న్యాయ శాఖలను నిర్వహిస్తారు. రాజ్ మోహన్ పాఠశాల విద్య, తమిళ అభివృద్ధి, సమాచార, ప్రచార శాఖల మంత్రిగా ఉంటారు. డాక్టర్ టి.కె. ప్రభు సహజ వనరులు, ఖనిజాలు, గనుల శాఖలను నిర్వహిస్తారని, ఎస్. కీర్తన పరిశ్రమల శాఖ మంత్రిగా ఉంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భారతదేశం ఒక 'అవకాశాల గడ్డ'

### ప్రధాని మోదీ
### హేగ్‌లో భారతీయ సమాజాన్ని ఉద్దేశించి సుదీర్ఘ ప్రసంగం
### 'ఇకపై భారతదేశపు ఆకాంక్షలు దాని సరిహద్దులకు మాత్రమే పరిమితం కావు' అని ఉద్ఘాటన



**ది హేగ్ :** భారతదేశాన్ని ఒక 'అవకాశాల గడ్డ'గా ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివర్ణిస్తూ, దేశం అపూర్వమైన పరివర్తనకు లోనవుతోందని, దాని ఆకాంక్షలు 'ఇకపై దాని సరిహద్దులకు మాత్రమే పరిమితం కావు' అని ఉద్ఘాటించారు. శనివారం ప్రధానమంత్రి మోదీ నెదర్లాండ్స్ పరిపాలనా (అడ్మినిస్ట్రేటివ్) రాజధాని హేగ్‌లో భారతీయ సమాజాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. భారతదేశం పెద్ద కలలు కంటోంది అని, దాని యువత ఆకాశమే హద్దుగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నదని పేర్కొన్నారు. ఈ రోజు భారతదేశం కేవలం పరివర్తనను మాత్రమే కోరుకోవడం లేదని చెబుతోందని, మాకు అత్యంత ఉత్తమమైనది, అత్యంత వేగవంతమైనది కావాలని కోరుకుంటోందని, అందుకే భారతదేశAంలో అపరిమితమైన ఆకాంక్షలు ఉన్నప్పుడు, చేసే ప్రయత్రాలు కూడా అపరిమితంగా మారుతున్నాయని మోదీ చెప్పారు. ఆయన 40నిమిషాలకు పైగా కొనసాగించిన తన ప్రసంగంలో ప్రేక్షకు ల కరతాలధ్వనులు ప్రతిధ్వనించాయి. నేటి భారతదేశం అపూర్వమైన పరివర్తన దశ గుండా వెళుతోందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత విజయవంతమైన ఆర్టిఫిషియల్ (ఏఐ) సదస్సుకు భారతదేశం ఆతిథ్యం ఇవ్వడం మీరు ఇటీవల చూసే ఉంటారని గుర్తుచేశారు. అంతకుముందు జి–20 సదస్సును కూడా భారతదేశం విజయవంతంగా నిర్వహించిందని, ఇది ఒక్కసారి జరిగిన కార్యక్రమం కాదన్నారు. ఇది ఇప్పుడు నేటి భారతదేశం లక్షణంగా మారిందన్నారు. భారతదేశంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్ ఉందని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ, భారతదేశ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రశంసించారు. భారతదేశం ఆకాంక్షలు నేడు దాని సరిహద్దులకు మాత్రమే పరిమితం కావన్నారు. ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని, ప్రపంచ తయారీ కేంద్రంగా మారాలని, ప్రపంచ హరిత ఇంధన రంగంలో అగ్రగామిగా నిలవాలని, ప్రపంచ వృద్ధికి చోదకశక్తిగా కూడా ఎదగాలని కోరుకుంటోందని వివరించారు. 2014లో భారతదేశంలో కేవలం నాలుగు యూనికార్న్‌లు మాత్రమే ఉండేవని గుర్తుచేస్తూ, ప్రస్తుతం 125 క్రియాశీల యూనికార్న్‌లు ఉన్నాయన్నారు. నేడు మన స్టార్టప్‌లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రక్షణ, అంతరిక్ష రంగాలలో అద్భుతంగా పనిచేస్తున్నాయని, పరిశోధన, ఆవిష్కరణల సంస్కృతి మరింత విస్తరిస్తోందని నరేంద్ర మోదీ జోడించారు. పలు రాష్ట్రాలలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలను ప్రస్తావిస్తూ భారతదేశ ఆకాంక్షలతో కూడిన ప్రయాణం దాని ప్రజాస్వామ్యాన్ని కూడా బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈసారి పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాలలో దాదాపు 80నుంచి 90శాతం మేరకు ఓటింగ్ నమోదైందని, మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందని,ఈ ధోరణి ప్రతీ రాష్ట్రంలోనూ కనిపిస్తోందని, నేడు భారతదేశంలోని ఓటర్లు చాలా ఉత్సాహంగా కనిపిస్తున్నారని, ప్రతీ ఏటా ఓటింగ్ రికార్డు బద్దలు అవుతోందని, అది మాకు గర్వకారణంగా ఉందని మోదీ చెప్పారు. ప్రతిపక్ష పార్టీలపై కూడా మోదీ వ్యంగంగా విమర్శలు చేశారు. జనాదరణ పొందిన ఝల్‌మురి అనే చిరుతిండి హేగ్ కూడా చేరిందా ? అని ఆయన ప్రేక్షకులను ప్రశ్నించారు. నెదర్లాండ్స్ తులిప్ పువ్వులకు ప్రసిద్ధి చెందిందని, నొక్కిచెబుతూ భారతదేశం తామరపువ్వులకు ప్రసిద్ధి చెందిందని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. వేర్లు నీటిలో ఉన్నా, భూమి మీద ఉన్నా అందం, బలం రెండూ లభిస్తాయని తులిప్, తామర రెండూ మనకు బోధిస్తాయని ఉదహరించారు. వాణిజ్యం, సాంకేతికత, రక్షణ, పునరుత్పాదక ఇంధనం వంటి రంగాలలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు మోదీ తన 5 దేశాల పర్యటనలో భాగంగా శుక్రవారం నెదర్లాండ్స్‌కు చేరుకున్నారు.

# 'అమృత కాలం' విద్యార్థులకు మృత్యుకాలం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి
- 'పరీక్షా పే చర్చ' కాదు... 'పరీక్షా కీ సమీక్ష' అవసరం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** నీట్ రద్దు వివాదం నేపథ్యంలో కేంద్ర సర్కార్‌లో కాంగ్రెస్ విమర్శల పర్వం కొనసాగిస్తోంది. మోదీ ప్రభుత్వ హయాంలో నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు 'అమృత కాలం' కాస్త 'మృత్యు కాలం'గా మారుతోందని ఆరోపించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ప్రధాన్ ఈ బాధ్యతకు సరిపడే వ్యక్తిగా కనిపించడం లేదని ప్రతిపక్షం పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన వార్షిక 'పరీక్షా పే చర్చా' కార్యక్రమానికి భారీ ప్రచారం కల్పిస్తున్నప్పటికీ, వాస్తవానికి కావలసింది 'పరీక్షా కీ సమీక్ష' అని అభిప్రాయపడింది. మోదీపై పరోక్షంగా విమర్శలు చేస్తూ, ఆయన తప్పనిసరిగా 'పరీక్షా లీక్‌లపై చర్చ' నిర్వహించాలని, కేవలం మౌనం పాటిస్తే ఏమీ సాధించలేమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో హిందీలో పోస్టు చేశారు. 'నీట్ పేపర్ లీక్ కుంభకోణం వల్ల కలిగిన మానసిక క్షోభతో పలువురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. లఖింపూర్ ఖేరీకి చెందిన రితిక్ మిశ్రా, ఢిల్లీకి చెందిన 20 ఏళ్ల అన్షిక పాండే, రాజస్థాన్‌లోని ఝున్‌ఝునుకు చెందిన ప్రదీప్ మేఘ్వాల్, గోవాలో నివసిస్తున్న బెంగళూరుకు చెందిన ఒక విద్యార్థి వీరందరూ ఈ విషాదకరమైన, ఆత్మహత్యాయత్నం చేశారు' అని ఖర్గే అన్నారు. కొందరు చిన్నప్పటి నుంచే ఈ కలను కన్నారని, మరికొందరు తమ కుటుంబాల అంచనాలను నెరవేర్చడం కోసం సంవత్సరాల తరబడి సన్నద్ధమై, సర్వస్వం పణంగా పెట్టారని, అయినప్పటికీ, మోదీ ప్రభుత్వ అవినీతి, అసమర్థ వ్యవస్థ వారి కలలను కాలరాసిందని ఖర్గే దుయ్యబట్టారు. మోదీ పాలనలో 90కి పైగా పరీక్షా పత్రాలు లీక్ అయ్యాయని, దీనివల్ల 9 కోట్ల మందికి పైగా విద్యార్థులు, వారి కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని ఆయన ఆరోపించారు. ప్రజ్వలిస్తున్న నిరుద్యోగ అగ్ని ఇప్పటికే యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, ఇప్పుడు, బిజెపి అండతో పనిచేస్తున్న పేపర్‌లీక్ మాఫియా, పరీక్షలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్న ప్రభుత్వ వాదనలను ముక్కలు ముక్కలుగా చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ ఇప్పుడు స్వయంగా వాస్తవాలను తనిఖీ చేయడం కూడా మొదలుపెట్టారన్నారు. ఇటీవల ఆయన జీవన సౌలభ్యం గురించి ట్వీట్ చేశారని, కానీ నీట్ పేపర్ లీక్, దాని పర్యవసానంగా జరిగిన విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో మాత్రం పూర్తి మౌనం వహించారన్నారు. 2024 నీట్ పేపర్ లీక్‌లో ప్రమేయం ఉన్న అధికారులకు ఎలాంటి శిక్ష పడలేదని, పైగా వారికి లాభదాయకమైన, కీలకమైన పోస్టులు ఇచ్చి సత్కరించారని ఆయన ఆరోపించారు. సరిగ్గా ఈ కారణంగానే ఏటా యువత భవిష్యత్తు దోచుకోబడుతోందని ఆయన పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)పై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చేసిన సిఫార్సులను ప్రస్తావిస్తూ, దానిపై వచ్చిన ఒక మీడియా నివేదికను ఎక్స్ ఛానెల్‌లో పంచుకున్నారు. 'మూడవ తరగతి స్థాయి సాధారణ విద్యావంతులతో నిండిన మోదీ ప్రభుత్వ విద్యా వ్యవస్థ, గత కొన్నేళ్లుగా అత్యంత అసమర్థమైనదిగా, రాజకీయ ప్రేరేపితమైనదిగా, అవినీతిమయమైనదిగా నిరూపించుకుంది' అని రమేష్ ఆరోపించారు. 'ప్రతి నెలా ఒక కొత్త సంక్షోభం తలెత్తుతోంది ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల వివాదం, విసిల నియామకాలపై యుజిసి ముసాయిదా నిబంధనలు, నిరంతర ప్రశ్నపత్రాల లీకులు, ఎన్‌ఎఎసి లంచాల కుంభకోణం, ఐసిహెచ్‌ఆర్ కుంభకోణం, సమగ్ర శిక్షా నిధులను రాజ్యాంగ విరుద్ధంగా నిలిపివేత, పలు కీలక కేంద్ర విశ్వవిద్యాలయాల్లో నియమితులైన వైస్ ఛాన్సలర్లు విధులకు గైర్హాజరు కావడం, ఉన్నత విద్యాసంస్థల్లో బోధనా పోస్టుల్లో భారీ ఖాళీలు' అని ఆయన అన్నారు. ఇప్పుడు విద్యా మంత్రిత్వ శాఖ అసమర్థతకు ఆయన అహంకారం మాత్రమే సరిసమానంగా ఉందని స్పష్టమవుతోందని రమేష్ అన్నారు. 'ఎన్‌టిఎపై విద్యాశాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం సిఫార్సులను తమ మంత్రిత్వ శాఖ ఎందుకు పట్టించుకోలేదని మీడియా ప్రశ్నించగా.. అందులో ప్రతిపక్ష సభ్యులు ఉన్నారు అనే కారణంతో పార్లమెంటరీ స్థాయీ సంఘం నివేదికను తీవ్రంగా పరిగణించడానికి మంత్రి నిరాకరించారన్నారు. వాస్తవానికి, పార్లమెంటులోని 30 మంది సభ్యులలో 17 మంది బిజెపికి చెందినవారేనని రమేష్ ఎత్తి చూపారు.




# నోయిడా నిరసనకారులపై ఉగ్రవాదులు అనే ముద్ర తగదు

### ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి 'సుప్రీం' వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** నొయిడాలో ఏప్రిల్ 13న అధిక వేతనాల కోసం పట్టుపట్టిన నిరసనకారులను ఉగ్రవాదులు అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భావించవద్దని సుప్రీం కోర్టు పేర్కొంది. రాజ్యాంగంలో ప్రభుత్వ విధానాలకు సంబంధించిన ఆదేశిక సూత్రాలలో కార్మికులకు జీవనానికి అవసరమైన వేతనాలు కల్పించాల్సిన విధి ప్రభుత్వాలపై ఉన్న విషయాన్ని గుర్తు చేసింది. వాళ్ళు అధిక వేతనాలను కోరారని, వారిని ఉగ్రవాదులు అనుకోవద్దని జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. జాతీయ భద్రతా చట్టం కింద అదుపులో తీసుకొని, నిర్బంధించబడిన నిరసనకారుల కుటుంబసభ్యులు వేసిన పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది కొలిన్ గొంజాల్వెస్, న్యాయవాది షారుఖ్ ఆలం శనివారం వాదనలు వినిపించారు. ఎలాంటి ప్రాథమిక దర్యాప్తు చేయకుండానే నిరసనకారులకు వ్యతిరేకంగా అధికారులు అనేక ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని తెలిపారు. వారు వామపక్ష సానుభూతిపరులు అనే ఏకైక ముద్ర వేసి అధికారులు ఈ కేసులు పెట్టారని ఆలం కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు.

ప్రభుత్వ విధానంపై ఆదేశిక సూత్రాల ప్రకారం జీవనానికి అవసరమైన వేతనాలు కార్మికులకు చెల్లించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి కాదా? అని జస్టిస్ భుయాన్ అన్నారు. రాజ్యాంగంలోని 43వ అధికరణ ప్రకారం చట్టం ద్వారా గానీ, ఆర్థిక వ్యవస్థ ద్వారా గానీ, లేదా మరేదైనా చట్టబద్ధమైన మార్గం ద్వారా గానీ, కార్మికులందరికీ జీవనానికి అవసరమైన వేతనం, గౌరవప్రదమైన జీవన ప్రమాణాలను నిర్ధారించే పని పరిస్థితులు, విశ్రాంతి, సామాజిక, సాంస్కృతిక అవకాశాలను పూర్తిగా అనుభవించేలా చేయడానికి ప్రభుత్వం కృషి చేయాలని ఉన్నట్లు ఆలం పేర్కొన్నారు. తన బాధ్యతలను నెరవేర్చడానికి బదులుగా నోయిడాలోని నిరసనలకు ప్రేరేపకులుగా వారిని ప్రభుత్వం నిర్బంధించిందని ఆ న్యాయవాది తెలిపారు.



కాగా, కాస్నా జైలులో నిర్బంధంలో ఉన్నారని చెబుతున్న ఇద్దరు యువకులను మే 18న కోర్టులో హాజరుపరచాలని ధర్మాసనం ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. వారిని జ్యుడీషియల్ కస్టడీ నుండి బయటకు తీసుకువచ్చి, పోలీస్ రిమాండ్‌కు తరలించకుండా కూడా కోర్టు నిరోధించింది. నిర్బంధంలో ఉన్నవారిలో ఒకరి సోదరులు వారిని పోలీస్ కస్టడీలో చిత్రహింసలకు గురిచేశారని ఆరోపించారు.

### ఎన్నికల్లో విదేశీయులు ఓటు..
# విచారణకు ఇసి ఆదేశం

- పది మంది విదేశీయుల అరెస్టు

**చెన్నై :** తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో విదేశీయులు మోసపూరితంగా ఓటు వేశారన్న ఆరోపణలపై విచారణకు ఆదేశించినట్లు ఎన్నికల సంఘం అధికారి శనివారం తెలిపారు. విమానం ఎక్కడానికి ప్రయత్నించిన పది మంది విదేశీయులను పోలీసులు అరెస్టు చేసిన అనంతరం సమర్పించిన నివేదిక ఆధారంగా ఇసి ఈ చర్య తీసుకుంది. వారి చూపుడు వేళ్లపై చెరగని సిరా మరకలను గమనించిన విమానాశ్రయ అధికారులు అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు సమాచారం అందించారు. తమిళనాడు 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేశారన్న ఆరోపణలపై తొమ్మిది కేసుల్లో పది మంది విదేశీయులను అరెస్టు చేసినట్లు చెన్నై పోలీసులు తెలిపారు. వారిని చెన్నై, మదురై విమానాశ్రయాల్లో అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల విచారణలో ఈ వ్యక్తులు శ్రీలంక, యుకె, కెనడా దేశాలకు చెందినవారని తేలింది. 'వారు నకిలీ భారతీయ గుర్తింపు పత్రాలను ఉపయోగించి ఓటు వేశారు. వారు విమానంలో బయలుదేరడానికి ప్రయత్నించినప్పుడు వారి వేళ్లపై చెరగని సిరా మరకలు కనిపించాయి' అని పోలీసు అధికారి తెలిపారు. పోలీసు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తోందని, ఇసి నిబంధనల ప్రకారం విదేశీ ఓటరు భారత పౌరుడై ఉండాలని, మరే ఇతర దేశ పౌరసత్వం పొంది ఉండకూడదని ఆ అధికారి తెలిపారు. భారత పౌరసత్వాన్ని వదులుకున్న వారికి ఓటు వేసే అర్హత లేదు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 20 ఎ కింద ప్రవాస భారతీయులు ఓటు నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం వారు పోలింగ్ బూత్‌లో తమ అసలైన భారత పాస్‌పోర్ట్‌ను సమర్పించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.



## ఢిల్లీలో ఐవైసి నిరసన

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది నీట్‌యూజీ పరీక్ష ప్రశ్నపత్రాలు లీక్ ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ భారత యువజన కాంగ్రెస్ (ఐవైసి) శనివారం ఢిల్లీలో నిరసన చేపట్టింది. పోస్టర్లు, బ్యానర్లు, పార్టీ జెండాలు చేతబట్టుకుని, ఐవైసి కార్యకర్తలు తీన్ మూర్తి సర్కిల్ నుంచి విద్యాశాఖ మంత్రి నివాసం వైపు నిరసన ప్రదర్శన చేపట్టగా, పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ నిరసన సందర్భంగా ఐవైసి అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌తో సహా పలువురు సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో 3న జరిగిన నీట్‌యుజి పరీక్షను రద్దు చేశారు. జూన్ 21న తిరిగి పరీక్ష నిర్వహిస్తామని విద్యాశాఖ మంత్రి ప్రకటించారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ కుప్పకూలిందని నిరసన చేస్తున్న యువజన కాంగ్రెస్ ఆరోపించింది. గత 12 ఏళ్లలో 90కిపైగా పరీక్ష పత్రాలు లీకయ్యాయని, నీట్ పరీక్షే నాలుగుసార్లు లీకయ్యిందని ఆరోపిస్తూ, ఇది పరీక్షా వ్యవస్థ సమగ్రతపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని నిరసనకారులు అన్నారు. బిజెపి అలాంటి అవినీతి వ్యవస్థను సృష్టించిందని, దీనివల్ల ధనవంతుల పిల్లలు సీట్లు, ఉద్యోగాలు పొందుతుండగా, పేద కుటుంబాల విద్యార్థులు నష్టపోతున్నారని ఓ ఐవైసి కార్యకర్త తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.




# పెట్రో ధరల పెంపు–పేదలపై తీవ్ర ప్రభావం

- ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి : మాయావతి

**లక్నో :** పెట్రో ధరల పెంపుపై ప్రతిపక్ష పార్టీలు కేంద్రం దుమ్మెత్తిపోస్తున్నాయి. వీధుల్లోకి నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. వెంటనే ధరలు తగ్గించాలని డిమండ్ చేస్తున్నాయి. అందులో భాగంగా ఇంధన ధరల పెంపు లక్షలాది మంది జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) అధినేత్రి మాయావతి శనివారం పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల సంభవించిన తుఫానుల వల్ల జరిగిన భారీ ప్రాణ, ఆస్తి నష్టంపై మాజీ ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులైన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఉదారంగా సహాయం చేయాలని ఆమె కోరారు. 'నిత్యావసర వస్తువుల, ముఖ్యంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు నిరంతరాయంగా పెరుగుతున్న నేపథ్యంలో, పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం లక్షలాది పేద, కార్మిక కుటుంబాలు, వ్యవసాయ రంగం, మధ్యతరగతి ప్రజల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది' అని మాయావతి అన్నారు. ఇంధన ధరల పెరుగుదల భారాన్ని ఈ కుటుంబాలే నేరుగా మోయాల్సి వస్తుందని, అందువల్ల అటువంటి చర్యలను అరికట్టడానికి ప్రభుత్వం అవసరమైన, అర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. నాలుగు సంవత్సరాల తరువాత మొదటిసారిగా శుక్రవారం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 3 మేర పెంచారు. 'ఇటీవల ఉత్తరప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో సంభవించిన తీవ్ర తుఫానుల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగిన నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ఉదారంగా ముందుకు వచ్చి, ప్రభావిత వ్యక్తులకు, కుటుంబాలకు సాధ్యమైన అన్ని సహాయ సహకారాలను అందించాలి. తద్వారా వారు తమ ఛిన్నాభిన్నమైన జీవితాలను తిరిగి నిర్మించుకుని, కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు వీలు కల్పించాలి' అని మాయావతి అన్నారు. అధికారిక సమాచారం ప్రకారం, బుధవారం ఉత్తరప్రదేశ్‌లోని పలు జిల్లాలను బలమైన తుఫాను, భారీ వర్షాలు ముంచెత్తడంతో చెట్లు కూలిపోయి, ఇళ్లు దెబ్బతిన్నాయి. ఈ ఘటనలో కనీసం 111 మంది మరణించగా, 72 మంది గాయపడ్డారు.



# నైజీరియాలో ప్రపంచ క్రియాశీల ఉగ్రవాది హతం

## అమెరికా స్పెషల్ ఆపరేషన్
## ట్రంప్ ప్రకటన



**వాషింగ్టన్:** ఇస్లామిక్‌స్టేట్ (ఐఎస్ఐఎస్) ఉగ్రవాద సంస్థకు చెందిన ద్వితీయశ్రేణి నాయకుడు,ప్రపంచ క్రియాశీల ఉగ్రవాద నాయకుడొకరిని ఆఫ్రికాదేశం నైజీరియాలో హతమార్చినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. నైజీరియా, చాద్, నిగర్,కామెరూన్ దేశాలకు ఉమ్మడి ఆస్తిగా ఉన్న జలమార్గాలు,చిత్తడి నేలలతో కూడిన చాద్ సరస్సు బేసిన్‌లో ఉన్న అల్-మినూకీ స్థావరంపై అమెరికా దళాలు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించాయి. ఈ దాడిలో అతడితోపాటు అనేకమంది అతని సహచర లెఫ్టినెంట్‌కూడా హతమయ్యారని ట్రంప్ చెప్పారు. దక్షిణాఫ్రికాలోని దేశాల్లో చాలాకాలంగా రహస్యంగా తలదాచుకుని బ్రతుకుతూ ముస్లిం హింసాత్మక ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న అబూ బిలాల్ అల్-మినూకీ హతమయ్యాడని ట్రంప్ చెప్పారు. ప్రపంచ ఉగ్రవాద చర్యలకోసం అల్-మినూకీ ప్రత్యేకంగా నియమితుడయ్యాడని 2023లో అమెరికా ప్రకటించింది. అతడికోసం అప్పటినుండీ జల్లెడ పట్టింది. అల్ మినూకీ మరణంతో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థకు చావు దెబ్బ తగిలిందని నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు చెప్పారు. బోర్నో రాష్ట్రంలోని మెటెలేలో అల్-మినూకీ ఒక బలమైన స్థావరం ఏర్పాటు చేసుకున్నాడని గుర్తించినట్లు చెప్పారు. చాద్ సరస్సు చాలాకాలంగా ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ (ఐఎస్‌డబ్ల్యూఏపీ)కు, దాని ప్రత్యర్థివర్గం బోకోహరం ఉగ్రవాద సంస్థకు బలమైన కేంద్రంగా ఉంది. అతడి మరణంతో ఐఎస్ఐఎస్ కార్యకలాపాలు బాగా తగ్గిపోయాయని ట్రంప్ చెప్పారు. నైజీరియా ప్రభుత్వ సహకారంతో ఎంతో పకడ్బందీగా స్పెషల్ ఆపరేషన్ నిర్వహించినట్లు చెప్పారు. "అల్-మినూకీ ఆఫ్రికాలో చాలా సురక్షితంగా ఆశ్రయంపొంది ఉండొచ్చునని అనుకున్నారు. కానీ ఎప్పటికప్పుడు అతడి కదలికలకు సంబంధించిన సమాచారం మాకు తెలుస్తూనే ఉంది, అతడి పరిణామక్రమం తమకు తెలుస్తూనే ఉందన్న విషయం అల్-మినూకీకి మాత్రమే తెలియని ట్రంప్ సోషల్ మీడియా వేదిక ద్వారా చెప్పారు. ''ఇక అల్-మినూకీ ఆఫ్రికన్ ప్రజలను భయపెట్టలేదు, అమెరికా సైనికులను, అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేయలేదు, అతడిని అంతం చేశాం, ఇక అమెరికాకు వ్యతిరేకంగా అతగాడు ఎలాంటి ప్రణాళికలూ రచించలేడు'' అని ట్రంప్ చెప్పారు. ''ప్రపంచంలో చాలా చురుగ్గా ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించే ఉగ్రవాదిని యుద్ధరంగం నుండి నిర్మూలించినట్లయింది, పకడ్బందీ ప్రణాళికతో రూపొందించిన చాలా సంక్లిష్టమైన ఆపరేషన్‌ను ధైర్యవంతులైన అమెరికా సైనిక దళాలు, నైజీరియా ప్రభుత్వ పోలీసులు ఎలాంటి తప్పులూ దొర్లకుండా క్రమశిక్షణతో పూర్తిచేసి అల్-మినూకీకి అంతమొందించాం'' అని ట్రంప్ పేర్కొన్నారు.ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాద సంస్థ కార్యకలాపాలు చాలా అత్యధికంగా 90 శాతం మేరకు సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలోనే కొనసాగుతున్నాయని, ఇక వీటికి కూడా బ్రేక్ పడిందని చెప్పారు.

## క్యూబా మాజీ అధ్యక్షుడు, వృద్ధనేత

# రౌల్ కాస్ట్రోపై అమెరికా క్రిమినల్ కేసులు?



**వాషింగ్టన్:** క్యూబా రిపబ్లిక్ మాజీ అధ్యక్షుడు, క్యూబా కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ మొదటి కార్యదర్శి (2011–2021), పార్టీ వృద్ధనేత రౌల్ కాస్ట్రో (94)పై క్రిమినల్ కేసులు మోపి అరెస్టు చేసేందుకు అమెరికా ప్రయత్నాలు చేస్తోంది! ఈ మేరకు అమెరికా న్యాయశాఖ అన్ని సన్నాహాలు పూర్తిచేసి నేరాభియోగాలు మోపేందుకు సిద్ధమతుతోందని బ్రిటన్ మీడియా ప్రకటించింది. బహుశా వచ్చే బుధవారంనాటికి ఈ నేరాభియోగాల పత్రం బయటకు వెలువడుతుందని పేరుచెప్పడానికి ఇష్టపడని న్యాయాధికారి (డిఓజె) అమెరికా మీడియాకు చెప్పారు. సిఐఎ డైరెక్టర్ ఒకరు హవానాలోని క్యూబా నాయకులను కలుసుకోవడానికి వెళ్ళినప్పుడు ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఐతే అమెరికా న్యాయశాఖ అభియోగాలను గ్రాండ్ జ్యూరీ ఇంకా ఆమోదించాల్సి ఉంది. తన సోదరుడు ఫైడెల్ కాస్ట్రో మరణించిన తర్వాత తమ్ముడు రౌల్‌కాస్ట్రో పదవీ బాధ్యతలు చేపట్టి 15 సంవత్సరాలు దేశాన్ని పాలించారు. 2021లో పదవి నుండి ఆయన వైదొలగారు.క్యూబాపై చమురు ఆంక్షల దిగ్బంధనం,విస్తృత ఆంక్షల నేపథ్యంలో రెండు దేశాలమధ్యా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకున్నాయి. క్యూబాను లొంగదీసుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా ఆ దేశంపై దుష్ప్రచారంతోపాటు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉందనే వాతావరణం సృష్టించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ దశలో రౌల్‌కాస్ట్రోపై నేరాభియోగాలు మోపుతున్నారు. సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవపోరాటంలో క్రియాశీలపాత్ర వహించిన పాతతరం ఆయన కుటుంబ నాయకులలో సజీవంగా ఉన్నది రౌల్ కాస్ట్రో ఒక్కరే. బ్రదర్ టు ద రెస్క్యూ మానవతా కార్యకర్తల బృందం నడుపుతున్న రెండు విమానాలను 1996లో కూల్చివేశారనే ఆరోపణల చుట్టూ ఈ అభియోగాలు కేంద్రీకృతమై ఉన్నట్లు సమాచారం వెలుగులోకి వచ్చింది. క్యూబా విప్లవ పోరాటకాల సైనిక నాయకులలో రౌల్‌కాస్ట్రో ఒకరు.1959 నుండి 2008 వరకూ ఆయన క్యూబా సాయుధబలగాల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. క్యూబా అత్యున్నత నిర్ణయాత్మక విభాగం కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ క్యూబా పొలిట్‌బ్యూరోలో 1965 నుండి 2021 వరకూ ఆయన సభ్యుడుగా కొనసాగారు. సిఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ గురువారం హవానాలో రౌల్ కాస్ట్రో మనవడు రౌలిటో రోడ్రిగ్జ్ కాస్ట్రోతో సహా క్యూబా అధికారులతో సమావేశమయ్యారు.కరేబియన్ దేశంపై అమెరికా విధించిన ఇంధన దిగ్బంధం, క్యూబా విద్యుత్ గ్రిడ్ కుప్పకూలడం వంటి కారణాలతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరాయి. క్యూబాకు 100 డాలర్ల మానవతా సహాయం, శాటిలైట్ ఇంటర్నెట్‌కు మద్దతు అందిస్తామని అమెరికా విదేశాంగ శాఖ ఈ వారారంభంలో పునరుద్ఘాటించింది. జనవరి చివరిలో క్యూబాకు చమురు అమ్మే లేదా సరఫరా చేసే ఏ దేశంపైనైనా సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరించారు. ఆ దేశంలో జోక్యం చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించినప్పటికీ, ఒక వేళ అలా జరిగితే తమ దేశం పోరాటానికి సిద్ధంగా ఉందని క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియాజ్‌కానెల్ ఇటీవల స్పష్టం చేశారు.

# రాజకీయ మనుగడకోసం స్టార్‌మర్ పోరాటం



## రక్షణ బడ్జెట్ భారీగా 18 బి.పౌండ్లకు పెంచే యోచన
## తెరమీదకు ఆండీ బర్న్‌హామ్

**లండన్:** బ్రిటన్ అధికారపార్టీ లండన్ స్థానిక ఎన్నికల్లో చరిత్రాత్మకమైన ఘోర ఓటమి తర్వాత పదవీ గండం ఎదుర్కొంటున్న ఆ దేశ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ రాజకీయ మనుగడను కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నారు. ఇందులో భాగంగా బ్రిటన్ రక్షణ బడ్జెట్‌ను భారీస్థాయిలో 18 బిలియన్ పౌండ్లకు పెంచే ఆలోచన చేస్తున్నారు. మరోవైపు లేబర్‌పార్టీలో అంతర్గతంగా ఆయనకు పెద్ద సవాలు ఎదురవుతోంది. రాజీనామా చేయాలని రోజు రోజుకూ ఒత్తిడి పెరుగుతోంది. ఐతే పదవికోసం పోరాటం చేసే సమయం కాదని, ప్రజా సమస్యల కోసం పార్టీ ఐక్యంగా నిలబడి పోరాటం చేయాలని ఎంపీలను కూడగట్టేందుకు స్టార్‌మర్ ప్రయత్నం చేస్తున్నారు. కాగా బ్రిటన్‌లో జరిగే ప్రసిద్ధ యుద్ధవార్షికోత్సవం (నెపోలియన్ బోనాపార్టీని చిత్తుగా ఓడించిన రోజు) రోజున జూన్ 18న ఎన్నికల్లో మేకర్‌ఫీల్డ్ స్థానం నుండి పోటీ చేసేందుకు గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ బర్న్‌హామ్‌కు లేబర్‌పార్టీ జాతీయ కార్యనిర్వహణా కమిటీ శుక్రవారం అనుమతి ఇవ్వడంతో స్టార్‌మర్ ఓటమి అంచుకు చేరుకున్నారు. ఈ ఎన్నిక లాంఛనపూర్వకమే. బర్న్‌హామ్ గెలుపు సర్‌కీర్ స్టార్‌మర్ పాలనకు ముగింపు పలుకుతుంది. వెస్ట్‌మినిస్టర్‌లోకి ఆయన ప్రవేశిస్తే సాటర్‌మర్‌ను ఇక ఆయన సవాలు చేస్తారు. పైగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు కూడా దీనికి జత కలిశాయి. పదవీకాలం చరమదశకు చేరుకున్న ప్రధానమంత్రిగా ఆయన విస్తారమైన ప్రచారం పొందుతున్నారు. ఆయన చిరకాల విమర్శకుడుగా ఉన్న ట్రంప్ కూడా స్టార్‌మర్ పదవి భవిత్యవ్యంపై పెదవి విరిచారు. అనేక నెలల తరబడి ప్రభుత్వం సంక్షోభం ఎదుర్కొంటున్నందువల్ల స్టార్‌మర్ తనను చుట్టుముట్టి ఉన్న సంక్షోభం నుండి బయట పడే అవకాశం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు.

# గాజాలో టాప్ హమాస్ కమాండర్ కాల్చివేత



**గాజా:** గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్నప్పటికీ హమాస్ ఉగ్రవాదుల వేట పేరుతో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ సైన్యం చేసిన గగపతల దాడుల్లో హమాస్‌కు చెందిన ఇజ్–అద్–దిల్–ఖస్సామ్ బ్రిగేడ్ సీనియర్ కమాండర్ ఇజ్–అల్ దిన్ అల్ హద్దాద్ హతుడయ్యాడు. 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై దాడి చేసేందుకు వ్యూహ రచన చేసిన ప్రముఖులలో హద్దాద్ భాగస్వామ్యం కూడా ఉందని ఐడి.ఎఫ్ దళాలు గుర్తించాయి. 2025 మే నెలలో హమాస్ నాయకుడు మహ్మద్ సిన్వార్ హతుడైన తర్వాత హమాస్ సైన్యాధిపతిగా హద్దాద్ బాధ్యతలు స్వీకరించాడు. తనపై దాడి జరగకుండా వ్యూహం పన్ని బందీలను తన చుట్టూ రక్షణ కవచంగా ఏర్పాటు చేసుకున్నాడని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. ఇజ్రాయెల్ దళాలు హద్దాద్‌ను కాల్చిచంపినట్లు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ,రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ శనివారం ప్రకటించారు. హమాస్‌కు చెందిన అగ్రశ్రేణి కమాండర్ రహస్యంగా తలదాచుకున్నాడని సమాచారం అందడంతో అతడున్న అపార్ట్‌మెంట్‌పై ఇజ్రాయెల్ సైన్యం డ్రోన్లు, యుద్ధ విమానాలను ప్రయోగించింది. హద్దాద్ ఆ ప్రాంతం నుండి తప్పించుకోకుండా అడ్డుకునేందుకు ముందుగానే కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. రహదార్లపై వాహనాలను దిగ్బంధనం చేసింది. 1970లో గాజాలో జన్మించిన హద్దాద్ 1987లో హమాస్‌లో చేరి యూనిట్ కమాండర్ స్థాయి నుండి బ్రిగేడియర్ అధిపతి స్థాయికి ఎదిగాడు. అబూ సుబైబ్, ఘోస్ట్ ఆఫ్ అల్–ఖస్సాం అనే మారు పేర్లతో ప్రసిద్ధి చెందారు. గాజాలో సైనిక మౌలిక సదుపాయాల పునర్నిర్మాణంలో ఆయన కీలకపాత్ర వహిస్తున్నారని, అత్యంత శక్తిమంతమైన యాసిన్ 105 కవచ విధ్వంసక రాకెట్ల అభివృద్ధి, ఉత్పత్తి కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించేందుకు సిద్ధమవుతున్నారని సమాచారం అందడంతో ఇజ్రాయెల్ సైనిక దళాలు పక్కా సమాచారంతో మాటువేసి అల్ హద్దాద్‌ను హతమార్చింది.

# కాంగో, ఉగాండాలలో ఎబోలా: 80 మంది మృతి

## ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తం

**కిన్షాసా:** ఆఫ్రికాదేశం డి.ఆర్.కాంగో, ఉగాండా దేశాలలో మరోసారి ఎబోలా మహమ్మారి వైరస్ (ఎవిడి) విజృంభించింది. దీంతో ఈ రెండు దేశాలలో వారం రోజులుగా దాదాపు 80 మంది మరణించారు. అనేకమంది ఈ వ్యాధిబారిన పడ్డారు. ఒక్క డి.ఆర్.కాంగోలోనే 65 మంది పైగా మరణించారు. కాంగో నుండి ఈ వ్యాధి ఉగాండాకు వ్యాపించింది. ఉగాండాను వారం రోజులుగా ఎబోలా విస్తరించడంతో అనేకమంది ప్రజలు మృత్యువాత పడుతున్నారు. దీంతో ఉగాండా, డి.ఆర్.కాంగోలలో భయాందోళన చెలరేగింది. గతంలో 2017లో ఇదేవిధంగా లైబీరియా, సియర్రా లియోన్,గుయానా దేశాలలో ఎబోలా విజృంభించింది. ఈ పరిస్థితిని అదుపు చేసేందుకు, ప్రజలకు తక్షణం వైద్య సహాయం అందజేసేందుకు వీలుగా ప్రపంచ ఆరోగ్య సంస్థ విరాళాలు పోగుజేసింది. ప్రపంచ ఆరోగ్యసంస్థ అప్రమత్తమైంది. ఉగాండాలో ప్రజలు విపరీతమైన తలనొప్పి, జ్వరం,వాంతులు,విరోచనాలు,కండరాల నొప్పి, గొంతునొప్పి వంటి లక్షణాలతో మృత్యువాత పడుతున్నారు. ముఖ్యంగా ఈ ఎబోలా వైరస్ వల్ల విపరీతమైన జ్వరం వస్తుంది. శరీరంలోని రక్త ప్రసరణ వ్యవస్థపై ఈ వైరస్ ఒక పద్ధతి ప్రకారం దాడిచేసిన మనిషిని మృత్యువువైపు నెట్టేస్తుంది. తమ కుటుంబాలలో కుర్రాళ్ళు,పిల్లలు విపరీతమైన జ్వరం వచ్చి కుప్పకూలిపోతున్నారని సాధారణ ప్రజలు స్థానిక మీడియాకు ఇంటర్వ్యూలలో చెప్పారు. మే నెలలోనే ఈ వ్యాధి మళ్ళీ ప్రబలింది. డి.ఆర్.కాంగోలో 246 ఎబోలా కేసులు నమోదైనట్లు అధికారులు చెప్పారు. ఈ వ్యాధి సోకిన తర్వాత మూడువారాలలో వ్యాధి శరీరంలో స్థావరాన్ని బలపరచుకుని తన లక్షణాలు బయటపెడుతుంది. 1976 నుండి తూర్పు, పశ్చిమ, దక్షిణ, సెంట్రల్ ఆఫ్రికా ప్రాంతాలలో ఈ వ్యాధి ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. శరీరం తట్టుకుంటే 14 రోజుల తర్వాత తిరిగి శక్తి పుంజుకుంటారు. లేందంటే 16 రోజు తర్వాత నుండి మృత్యువు కబళిస్తుంది.

# సమర్థనీయం కాదు

(మొదటి పేజీ తరువాయి)

ధరలు పెరిగి సామాన్యుల పాలిట శాపంగా మారనుందన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వ అసమర్థ పరిపాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సిఎం విమర్శించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ఒక ట్విట్ చేశారు. ఆత్మ నిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప ఫలితాలు తెచ్చిన పాలసీ కాదని తేలిపోయిందని సిఎం తెలిపారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతినడం, యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందన్నారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిపోయిందని, గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తూ ఇప్పుడు ఆ పతనం పరాకాష్టకు చేరిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమేనని విమర్శించారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న ప్రధాని మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని సిఎం ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచబోమని పదే పదే ప్రకటించిన ప్రధాని మోదీ ప్రభుత్వం ఫలితాలు వెలువడి 10 రోజులు కూడా గడవకముందే పెట్రోల్ ఉత్పత్తులపై రూ.3 లకు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమేనన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతూ విశ్వాస ఘాతుకానికి పాల్పడుతున్నారని ప్రజలు భావిస్తున్నారని సిఎం తన ట్విట్‌లో పేర్కొన్నారు.

# ప్రాథమిక హక్కు

(మొదటి పేజీ తరువాయి)

'వైద్య సేవల ఆధునీకరణ ప్రజలందరికి సమాన వైద్యసేవలు' అనే శ్రీనాథ్ రెడ్డి కీలకోపన్యాసం చేస్తూ వైద్య, విద్య రంగాలకు ప్రభుత్వం అత్యుత్తమ ప్రాధాన్యతను ఇవ్వాల్సి ఉండగా, ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. దేశంలో ఇప్పటికీ 30.40 కోట్ల మందికి కూడా కనీస వైద్య సేవలు అందని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. అధునిక ప్రపంచీకరణతో యుద్ధాలు, హింస, సామాజిక అసమానతల ప్రభావం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 58 దేశాల్లో 100 మిలియన్లకు మించిన ల్యాండ్ మైన్లు పాతిపెట్టబడి ఉండగా, కేవలం 9 దేశాల వద్ద వందల సంఖ్యలో అణు అయుధాలను కలిగి ఉన్నాయని, ఇది ప్రపంచ శాంతికి, మానవ మనుగడ తీవ్ర విఘాతమన్నారు. ముఖ్యఅతిథి రమాదేవి మాట్లాడుతూ వైద్యం అందించడం సేవ మాత్రమే కాదని, అది సామాజిక బాధ్యత అని అన్నారు. వైద్యులు రోగులను తమ కుటుంబ సభ్యులనే భావనతో వైద్యం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఐడిపిడి సీనియర్ సలహాదారు అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ దేశంలో 145 కోట్లమంది ఉంటే ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 100 కోట్లు, పట్టణ ప్రాంతాల్లో 47 కోట్ల మంది జీవిస్తున్నారని, ఇందులో ప్రభుత్వ పరంగా 6 నుంచి 7 కోట్ల మందికి మాత్రమే వైద్య సేవలను అందుకుంటున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతంలోని దాదాపు 70 కోట్ల మంది కనీస వైద్య సేవలకు కూడా నోచుకోవడంలేదని ఆమె పేర్కొన్నారు. ప్రతి రోజూ దేశంలో చనిపోతున్న 5 ఏళ్ల లోపు చిన్నారులలో దాదాపు 50 శాతం మంది పిల్లలు పోషకాహారం లోపం కారణంగా చనిపోవడం అత్యంత బాధాకమన్నారు. అయిన ప్రభుత్వాలకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. మాజీ ఎంపి అజీజ్‌పాషా మాట్లాడుతూ ప్రజా అరోగ్యానికి సంబంధించి చట్టసభల్లో కనీసం చర్చించకపోవడం దుర్మార్గమన్నారు. సిపిఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యమైన వైద్య, విద్య రంగాలను ప్రభుత్వాలు విస్మరించడం వల్లే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని అన్నారు. ఐఎంఎ బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కృష్ణా రెడ్డి, ఐడిపిడి సీనియర్ సలహాదారు డాక్టర్ కె.రజని, సదస్సు కోఆర్డినేటర్స్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ రామకిషన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.భరత్, ఉపాధ్యక్షులు డాక్టర్ జె.మాదవి, డాక్టర్ ఆరీఫ్ అహ్మద్, కార్యదర్శి ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ బూరి రంగా రెడ్డి, కోశాధికారి డాక్టర్ సిహెచ్.ప్రభావతిలు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి కేటాయించాల్సిన నిధులు ఆయుధాలు, యుద్ధ ఖర్చుల వైపు మళ్లడం ప్రమాదకరమని అన్నారు. శాంతి, నిరాయుధీకరణ, సామాజిక న్యాయం ద్వారా మాత్రమే వైద్య సేవల సమానత్వం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సదస్సులో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ తదితరులు పాల్గొన్నారు.

# జోర్డాన్ కమ్యూనిస్టు నాయకుల తక్షణ విడుదలకు సిపిఐ డిమాండ్



**న్యూఢిల్లీ:** జోర్డాన్ ప్రభుత్వం అరెస్టు చేసిన ఇద్దరు కమ్యూనిస్టు నాయకులను తక్షణం విడుదల చేయాలని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) డిమాండ్ చేసింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం శనివారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. కమ్యూనిస్టు నాయకుడు, జోర్డాన్ పొలిటికల్ బ్యూరో సభ్యుడు డాక్టర్ ఒమర్ ఎమిలే అవద్,జోర్డాన్ కమ్యూనిస్టుపార్టీ యువజన నాయకుడు బహా అలయన్ (బహా హాషిమ్ అహ్మద్)లను 65 రోజులుగా నిర్బంధించి ఉంచడాన్ని ఖండించింది. రెండు నెలలు దాటిపోయినాగానీ కమ్యూనిస్టునాయకులను విడుదల చేయకుండా ఏకపక్షంగా నిర్బంధంలో ఉంచారు. వారికి ఎలాంటి న్యాయపరమైన సహాయం అందించడంలేదు. నిర్దేశిత న్యాయ ప్రక్రియలో భాగంగా విడుదల చర్యలను ముందుకు తీసుకువెళ్లడంలేదు. చాలా స్పష్టంగా చెప్పాలంటే జోర్డాన్‌లో దేశభక్తియుత వామపక్షాల గొంతు నొక్కేందుకు, పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిస్తూ చురుకైన ప్రచారం నిర్వహిస్తున్నందుకు వారిని కారాగారంలోకి నెట్టా రు. కమ్యూనిస్టులు, ఇతర ప్రగతిశీలక శక్తులను అదేపనిగా అణచివేతకు గురిచేస్తున్నారు. వారికున్న ప్రజాస్వామ్య హక్కులపై తీవ్రమైన దాడి చేస్తున్నారు, రాజకీయ భావాలను వ్యక్తం చేసేందుకు స్వేచ్ఛ ఇవ్వడంలేదు. ప్రజల న్యాయబద్ధమైన పోరాటాలకు,శాంతికి,జాతీయ సార్వభౌమత్వానికి ముడిపడిన రాజకీయ భావాలను స్వేచ్ఛ గా వ్యక్తం చేయనివ్వడంలేదు. డాక్టర్ ఒమర్ ఎమిలే అవద్, బహా అలయన్‌లను వెంటనే విడుదల చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తోంది, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య, ప్రగతిశీల శక్తులు గొంతెత్తి ఈ అణచివేత చర్యలను తీవ్రంగా వ్యతిరేకించాలని అని పార్టీ జాతీయ కార్యదర్శివర్గం తన ప్రకటనలో పేర్కొంది. కాగా, ఈ అరెస్టులు చట్టవిరుద్ధం, ఏకపక్షమైనవని అనేకసార్లు జోర్డాన్ కమ్యూనిస్టు పార్టీ ఖండించింది. ఈ అరెస్టులకు చట్టపరమైన సమర్థింపు లేదని పేర్కొంది. నిర్బంధం లో ఉన్న సహచరులకు అంతర్జాతీయస్థాయిలో సంఘీభావం రోజు రోజుకూ పెరుగుతోందని, గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ, బ్రిటన్ కమ్యూనిస్టుపార్టీ, అమెరికా కమ్యూనిస్టుపార్టీ సహా ప్రపంచవ్యాప్తంగా పార్టీలు సంఘీభావం ప్రకటిస్తున్నాయని జోర్డాన్ కమ్యూనిస్టుపార్టీ ప్రకటించింది.

# పసిబిడ్డలు భారమా?

(మొదటి పేజీ తరువాయి)

గత నాలుగేళ్లలో ఏకంగా 31 మంది పసి పిల్లల విక్రయాలు, మెదక్, సిద్దిపేట జిల్లాలో జరిగినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. వారి వివరాల ప్రకారం 2025 సంవత్సరంలో జిల్లాలో మెదక్ మండలం 01, కొల్చారం 02, నర్సాపూర్ 04, హవెలి ఘనపూర్ 01, నిజాంపేట్ 01, శంకరంపేట (ఆర్) 01 మండలాల్లో మొత్తం 10 మంది శిశువులను విక్రయించారు. అందులో ఏడుగురు అడశిశువులు, ముగ్గురు మగ శిశువులు ఉన్నారు. ముగ్గురు తల్లిదండ్రుల పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2026 సంవత్సనం జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలోని హవేలి ఘనపూర్, చేగుంట, నార్సింగ్, మెదక్, కొల్చారం మండలాల్లో మొత్తం 07 మంది శిశువులను విక్రయించారు. అందులో ఆరుగురు ఆడశిశువులు, ఒక్క మగ శిశువు ఉన్నారు. ముగ్గురు పిల్లలను సిద్దిపేట జిల్లాలో విక్రయించారు. ముగ్గురు పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. 2024 సంవత్సరంలో 11 మంది పసి పిల్లలను అమ్మేశారు. అందులో తొమ్మిది మంది ఆడ శిశువులు కాగా ఇద్దరు మగ బిడ్డలు ఉన్నా రు. ఒక్కరిపై మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదయినట్లు చెప్పారు. 2023 సంవత్సరంలో మూడు శిశు విక్రయాలు జరుగగా ఇద్దరు ఆడ శిశువులు, ఒక్క మగ బిడ్డ ఉన్నారు. ఆ సంవత్సరం ఒక్క పోలీస్ కేసు నమోదు కాకపోవడం ఆశ్చర్యకర విషయం. ఈ విక్రయాలు బయటకు వచ్చినవే అయితే వెలుగులోకి రాని ఘటనలు ఇంకెన్ని ఉన్నాయో అన్న ప్రశ్న భయాందోళనకు గురిచేస్తోంది.

**బిడ్డలను అమ్ముకునే వస్తువుల్లా చూస్తున్నారా..?**

నవ మాసాలు మోసి బిడ్డలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు పసికందులను అమ్మే వస్తువుల్లా చూస్తున్నారా..? అంటే ఇలాంటి సందర్భాల్లో అవుననే సమాధానం వస్తుంది. పేదరికం, మద్యానికి బానిసలు కావడం, కుటుంబ కలహాలు, అవాంఛిత గర్భధారణలు, సామాజిక ఒత్తిళ్లు, అవగాహణ లోపం.. ఇవన్నీ కారణాలుగా కనిపిస్తున్నాయి. శిశు విక్రయాలను ప్రోత్సహించే రహస్యముఠాల పాత్ర పై కూడా తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, దళారు లు, అక్రమ దత్తత మాఫియా కలిసిపోతున్నారనే ఆరోపణలు అనేకంగా వినిపిస్తున్నాయి. శిశువులను అమ్మడం, కొనుగోలు చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరం. అయినప్పటికి డబ్బు ఆశతో కొందరు తల్లిదండ్రులు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. అధికారులు కేసులు నమోదు చేస్తున్నా.. ఘటనలు పునరావృతం కావడం ఆందోళన కలిగిస్తోంది.

**ఆర్థిక పరిస్థితి, అవగాహన లేమితోటే విక్రయాలు**

''చాలా కుటుంబాలకు చట్టబద్ధ దత్తత విధానం గురించి అవగాహన లేకపోవడం, ఆర్థిక పరిస్థితి పెద్ద సమస్యగా మారింది. బిడ్డను పెంచలేమనే పరిస్థితుల్లో కొందరు దళారుల మాటలు నమ్మి బిడ్డలను అమ్ముకునేందుకు అక్రమ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. గ్రామ స్థాయి నుంచి మహిళా సంఘాలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, పోలీస్ శాఖ తో కలిసి విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టి ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం'' అని మెదక్ జిల్లా డిడబ్ల్యూఓ, హేమ భార్గవి తెలిపారు.

# తెలంగాణలో సర్

(మొదటి పేజీ తరువాయి)

లేదా లింకింగ్ సమస్యలు ఉన్నవారికి ఎన్నికల నమోదు అధికారులు (ఈఆర్‌ఓలు) ప్రత్యేక నోటీసులు జారీ చేస్తారని తెలిపారు. పుట్టిన తేదీ, జన్మస్థలం ఆధారంగా పత్రాల సమర్పణకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తామని చెప్పారు. 1987 జూలై 1కు ముందు జన్మించిన వారు తమ పుట్టిన తేదీ, స్థల ధృవీకరణ పత్రం సమర్పిస్తే సరిపోతుందని, 1987 నుంచి 2004 మధ్య జన్మించిన వారు తల్లిదండ్రులలో ఒకరి వివరాలు కూడా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రులిద్దరి ధృవీకరణ పత్రాలు తప్పనిసరి అన్నారు. ఇందుకోసం జనన సర్టిఫికెట్, పాస్‌పోర్ట్, విద్యా ధృవీకరణ పత్రాలు, ఆధార్ తదితర పత్రాలను సమర్పించాల్సి ఉంటుందన్నారు.

**3.39 కోట్లకు పైగా ప్రస్తుత ఓటర్లు**

రాష్ట్రంలో ప్రస్తుతం 119 అసెంబ్లీ నియోజకవర్గాలు, 35,985 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. మొత్తం ఓటర్ల సంఖ్య 3.39 కోట్లకు పైగా ఉండగా, అందులో 1.68 కోట్ల మంది పురుషులు, 1.71 కోట్ల మంది మహిళలు, 2,879 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నట్లు చెప్పారు. 1819 ఏళ్ల మధ్య వయస్సు గల యువ ఓటర్లు 8.18 లక్షల మంది ఉన్నారన్నారు. ఇప్పటివరకు 64.38 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయినట్లు తెలిపారు. ఈ భారీ సర్వే కోసం 33 మంది డిఇఓలు, 119మంది ఈఆర్‌ఓలు, 867 మంది ఎఆర్‌ఓలు, 3,596 మంది బిఎల్‌ఓ సూపర్‌వైజర్లు, 35,985 మంది బిఎల్‌ఓలు పనిచేస్తున్నారన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను రాజకీయ పార్టీలకు అందజేయడంతో పాటు వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలో తమ పేర్లను సరిచూసుకుని అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. అనర్హులను తొలగించి, పారదర్శక ఓటరు జాబితా రూపొందించడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశం అని సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు సిఈఓ డాక్టర్ వాసం వెంకశ్వర్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ధరలు సవరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రామాణికంగా తీసుకుని ధరలు పెంచుతారు. కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కనీస రూ.15 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందన్నారు. ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమణ్యం కమిటీ నివేదిక ఆధారంగా, శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి ఈ సవరణలు చేస్తున్నామన్నారు. సాధారణంగా 5 శాతానికి పైగా ధరలు పెరగనుండగా, కొన్ని చోట్ల తగ్గే అవకాశం కూడా ఉందన్నారు. 2022 ఫిబ్రవరి తర్వాత ఇప్పటివరకు మార్కెట్ విలువలను సవరించలేదన్నారు. ప్రభుత్వ స్థలాలను ఇకపై లీజుకు ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు.

**ధరణి తప్పిదాల్లో బాధ్యులపై త్వరలో చర్యలు**

ధరణి పోర్టల్ ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తయిందని, ఇందులో పలువురు అధికారుల తప్పిదాలు ఉన్నట్లు తేలిందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. త్వరలోనే బాధ్యుల పై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జూన్ నుంచి రాష్ట్రవ్యాప్తంగా భూముల సమగ్ర సర్వే ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు. గత 25 రోజులుగా ఉమ్మడి జిల్లాల పరిధిలో రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ అంశాలపై విస్తృతంగా సమీక్షలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. రెవెన్యూ శాఖలో ప్రధానంగా మూడు రకాల సమస్యలను గుర్తించామన్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న రెవెన్యూ, అటవీ సరిహద్దు వివాదాల పరిష్కారానికి 'రోవర్'ల సాయంతో జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వర్ సమస్యలు నివారించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్ అభివృద్ధికి రూ.14.08 కోట్లతో టెండర్ ఖరారు చేశామని, మరో 4 నెలల్లో ఈ సమస్య పూర్తిగా తీరిపోతుందన్నారు. పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో వచ్చిన దరఖాస్తుల్లో 52 శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసమే ఉన్నాయన్నారు. ధరణి సమస్యలు, ఆసరా పెన్షన్లు, గృహలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డుల్లో పేర్ల చేర్పు వంటి అంశాలపై ప్రజలు ఎక్కువగా వినతులు సమర్పించారని చెప్పారు.

**కేంద్ర నిధుల కోసం ఎదుచూస్తున్నాం**

రాష్ట్రంలో తొలి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు సుమారు 1.32 లక్షల ఇళ్ల స్లాబ్ పనులు పూర్తయ్యాయని, మరో 68 నుంచి 72 వేల ఇళ్ల నిర్మాణం జూన్ నెలాఖరులోగా స్లాబ్ దశకు చేరుకుంటుందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని జూన్ 2న ఆదిలాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. రెండో విడతలో గోడలు, బేస్‌మెంట్, స్లాబ్ వరకు నిర్మాణం జరిగిన ఇళ్లకూ పథకం వర్తింపజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం మార్చి నుంచి ఎదురుచూస్తున్నామని, ఒక్కో ఇంటికి కేంద్ర వాటాగా రూ. 1.13 లక్షలు రావాల్సి ఉందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేంద్ర నిధులు విడుదల అవుతాయన్న ఆశతో లబ్ధిదారుల ఫైనల్ బిల్లులను తాత్కాలికంగా నిలిపివేశామని, మరో 1520 రోజుల్లో నిధులు రాకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని భరిస్తుందని స్పష్టం చేశారు.

**16 వేలమంది లబ్దిదారులు ఇళ్లలో ఉండటం లేదు**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గత ప్రభుత్వం ఎంపిక చేసిన 38 వేల మంది లబ్ధిదారుల్లో సుమారు 16 వేల మంది అసలు అక్కడ నివసించడం లేదని సర్వేలో తేలిందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పేదలకు వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిహెచ్‌ఎంసి పరిధిలోని మూడు కార్పొరేషన్‌లలో పేదలకు గృహ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. అర్బన్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సంబంధిత ప్రాంతానికి 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అర్హులకు పంపిణి చేస్తామన్నారు. కొన్ని టవర్లలో కమర్షియల్ షాపులను లీజుకు ఇవ్వకుండా బహిరంగ వేలంలో విక్రయించి, ఆ మొత్తాన్ని నిర్వహణ కోసం వినియోగించే విధంగా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.

# అలెన్, రఘువంశీ విధ్వంసం

## గుజరాత్‌పై విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో కోల్‌కత్తా..!

పంతొమ్మిదో సీజన్‌లో ప్లే ఆఫ్స్ పోరులో కోలకత్తా నైట్ రైడర్స్(కెకెఆర్) నిలిచింది. గెలిచి తీరాల్సిన మ్యాచ్‌లో టాపర్ గుజరాత్ టైటాన్స్(గుజరాత్ టైటాన్స్)కు షాకిస్తూ కీలకమైన రెండు పాయింట్లు సాధించింది. శనివారం ఈడెన్ గార్డెన్స్‌లో ఫిన్ అలెన్(93), రఘువంశీ(82 నాటౌట్)లు తుఫాన్ ఇన్నింగ్స్‌తో 247 రన్స్ కొట్టిన కోల్‌కతా.. ఆపై ప్రత్యర్థిని కట్టడి చేసింది. శుభ్మన్ గిల్(85), బట్లర్(57) అర్ధశతకాలతో పోరాడినా సరిపోలేదు. ఈ విజయంతో రహానే బృందం ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. ఐపీఎల్ 19లో ప్లే ఆఫ్స్ రేసు రోజురోజుకు ఆసక్తికరంగా సాగుతోంది. ఇక కష్టమే అనుకున్న జట్లు సంచలన విజయాలతో ముందున్న జట్లకు షాకిస్తున్నాయి. మొన్న ముంబై ఇండియన్స్, నిన్న లక్నో సూపర్ జెయింట్స్ .. ఈరోజు కోల్కతా నైట్ రైడర్స్ సూపర్ విక్టరీతో నాకౌట్ పోరును ఉత్కంఠగా మార్చేశాయి. తొలుత గుజరాత్ బౌలర్ల భరతం పడుతూ ఓపెనర్ ఫిన్ అలెన్(93), రఘువంశీ(82 నాటౌట్)లు భారీ స్కోరందించగా.. అనంతరం బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు.



**భారీ ఛేదనలో గుజరాత్ టైటాన్స్ ఓపెనర్‌లు** సాయి సుదర్శన్(23) శుభ్మన్ గిల్(85) దూకుడుగా ఆడారు. కానీ, బంతి చేతికి తగిలి రిటైర్డ్ హర్ట్గా వెనుదిరిగాడు. నిశాంత్ సింధు(1)ను నరైన్ ఔట్ చేశాడు. జోస్ బట్లర్(57) గిల్ గెలుపు బాధ్యత తీసుకున్నారు. బౌండరీలతో చెలరేగిన కెప్టెన్ 33 బంతుల్లో అర్ధ శతకం అందుకోగా.. బట్లర్ సైతం బాదేశాడు. శతక భాగస్వామ్యం నెలకొల్పిన ఈ ద్వయాన్ని నరైన్ విడదీశాడు. అప్పటికీ గుజరాత్ విజయానికి 22 బంతుల్లో 71 పరుగులు కావాలి. తిరిగి బ్యాటింగ్కు వచ్చిన సుదర్శన్, బట్లర్తో కలిసి ప్రయత్నించినా గుజరాత్‌ను గెలిపించలేకపోయాడు. చివరి ఓవర్‌లో 40 రన్స్ అవసరమవ్వగా.. గుజరాత్ 218కే పరిమితమైంది.

# సంచలన విజయంతో ఫైనల్లో సాత్విక్ చిరాగ్..

## భారత్‌కు పతకం ఖరారు..!

థాయ్లాండ్ ఓపెన్‌లో భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆరంభం నుంచి అదరగొడుతున్న ఈ జోడీ సంచలన విజయంతో ఫైనల్కు దూసుకెళ్లింది. శనివారం సెమీఫైనల్లో అద్భుత ఆటతో మలేషియా జంటపై చెక్ పెట్టిన సాత్విక్ చిరాగ్ జోడీ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఈ సీజన్లో వీరికి ఇదే మొదటి ఫైనల్ కావడం విశేషం. ఫేవరెట్లు పీవీ సింధు, లక్ష్య సేన్ నిష్క్రమించినా భారత్కు పతకం ఖాయం చేసిందీ జోడీ. భారత స్టార్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్ చిరాగ్ శెట్టి మరో టైటిల్కు చేరువైంది. థాయ్లాండ్ ఓపెన్



సెమీఫైనల్లో తొలిసెట్ కోల్పోయినా.. సంచలన ఆటతో ఫైనల్ బెర్తు దక్కించుకుంది. మలేషియా షట్లర్లు గోహ్ జే ఫేయ్, నుర్ ఇజుదీన్ 2119తో తొలి సెట్లో ఆధిక్యం చెలాయించినా భారత జంట కుంగిపోలేదు. రెండో సెట్లో గొప్పగా పుంజుకున్న సాత్విక్ చిరాగ్ ద్వయం 2220తో ప్రత్యర్థికి షాకిచ్చింది.అదే ఊపులో నిర్ణయాత్మక మూడో సెట్ను 2116తో కైవసం చేసుకొని ఫైనల్కు దూసుకెళ్లింది. థాయ్లాండ్ ఓపెన్లో వీరికి ఇది మూడో టైటిల్ పోరు. గతంలో 2019, 2024లో ఫైనల్ ఆడారు. తుది పోరులో లియో రాలీ డానియల్ మార్టిన్(ఇండోనేషియా) లేదా హి జి టింగ్ రెన్ గ్జియాంగ్ యూ(చైనా) జంటను సాత్విక్ చిరాగ్ ద్వయం ఢీకొట్టనుంది. మహిళల సింగిల్స్లో పీవీ సింధు , పురుషుల సింగిల్స్ నుంచి లక్ష్య సేన్, కిదాంబి శ్రీకాంత్ నిష్క్రమించిన విషయం తెలిసిందేతెలిసిందే.

# బిజినెస్

## టోకు ద్రవ్యోల్బణం మరింత పెరగొచ్చు



టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) ద్రవ్యోల్బణంపై ఆందోళనకర అంచనాలు వెలువడుతున్నాయి. అమెరికా– ఇరాన్ సైనిక ఘర్షణతో చ మురు, లోహాల ధరలు పెరుగుతున్నందున రా నున్న నెలల్లో భారత్‌లో డబ్ల్యుపిఐ ద్రవ్యోల్బణం మరింత పెరగొచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక పరిశోధనా విభాగం అంచనా వేసింది. వీలైనంత త్వరగా అమెరికా – ఇరాన్ మధ్య శాంతి ఒప్ప ఒదం కుదరకపోతే, మనదేశంలో ఇంధన ద్రవ్యోల్బణం అధిక స్థాయిలకు చేరుకునే ముప్పు ఉం దని ఈ పరిశోధనా నివేదిక హెచ్చరించింది. ఇక ఇదే సమయంలో రూపాయి విలువ క్షీణిస్తుండ టం అనేది భారతదేశ దిగుమతి ఖర్చులను పెంచుతుందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతానికి కొంతమేర ఊరటనిచ్చే రేంజులోనే ఆహార ద్రవ్యోల్బణం ఉన్నప్పటికీ, ఒకవేళ రుతుపవనాల పురోగతి సరిగ్గా లేకుంటే అది కొద్దిగా పెరగొచ్చని తెలిపింది.

**టోకు ధరల ద్రవ్యోల్బణం : 3.9 శాతం నుంచి 8.3 శాతానికి**

బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థిక పరిశోధనా విభాగం విడుదల చేసిన అధ్యయన నివేదికలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. దీని ప్రకారం, టోకు ధరల ద్రవ్యోల్బణం 2026 ఏప్రిల్‌లో వేగంగా 8.3 శాతానికి పెరిగింది. ఇది 43 నెలల గరిష్ఠ స్థాయి. ఓ వైపు ఆహార ద్రవ్యోల్బణం కంట్రోల్ లోనే ఉన్నప్పటికీ, మరోవైపు కేవలం ఇంధనం, తయారీరంగ వస్తువుల ధరలు పెరిగిన ఎఫెక్ట్‌తో టోకు ధరల ద్రవ్యోల్బణం ఇంతగా పెరిగిపోయింది. 2022 అక్టోబరు తర్వాత ఇది ఇంతటి స్థాయికి పెరగడం ఇదే తొలిసారి. టోకు ధరల ద్రవ్యోల్బణం 2026 **మార్చిలో 3.9 శాతం, 2025 ఏప్రిల్‌లో 0.9 శాతం మాత్రమే ఉంది.**

42 నెలల గరిష్ఠ స్థాయికి ఇంధన ద్రవ్యోల్బణం ఇంధన, విద్యుత్ ద్రవ్యోల్బణం 2026 ఏప్రిల్ నాటికి 42 నెలల గరిష్ఠ స్థాయి అయిన 24.7 శాతానికి ఎగబాకింది. సరిగ్గా ఏడాది క్రితం (2025 ఏప్రిల్‌లో) ఇది 3.8 శాతంగానే ఉంది. ఇక 2026 మార్చిలో ఇంధన, విద్యుత్ ద్రవ్యోల్బణం 1.1 శాతమే. పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ వంటగ్యాస్, కిరోసిన్, విమాన ఇంధనం, లూబ్రికెంట్స్, ఫర్నేస్ ఆయిల్స్ అనేవి మినరల్ ఆయిల్స్. మినరల్ ఆయిల్ సూచీ అనేది టోకు ధరల సూచీలోని ఒక భాగం. 2025 ఏప్రిల్‌లో మినరల్ ఆయిల్ సూచీ 5.6 శాతం తగ్గింది. కానీ ఈ ఏడాది ఏప్రిల్‌లో అది 39.5 శాతం పెరిగింది. ఈ కారణం వల్లే ఇంధన, విద్యుత్ ద్రవ్యోల్బణం అంతగా పెరిగిపోయింది. విమాన ఇంధనం ధరలు 2025 ఏప్రిల్‌తో పోలిస్తే, 2026 ఏప్రిల్‌లో 100 శాతానికిపైగా పెరిగాయి. నాఫ్తా, ఫర్నేస్ ఆయిల్, పెట్రోల్, కిరోసిన్, డీజిల్‌ల ధరలూ గణనీయంగా పెరిగాయి. ఇక ఇదే సమయంలో బొగ్గు ద్రవ్యోల్బణం కూడా 0.1 శాతం నుంచి 1.4 శాతానికి పెరిగింది. రూపాయి విలువ క్షీణించడం, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా ఇరాన్ సైనిక ఘర్షణ కారణంగా 2026 ఏప్రిల్‌లో అంతర్జాతీయ ముడి చమురు ధరలు గత ఏడాదితో పోలిస్తే 54.2 శాతం పెరిగాయి.

**22 ఉప సూచీలలో 13 వేగంగా పెరిగాయి**

తయారీ ఉత్పత్తుల విభాగంలో 22 ఉప సూచీలు ఉన్నాయి. అయితే వీటిలో 13 ఉప సూచీలు వేగంగా పెరిగాయి. ఈవిధంగా పెరిగిన ఉప సూచీల జాబితాలో ప్రాథమిక లోహాలు, యంత్రాలు పరి కరాలు, వస్త్రాలు, రసాయనాలు, ఔషధాలు, ఇతర తయారీ రంగాలు ముందు వరుసలో ఉన్నాయి. 2026 ఏప్రిల్‌ను 2025 ఏప్రిల్‌తో పోలిస్తే, అల్యూమినియం ధరలు 3.9 శాతం నుం చి 19.2 శాతానికి పెరిగాయి. కానీ రాగి ధరలు 15.3 శాతం వద్దే స్థిరంగా ఉంది. జింక్ ద్రవ్యోల్బణం స్వల్పంగా తగ్గి 6.3 శాతానికి చేరింది. సీసం ధరలు 1.1 శాతం మేర తగ్గాయి. ఇక అంతర్జాతీయ కమొడిటీ మార్కెట్లలో ఏడాది వ్యవధిలో అల్యూమినియం ధర 51.8 శాతం, రాగి ధర 41.1 శాతం పెరిగాయి.

**ఊరటనిచ్చిన ఆహార ద్రవ్యోల్బణం**

టోకు ధరల ద్రవ్యోల్బణానికి పూర్తి విరుద్ధంగా, ఆహార ద్రవ్యోల్బణం భారత్‌కు కొంత ఉపశమనాన్ని కలిగించింది. ఇది 2025 ఏప్రిల్‌లో 3.3 శాతం ఉండగా, 2026 ఏప్రిల్ నాటికి 2.3 శాతానికి తగ్గింది. తృణధాన్యాల ద్రవ్యోల్బణం బలహీనంగా ఉండటమే దీనికి ప్రధాన కారణం. ధాన్యాల ద్రవ్యోల్బణం 3.9 శాతం నుంచి 0.3 శాతానికి, పప్పుధాన్యాల ద్రవ్యోల్బణం 5.6 శాతం నుం చి 4 శాతానికి, గోధుమ ద్రవ్యోల్బణం 7.4 శాతం నుంచి 0.4 శాతానికి తగ్గడం అనే అంశాలు భారతీయులకు భారీ ఊరటనిచ్చాయి.

### పెరిగిన కూరగాయల ద్రవ్యోల్బణం

కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపల ద్రవ్యోల్బణం అధికంగా నమోదైంది. టమాటాలు, అల్లం, క్యాలీఫ్లవర్, క్యాబేజీల ధరలు పెరిగాయి. కూరగాయల ద్రవ్యోల్బణం గతేడాది (2025 ఏప్రిల్‌లో) మైనస్ 17.16 శాతం ఉండగా, 2026 ఏప్రిల్ నాటికి అది ప్లస్ 0.53 శాతానికి పెరిగింది. ఇక పాల ద్రవ్యోల్బణం 1.1 శాతం నుంచి 2.6 శాతానికి, గుడ్లు, మాంసం, చేపల ద్రవ్యోల్బణం 0.3 శాతం నుంచి 6.7 శాతానికి ఎగబాకాయి. మన దేశంలో ఆహార ధాన్యాల ద్రవ్యోల్బణం బలహీనంగానే ఉన్నప్పటికీ, అంతర్జాతీయ ధరల సీన్ మాత్రం మరోలా ఉంది. దీని ప్రకారం, 2026 ఏప్రిల్ నాటికి గోధుమ ధరలు గతేడాదితో పోలిస్తే 12.6 శాతం పెరిగాయి. బియ్యం ధరల తగ్గుదలలో వేగం 31 శాతం నుంచి 3.2 శాతానికి మందగించింది. ఈ వ్యత్యాసం రాబోయే నెలల్లో భారతదేశ ఆహార ధరలపై ప్రభావాన్ని చూపుతుందని బ్యాంక్ ఆఫ్ బరోడా పరిశోధనా నివేదిక హెచ్చరించింది.

### 4.6 శాతానికి పెరిగిన తయారీ రంగ ద్రవ్యోల్బణం

టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ)లోకి మొత్తం 697 వస్తువులు వస్తాయి. వాటిలో 564 వస్తువులు తయారీ ఉత్పత్తుల కేటగిరీలోనివే. తయారీ ఉత్పత్తుల కేటగిరీలోకి ఆహార ఉత్పత్తులు, టెక్స్‌టైల్స్, లోహాలు, రసాయనాలు, మందులు, యంత్రాలు, వాహనాలు, సిమెంట్, ఇటుకలు, ఎలక్ట్రానిక్ వస్తువుల వంటివి వస్తాయి. తయారీ ఉత్పత్తుల కేటగిరీకి సంబంధించిన ద్రవ్యోల్బణం 2026 ఏప్రిల్‌లో 4.6 శాతానికి పెరిగింది. ఈ ద్రవ్యోల్బణం 2022 సెప్టెంబర్ తర్వాత ఇంత పెద్ద రేంజుకు పెరగడం ఇదే తొలిసారి. ఇది 2026 మార్చిలో 3.4 శాతంగా, 2025 ఏప్రిల్‌లో 2.6 శాతంగా మాత్రమే నమోదైంది.

# ‘వృషకర్మ’ కీలక షెడ్యూలు పూర్తి



నాగ చైతన్య, మీనాక్షి చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం వృషకర్మ. కార్తిక్ దండు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం కీలక షెడ్యూలు పూర్తి చేసుకుంది. రాజస్తాన్ లోని పలు లొకేషన్‌లలో ఈ షెడ్యూల్ షూటింగ్ జరిగింది. దీంతో దాదాపుగా షూటింగ్ పూర్తి కావచ్చింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సీజీ వర్క్ ఎక్కువగా ఉంటుంది. అన్ని పనులు పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఎస్ విసిసి బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తోంది. నవీన్ నూళి ఎడిటర్ గా బివిఎస్ ఎన్ ప్రసాద్ నిర్మాత.


# కీలక సన్నివేశాల చిత్రీకరణలో ‘మహాకాళి’

‘మహాకాళి’లోకి రోహిత్ సరాఫ్ ఎంట్రీ ఇచ్చారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ, ఆర్‌కెడి స్టూడియోస్ కలిసి రూపొందిస్తున్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌తో అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా రోహిత్ సరాఫ్ హైదరాబాద్‌లో జరిగిన ఇంటెన్స్ షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశారు. రోహిత్ సరాఫ్ చేరికతో ఈ చిత్రానికి మరింత అప్పీల్ వచ్చింది. ముఖ్యంగా నార్త్ ఇండియాలో యువతలో అతనికి ఉన్న ఫాలోయింగ్ ‘మహాకాళి’ పాన్ ఇండియా రీచ్‌ను మరింత బలోపేతం చేయనుంది.ఈ చిత్రంలో అక్షయ్ ఖన్నా, భూమి శెట్టి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించాయి. పవర్ఫుల్, ఇంటెన్స్ లుక్‌తో నిమాపై క్యూరియాసిటీ పెరిగింది.హనుమాన్’ విజయానంతరం భారతీయ మూలాలతో కూడిన సినిమా యూనివర్స్ ని విస్తరించాలనే ప్రశాంత్ వర్మ విజన్‌లో భాగంగా ‘మహాకాళి’ రూపొందుతోంది. ఆర్కే దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్లు ఆర్‌కెడి స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పూజా కొల్లూరు దర్శకత్వం వహిస్తున్నారుమహాకాళి’ అత్యంత ఆసక్తికరమైన పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లోలో ఒకటిగా నిలుస్తోంది.



# రీల్

## జూన్‌లో రామ్ పోతినేని కొత్త సినిమా



రామ్ పోతినేని నటుడిగా తన వైవిధ్యాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చిన రామ్ ఇప్పుడు దర్శకుడిగా మారనున్నారు. ఈ చిత్రం స్టైలిష్ సైకాలజికల్ యాక్షన్ థ్రిలర్‌గా తెరకెక్కనుంది. రాపో సినిమాటిక్స్’ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. ఈ సినిమాలో రామ్ పోతినేని వీర’ పాత్రలో కనిపించనున్నారు. లెదర్ జాకెట్‌లో వెనుక నుంచి కనిపిస్తున్న రామ్ లుక్ డార్క్, ఇంటెన్స్, రగ్గడ్ వైబ్‌ను క్రియేట్ చేస్తోంది. అతని స్టైలిష్ కట్ హెయిస్టాల్ పాత్రలోని అగ్రెసివ్ యాటిట్యూడ్‌ను ప్రతిబింబిస్తోంది. దర్శకుడిగా రామ్ పోతినేని స్వయంగా రూపొందించిన కథతో తెరకెక్కుతున్న ఒక కొత్త తరహా అనుభూతిని ఇవ్వబోతోంది. ‘వీర’ పాత్రలో రామ్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని అవతార్లో కనిపించనుండగా, పోస్టర్ నుంచే ఆ ట్రాన్స్‌ఫార్మేషన్ స్పష్టంగా కనిపిస్తోంది ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుంది.

## రాజప్ప క్యారెక్టర్ జీవితంలో మరచిపోలేను

### నటుడు ప్రదీప్ కొట్టె



తిమ్మరాజుపల్లి టీవీ’ సినిమా ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా నటుడు ప్రదీప్ కొట్టె మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. మాది చిత్తూరు జిల్లా పళమనేరు. చెన్నైలో జాబ్ చేశాను. హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యాను. ఇక్కడకు వచ్చాక షార్ట్ ఫిలిమ్స్ అంటూ యాక్టింగ్ వైపు వచ్చాను. స్టూడియోలో బషీర్ మాస్టర్ నేతృత్వంలో నాటకాలు వేశాను. ఆ నాటకాల్ని మా డైరెక్టర్ వి.మునిరాజు చూశారు. నాకు రాజప్ప కారెక్టర్ అని చెప్పి ఆడిషన్ చేశారు. ఆ తరువాత కిరణ్ అబ్బవరం నిర్మాత అని తెలియగానే చాలా కాన్ఫిడెన్స్ వచ్చింది. ‘తిమ్మరాజు పల్లి టీవీ’ రాజప్ప పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. అందులో చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఈ పాత్రతో నాకు మంచి రెస్పాన్స్ దక్కింది. నాకు తొలి సినిమా, అవకాశం అంటే ఇదే అని చెప్పుకోవచ్చు.నేను యాక్టింగ్ సైడ్ ఉన్నానని మా ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. కాస్తో కూస్తో మా అక్కకి తెలుసంతే. మా అమ్మ నాన్నలకు చెప్పకుండా షూటింగ్‌కు వచ్చి ఒది మా అక్క. అలా మా పేరెంట్స్‌ని అలా చూడటం, వారు నన్ను అలా చూడటం అదొక మెమరబుల్ మూమెంట్. ఇంపార్టెంట్ ఉన్న పాత్రలే పోషించాలని వెయిట్ చేస్తున్నాను.

# ‘పెద్ది’లో రామ్ బుజ్జిగా దివ్యేందు

రామ్ చరణ్ నటిస్తున్న స్పోర్టర్స్ డ్రామా పెద్ది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో నిర్మాత వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై రూపొందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు శర్మ పోషిస్తున్న పవర్ఫుల్ పాత్ర 'రామ్ బుజ్జి'ని పరిచయం చేస్తూ వీడియో రిలీజ్ చేశారు. క్రికెట్ మైదానంలో రామ్ బుజ్జి ఎంట్రీ ఇచ్చిన తీరు, అతని బాడీ లాంగ్వేజ్, రగ్గడ్ యాటిట్యూడ్ పాత్రలోని ఇంటెన్సిటీని బలంగా చూపించాయి. దివ్యేందు శర్మ స్క్రీన్ ప్రెజెన్స్, బ్యాగ్రౌండ్ స్కోర్ కలిసి వీడియోకి మాస్ వైబ్ తీసుకొచ్చాయి. దీంతో ‘రామ్ బుజ్జి’ పాత్ర సినిమా కథలో ఎంత కీలకంగా ఉండబోతోందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మరింత పెరిగింది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతిబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఎడిటర్ నవీన్ నూలి ఎడిటింగ్ నిర్వహిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ‘పెద్ది’ జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## 'నేను రెడీ లో నర్గీస్' స్పెషల్ సాంగ్

హీరో హవీష్ ప్రస్తుతం త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో నటిస్తున్నాడు. సినిమా చూపిస్తా మామా, నేను లోకల్, ధమాకా, మజాకా వంటి మాస్ హిట్ చిత్రాలతో ఫేమస్ అయిన త్రినాథరావు నక్కిన 'నేను రెడీ'ని ఫుల్ కమర్షియల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిలా కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో కావ్య థాపర్ కథానాయికగా నటిస్తోంది. బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ నేను రెడీ చిత్రంతో తెలుగులోకి అడుగుపెడుతున్నట్లు నిర్మాతలు తెలిపారు. తన అద్భుతమైన గ్లామర్, ఆకట్టుకునే ప్రజెన్స్‌తో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన నర్గీస్, ఈ సినిమాలో ఒక ప్రత్యేక పాటలో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ పాట పోస్టర్‌లో నర్గీస్ ఫక్రీ మెరిసే వెండి రంగు దుస్తులలో, కొవ్వొత్తులతో వెలిగే ఒక అద్భుతమైన బ్యాక్‌డ్రాప్‌లో రొమాంటిక్ ఫోజ్‌లో కనిపించారు. సెట్‌లోని ఎరుపు, నీలం రంగు లైటింగ్, నీడలా కనిపించే డ్యాన్సర్స్ ఒక ఉత్సాహభరితమైన వాతావరణాన్ని సృష్టిస్తుంది. మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ నిజర్ షఫీ స్టైలిష్ విజువల్స్లో చిత్రాన్ని చిత్రీకరిస్తున్నారు. ప్రవీణ్ పూడి ఎడిటర్, కథ, స్క్రీన్ప్లేను విక్రాంత్ శ్రీనివాస్ రాశారు. ‘నేను రెడీ’ సినిమా రీరికార్డింగ్ పనులతో సహా షూటింగ్ ఇటీవల పూర్తయింది. ఈ చిత్రం జూన్ రెండో వారంలో విడుదలకు సిద్ధమవుతోంది.



## మహిళల ఆర్థిక స్వావలంబనకు..

# స్త్రీనిధి బలమైన వేదిక

### మంత్రి సీతక్క




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల అభివృద్ధే తెలంగాణ అభివృద్ధి అన్న నమ్మకంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రజా భవన్‌లో స్త్రీనిధి వార్షిక కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, స్త్రీనిధి ఎం.డి. విద్యాసాగర్ రెడ్డి, డిప్యూటీ ఎం.డి. శ్రీనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్త్రీనిధి ఉద్యోగులు స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ను ఏర్పాటు చేసుకోవడంపై మంత్రి సీతక్క అభినందనలు తెలిపారు. ఉద్యోగుల హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుంచుకుని లక్షలాది మహిళల ఆర్థిక సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. స్త్రీనిధి సంస్థ మహిళల ఆర్థిక సాధికారతకు బలమైన వేదికగా నిలుస్తోందన్నారు. 2011లో ప్రారంభమైన ఈ సంస్థ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మరింత బలోపేతం అవుతోందన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు, అధిక వడ్డీ వ్యాపారుల బారిన పడుతున్న మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే స్త్రీనిధి ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఇప్పటివరకు స్త్రీనిధి ద్వారా 32 లక్షల మందికి పైగా మహిళలకు రూ.24 వేల కోట్ల రుణాలు అందించడం గొప్ప విజయమని మంత్రి తెలిపారు. స్త్రీనిధి నిజమైన మహిళా బ్యాంక్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమేనని, ఆ దిశగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని తెలిపారు. స్త్రీనిధిపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో 16 మంది ఉద్యోగులను తొలగించారని, ప్రస్తుతం అదే వ్యక్తులు సంస్థ ప్రతిష్టను దెబ్బ తీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అలాంటి అసత్య ప్రచారాన్ని ఉద్యోగులంతా కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్త్రీనిధిలో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించలేదని, ఇప్పటికే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేశామని మంత్రి స్పష్టం చేశారు. స్త్రీనిధి సంస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్త్రీనిధి అభివృద్ధికి విశేష కృషి చేసిన ఎండీ విద్యాసాగర్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో పదవీవిరమణ చేయనున్న ఆయనను మంత్రి సీతక్క, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

## సిపిఐ శాసనసభాపక్ష కార్యాలయం కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసమూర్తి సతీమణి కనకదుర్గ మృతి





**ప్రజాపక్షం/హైదరాబాద్:** సిపిఐ శాసనసభాపక్ష కార్యాలయ కార్యదర్శి ఏటుకూరి శ్రీనివాసమూర్తి సతీమణి కనకదుర్గ (63) మరణించారు. గత కొంత కాలంగా ఆనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కనకదుర్గ హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం తుది శ్వాస విడిచారు. కనుక దుర్గ భౌతికకాయాన్ని పార్టీ, ప్రజా సంఘాల నాయకులు బంధుమిత్రుల సందర్శనార్థం సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఉంచారు. అక్కడ కనుకదుర్గ భౌతికకాయాన్ని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్.కె.నారాయణ, జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకట రెడ్డి, సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, ఎం.బాలనరసింహ, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి, పలువురు సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల నేతలు సందర్శించి పుష్పగుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పంజాగుట్ట స్మశాన వాటికలో కనుకదుర్గ అంత్యక్రియలు నిర్వహించారు. భర్త శ్రీనివాసమూర్తి అంత్యక్రియలను పూర్తి చేశారు.

## రాష్ట్ర మహిళా కమిషన్‌కు టిజెఎస్ మహిళా విభాగం వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని తెలంగాణ జన సమితి (టిజెఎస్) మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు టిజెఎస్ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అరికిల్ల స్రవంతి, ముత్తు గీతాంజలి శనివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు.



### నీట్ పేపర్ లీకేజీపై

## 20న రౌండ్ టేబుల్ సమావేశం

### కెటిఆర్‌ను ఆహ్వానించిన వామపక్ష విద్యార్థి సంఘాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, కె.టి.రామారావు వామపక్ష విద్యార్థి సంఘాల ప్రతినిధులు హైదరాబాద్‌లోని నందినగర్ నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ తుంగ బాలు సమన్వయంతో జరిగిన ఈ భేటీలో దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నీట్ పేపర్ లీకేజీ అంశంపై ప్రధానంగా చర్చించారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న రౌండ్ టేండ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా కెటిఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేశారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని విద్యార్థి నేతలు తెలిపారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో వరుసగా పోటీ పరీక్షల పేపర్లు లీక్ అవుతున్నాయని ఆరోపించారు. వైద్యరంగ ప్రవేశ పరీక్షల్లో ఇలాంటి అక్రమాలు జరగడం సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు, తదుపరి కార్యాచరణ రూపొందించేందుకు లెఫ్ట్ విద్యార్థి సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఈ రౌండ్ టేండ్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కెటిఆర్‌ను కలిసిన వారిలో గ్యార నరేష్(ఎఐఎస్‌ఎఫ్), కిరణ్, అశోక్ రెడ్డి(ఎస్ఎఫ్ఐ), పొగిపొంగి నాగరాజు, పి.మహేశ్(పిడిఎస్‌యు), డాక్టర్ ఎస్.నాగేశ్వర్ రావు, ఎన్.సుమంత్(జిఆర్ పిడిఎస్‌యు), అల్లూరి విజయ్, అనిల్, శివ, పల్లె మురళి, నితీష్, తీగల శ్యామ్(పిడిఎస్‌యు విజృంభణ) ఉన్నారు.



## ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తం

### బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సమావేశమయ్యారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై పలు కీలక సూచనలు చేశారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు కుట్రపూరితంగా బిఆర్ఎస్ ఓటర్ల పేర్లు తొలగించకుండా క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు, డబుల్ ఓట్లు నమోదు కాకుండా కచ్చితమైన నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రతి బూత్ స్థాయిలో బూత్ లెవెల్ అసిస్టెంట్లు కీలక పాత్ర పోషించాలని, అర్హులైన ప్రజల ఓటు హక్కును కాపాడాలని తెలిపారు. కార్పొరేటర్ ఆశావాహులు ప్రజల్లో నిరంతరం ఉండి కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జ్‌లు, కంటోన్మెంట్ బోర్డ్ సభ్యులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని ప్రధానికి కవిత లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు దర్యాప్తు పారదర్శకంగా జరగాలంటే ఆయన పదవిలో కొనసాగకూడదని లేఖలో పేర్కొన్నారు. పెట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి సంజయ్ కుమారుడిపై భారతీయ న్యాయ సంహిత, పోక్సో చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదైందని కవిత గుర్తుచేశారు. మైనర్ బాలికకు సంబంధించిన ఈ కేసులో రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వతంత్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందన్నారు. బండి సంజయ్ ప్రస్తుతం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా కొనసాగుతున్నందున దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, సాక్షుల రక్షణపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. బాధితురాలికి పూర్తి న్యాయం జరగాలంటే, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజల్లో నమ్మకం నిలవాలంటే విచారణలో రాజకీయ జోక్యం ఉండకూడదని కవిత అభిప్రాయపడ్డారు. కేసు విచారణ పూర్తయ్యే వరకు బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని ప్రధాని మోదీని కోరారు.

## ఘనంగా నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్-2025



**ప్రజాపక్షం/హైదరాబాద్:** యువ జర్నలిస్టులు నిబద్ధతతో, సామాజిక బాధ్యతతో పనిచేయాలని కేంద్ర విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి, సీనియర్ దౌత్యవేత్త డాక్టర్ ఆసఫ్ సయీద్ సూచించారు. 'నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్–2025' ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నసీమ్ ఆరిఫీ జీవిత విశేషాలపై తెలంగాణ మీడియా అకాడమీ ముద్రించిన మోనోగ్రాఫ్‌ను డాక్టర్ ఆసఫ్ సయీద్ ఆవిష్కరించారు. సిఇటిఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ మీడియా అకాడమీ సహకారంతో జరిగిన ఈ వేడుకలో ఉర్దూ భాష, సాహిత్యం, జర్నలిజం రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులను సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆసఫ్ సయీద్ మాట్లాడుతూ నసీమ్ ఆరిఫీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మీడియా అకాడమీ ఏర్పాటుకు సంబంధించిన విషయాలను గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్టుల జీవిత చరిత్రలు, అనుభవాలను భవిష్యత్ తరాలకు అందించేందుకు ఇప్పటివరకు 12 మోనోగ్రాఫ్‌లు విడుదల చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిఇటిఐ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ బషారత్ అలీ, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం విభాగం డీన్ ప్రొఫెసర్ ఎహ్తేశామ్ అహ్మద్ ఖాన్ అవార్డుల ప్రాముఖ్యతపై ప్రసంగించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు అమీర్ ఉల్లా ఖాన్ కూడా ఉర్దూ మీడియా అభివృద్ధిపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఢిల్లీకి చెందిన మాసూమా మురాదాబాద్‌కు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. అలాగే యామీన్ అన్సారీ, హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్ అలీ మొహియుద్దీన్, ఎండి.ఫజల్ బేగ్, రోహిణి సింగ్‌లకు నసీమ్ ఆరిఫీ ఉర్దూ మీడియా అవార్డ్స్–2025 అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టు ఎం.ఎ.మజిద్‌తో పాటు పలువురు జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, సాహితీవేత్తలు, ఉర్దూ భాషాభిమానులు పాల్గొన్నారు.

## తైవాన్‌పై స్వరం మార్చిన ట్రంప్

### చైనాకు చాలా దగ్గర... మాకు చాలా దూరం



**వాషింగ్టన్:** తైవాన్ విషయంలో డోనాల్డ్ ట్రంప్ స్వరం మార్చారు. జిన్‌పింగ్‌తో సమావేశం తర్వాత ఆయన వైఖరిలో మార్పు వచ్చింది. తైవాన్ స్వాతంత్ర్యంకోసం అమెరికా పోరాటం చేయబోదని, తాము అండగా ఉన్నామనే ఉద్దేశంతో తైవాన్ విభిన్నంగా ప్రవర్తించకూడదని హెచ్చరించారు. చైనాకు తైవాన్ 59 మైళ్ళ దూరంలో ఉందని, కానీ అమెరికాకు తైవాన్ 9,500 మైళ్ళ దూరంలో ఉందని, అంతదూరం తాము ప్రయాణించాలనుకోవడంలేదని, కాబట్టి ఇది కొంచెం సంక్లిష్ట సమస్యేనని అన్నారు. మీకు తెలుసా, చైనా చాలా పెద్ద దేశం, సాపేక్షంగా తైవాన్ చాలా చిన్నదేశం అని ట్రంప్ చెప్పారు. దీంతో ఇటీవలికాలంలో ఇంత స్పష్టమైన వైఖరిని తైవాన్ విషయంలో వ్యక్తం చేసిన మొదటి అమెరికా నాయకుడుగా విశ్లేషకులు ప్రశంసలు కురిపించారు. తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేసేందుకు గత ఏడాది చివరిలో ఒక ప్యాకేజీని ప్రకటించిన ట్రంప్ ఇప్పుడు వెనుకడుగు వేశారు. ఇప్పుడు జిన్‌పింగ్ తొలుత ట్రంప్ పర్యటనకు ముందుగా విధించిన రెడ్‌లైన్‌కు అనుగుణంగానే తైవాన్‌పట్ల స్పంచించారు. కానీ తైవాన్ మాత్రం తమ దేశ ఒక సార్వభౌమాధికార దేశని ప్రకటించింది. ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోతైవాన్‌కు సంబంధించి ట్రంప్ ప్రముఖంగా చెప్పిన విషయాలను చైనా అధికార పత్రిక ప్రముఖంగా ప్రచురించింది. ఇరాన్ కూడా అమెరికాకు చాలా చాలా దూరంలో ఉన్నందువల్ల ఇరాన్ విషయంలో కూడా ట్రంప్ ఇదేవిధంగా మాట్లాడతారా? పూర్వ వైఖరికే కట్టుబతారా? తటస్థవిధానాన్ని రాబోయేకాలంలో తెరమీదకు తెస్తారా? అనే విషయం ప్రధానంగా చర్చకు వస్తోంది.
అమెరికా అండగా ఉందని భావించి స్వాతంత్ర్యంకోసం తమపై ఒత్తిడి చేయవద్దని తైవాన్‌కు ట్రంప్ హెచ్చరిక చేయడం చైనా పర్యటన తర్వాత ట్రంప్‌లో వచ్చిన అతిపెద్దమార్పుగా చైనా అధికార పత్రిక పేర్కొంది. అమెరికా సైన్యం నుండి తైవాన్ ఒక బ్లాంక్ చెక్ ఆశించకూడదని ట్రంప్ చెప్పిన విషయాన్ని ఫాక్స్ న్యూస్ ప్రముఖంగా ప్రస్తావించింది. "అమెరికా అండగా ఉంది కాబట్టి స్వతంత్రంగా ఉందాం అని ఎవరైనా చెప్పడాన్ని మేం కోరుకోవడం లేదు" అని ట్రంప్ ప్రముఖంగా చెప్పారు. భౌగోళికంగా చైనాకు,తైవాన్‌కు మధ్య దూరాన్ని, అమెరికాకు,తైవాన్‌కు మధ్య దూరాన్నీ ఆయన ప్రస్థావించారు. కాగా అమెరికా తిరిగి వచ్చిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ, జిన్‌పింగ్‌తో సమావేశాన్ని జి–2గా అభివర్ణించారు. రెండు అగ్రదేశాల మధ్య సమావేశంగా ఆయన పేర్కొన్నారు. చైనాను అగ్రదేశంగా, తమకు సమానమైన దేశంగా ఆయన అంగీకరించారు. జిన్‌పింగ్ కూడా అమెరికాతో చైనాకు సమాన గౌరవం, మర్యాద,పరస్పర సమానత్వం ఉండాలని మొదటినుండీ కోరుకుంటున్న విషయం తెలిసిందే. ఈ జి–2 సమావేశం చరిత్రలో ఎంతో ముఖ్యమైన ఘట్టమని ట్రంప్ అన్నారు. అదేవిధంగా అమెరికా నుండి చైనా 200 బోయింగ్ ఎయిర్‌క్రాఫ్టులను కొనుగోలు చేస్తామని చెప్పిందని, మరో 750 ఎయిర్‌క్రాఫ్టుల కొనుగోలుకు కూడా వాగ్దానం చేసిందని ట్రంప్ చెప్పారు. అదే విధంగా అమెరికా వ్యవసాయ రంగానికి కూడా ఎంతో ప్రయోజనం చేకూరిందని చెప్పారు.

## పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యం : బి.వి.రాఘవులు




**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చెప్పాలని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగాఆర్థిక భారం పడుతుంటే ఇంకేమి పొదుపు చేస్తారని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి గ్యాస్ ధరలను పెంపును నిరసిస్తూ శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సిపిఐ(ఎం)ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘువులు మాట్లాడుతూ దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థిలో ఉందని, నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదని, కానిప్రధాన మంత్రి మోదీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహమై ట్రంప్‌కుసాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ గ్యాస్ ధరలు పెరగడం వల్ల హోటళ్లలో టిఫిన్లు, భోజనం ధరలు పెరిగాయనీ, అనేక హాస్టళ్లు మూతపడ్డాయని తెలిపారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి,బండారు రవికుమార్, సీనియర్ నేత డిజి.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## విశ్వకర్మలను ఒకే కులంగా ప్రకటిస్తాం

### మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణులను పంచ వృత్తులతో కలిపి ఒకే కుల జనాభాగా ప్రకటిస్తూ, త్వరలోనే కార్పొరేషన్ పాలక మండలి ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విశ్వకర్మ జెఎసి ప్రతినిధులు శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి సంక్షేమ సలహాదారు వి.హెచ్.హనుమంతరావు, బిసి కమిషన్ చైర్మన్ జి. నిరంజన్‌లను కలిసి విశ్వకర్మల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర విశ్వకర్మ జెఎసి చైర్మన్ రాయబండి పాండురంగాచారి, వైస్ చైర్మన్ నందిపేట రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కులగణనలో విశ్వకర్మలను వృత్తుల వారీగా విడగొట్టకుండా ఒకే కులంగా గుర్తించాలని, అలాగే విశ్వకర్మ కార్పొరేషన్‌కు పాలక మండలి నియమించాలని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి, విశ్వకర్మలను ఒకే కులంగా గుర్తించే అంశంతో పాటు కార్పొరేషన్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో విశ్వకర్మ జెఎసి నాయకులు మోత్కూరి మల్లాచారి, మారోజు సునీల్ కుమార్, జయకరణ్ చారి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్ఎంఎస్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి సోషల్ మీడియాల్లో ప్రయాణికులకు సంబంధించిన సమాచారం అందించటానికి చర్యలు చేపట్టిన ఆర్‌టిసి సంస్థ, అదే సమయంలో ఉద్యోగుల ఆదాయ వ్యయాలు, లాభనష్టాలు, ప్రభుత్వ చెల్లింపులు, బకాయిలు, కార్మికులకు పదవీ విరమణ చేసిన తర్వాత చెల్లించాల్సిన బకాయిల వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాలని ఆర్‌టిసి బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న ఆర్‌టిసి ఆర్థిక పరిస్థితిపై పూర్తి స్థాయి శ్వేతపత్రాన్ని విడుదల చేసి ప్రజలకు, ఉద్యోగులకు స్పష్టత ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం, ఆర్‌టిసి యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## సంక్షోభంలో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, సిఎన్‌జి, ఎల్‌పిజి ధరలతో గిగ్, ప్లాట్‌ఫామ్ కార్మికులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ (టిజిపిడబ్ల్యుయు) ఆందోళన వ్యక్తం చేసింది. ఓలా, ఉబెర్, స్విగ్గీ, జొమాటో, బ్లింకిట్, జెప్టో వంటి సంస్థలు ఇంధన ధరల పెరుగుదలకు అనుగుణంగా ఛార్జీలు పెంచకపోవడంతో కార్మికులపై అదనపు భారం పడుతోందని పేర్కొంది. క్యాబ్, ఆటో డ్రైవర్లు, డెలివరీ కార్మికులు పెరుగుతున్న ఇంధన ఖర్చులు, వాహన ఈఎంఐలు, నిర్వహణ వ్యయాలు, కుటుంబ అవసరాలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపింది. ఎలక్ట్రిక్ వాహనాల ధరలు అధికంగా ఉండటం, తగిన సబ్సిడీలు, ఛార్జింగ్ సదుపాయాలు లేకపోవడంతో వాటికి మారడం కూడా సాధ్యం కావడం లేదని పేర్కొంది. గిగ్ కార్మికులకు సరసమైన ఛార్జీలు, పెరిగిన డెలివరీ ఫీజులు, ఇంధన భృతి, సంక్షేమ పథకాలు కల్పించాలని ప్రభుత్వం, ప్లాట్‌ఫామ్ సంస్థలను టిజిపిడబ్ల్యుయు డిమాండ్ చేసింది.

## జూన్ నెలాఖరు నాటికి టిమ్స్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(టిమ్స్)ను కార్పొరేట్ స్థాయి ఆసుపత్రిగా తీర్చిదిద్దుతున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి సనత్‌నగర్ టిమ్స్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ సనత్‌నగర్ టిమ్స్ వద్ద కెటిఆర్ డ్రామా చేశారని ఆరోపించారు. ఆసుపత్రికి విధి విధానాలు పాటించకుండా వందలాది మందితో వెళ్లడం బాధ్యతారాహిత్యమన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై కలెక్టర్లతో సిఎస్ టెలీకాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్‌లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్‌తో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాల్లో కొనసాగుతున్నధాన్యం కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడ జాప్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సిఎస్ ఆదేశించారు.



## ధాన్యం రాశికి నిప్పంటించిన దుండగులు!

### ఐదువేల గోనె సంచులు దగ్ధం.. తప్పిన పెనుప్రమాదం

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం రాశికి ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన సంఘటన మండలంలోని బొల్లంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు అంకిరెడ్డి మురళి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రంలో సుమారు లారీ ధాన్యాన్ని పోసి, తూర్పారబట్టి విక్రయానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ధాన్యం రాశికి నిప్పుపెట్టగా, అదృష్టం కొద్ది గాలి దిశమారి పక్కనే ఉన్న సుమారు 5 వేల గోనె సంచులు దగ్ధమైనట్లు తెలిపారు. దీంతో కొనుగోలు కేంద్రంలో గల రైతుల ధాన్యం రాశులకు పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. మంటలను గమనించిన గ్రామస్తులు వెంటనే డయల్ 100, ఫైరింజన్‌కు ఫోన్ చేయగా గ్రామస్తులు, ఫైరింజన్ సిబ్బంది కలిసి మంటలను అదుపు చేసినట్లు తెలిపారు. కాగా రైతు అంకిరెడ్డి మురళి ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి ఓటమి చెందడంతో రాజకీయ కుట్రతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారా లేక ధాన్యం కొనుగోళ్లలో ఎదురవుతున్న జాప్యానికి నిరసనగా ఆగ్రహంతో ఈ సంఘటనకు పాల్పడ్డారా అని చర్చించుకుంటున్నారు. జరిగిన సంఘటనపై ధాన్యం కొనుగోలు నిర్వాహకులు అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా ఇదే ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు ఇబ్బందులకు లోనయ్యారు.

## ఎసిబికి పట్టుబడ్డ అసిస్టెంట్ లైన్‌మెన్



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో వ్యవసాయ అవసరాల కోసం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయడానికి రాయికుంటపల్లి, మోటకొండూరుకు చెందిన రైతు 'మొకాల అనంత రెడ్డి' నుండి పప్పుల రమేష్ (టిజిఎస్‌పిడిసిఎల్) ఎఎల్‌ఎం రూ.35,000 లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

## ధరలు తగ్గించాలని సిపిఐ రాస్తారోకో



**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కెట్‌పల్లి) :** కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు నార్కెట్‌పల్లి బస్టాండ్ దగ్గర రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చమురు కంపెనీలకు లాభం చేకూర్చే విధంగా పన్నులు పెంచి ప్రజలపై పెనుబారం మోపడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్, మండల నాయకులు వెంపటి శ్రీనివాస్, వంగాల నాగయ్య, సంగిశెట్టి శ్రీనివాస్, సీలోజి వెంకటాచారి, ఆలకుంట నరసింహ, ఎస్‌కె నజీర్, మట్టిపల్లి మల్లయ్య, శ్రీపతి స్వామి, బోడ మల్లేష్, సారగండ్ల అశోక్, వంగాల చంద్రయ్య, దుబ్బ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధరల పెంపు సామాన్యులపై పెనుభారం



### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/దేవరకొండ :** అడ్డు అదుపు లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోడీ పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యులపై పెను భారం మోపుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం సిపిఐ దేవరకొండ మండల సమితి ఆధ్వర్యంలో పెట్రోల్, డిజిల్ ధరల పెంపును నిరసిస్తూ పల్లా పర్వత్‌రెడ్డి భవన్ నుండి ఐబి, కోర్ట్, బస్టాండ్ వరకు ఆటోకు తాళ్లుకట్టి లాగి నిరసన ర్యాలీతో వెళ్ళి 167వ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, పట్టణ కార్యదర్శి ఆంజనేయులు, మండల కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, వెంకట్రాములు, వెంకటయ్య, మైనోద్దీన్, రాంరెడ్డి, యాదయ్య, మహిళా సమాఖ్య డివిజన్ అధ్యక్షురాలు అనిత, శాఖ కార్యదర్శులు, మండల కౌన్సిల్ సభ్యులు జ్యోతిబసు, నగేష్, మాధవరెడ్డి, మల్లయ్య, భారీములు, అంజయ్య, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, పర్వతాలు, మల్లేష్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శివకుమార్, నాయకులు కృష్ణారెడ్డి, సైదులు, రాజమల్లయ్య, శ్రీనివాస్, జాకీర్, యాదగిరి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు కళలు, చేతివృత్తులపై అభిరుచి పెంచుకోవాలి



### విద్యా వారోత్సవాల్లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ :** విద్యార్థులు చదువుతో పాటు కలలు, చేతివృత్తుల పట్ల అభిరుచి పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలను పురస్కరించుకొని, శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలో ఆర్ట్స్, క్రాఫ్ట్, కల్చర్‌పై నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, విద్యకు సంబంధించి అనేక పథకాలను తీసుకువస్తున్నదని తెలిపారు. విద్యార్థులకు యూనిఫామ్స్, మధ్యాహ్న భోజనం, హాస్టల్ విద్యార్థులకు కాస్మెటిక్ చార్జీలు, డైట్ చార్జీలు, మెనూను పెంచడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా సైన్స్ అధికారి, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

### వడ్ల కొనుగోళ్లలో రైతులను ఇబ్బంది పెట్టొద్దు..
### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్



**ప్రజాపక్షం/యాదాద్రి :** కేంద్ర ప్రభుత్వం నిరంతరం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. శనివారం భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో గాదేగాని మాణిక్యం అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇప్పుడు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు మరింత పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోందని నెల్లికంటి సత్యం ఆవేదన వ్యక్తం చేశారు.

**చట్టం అందరికీ సమానంగా వర్తించాలి**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథకు సంబంధించిన అంశంపై ఎమ్మెల్సీ స్పందిస్తూ.. అధికారంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. చట్టం అందరికీ సమానంగా అమలుకావాలని, రాజకీయ ప్రభావంతో ఎవరూ తప్పుల నుండి తప్పించుకోలేరని పేర్కొన్నారు.

**ధాన్యం కొనుగోళ్లలో వైఫల్యం..** తెలంగాణలో వడ్ల కొనుగోలు ప్రక్రియలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నెల్లికంటి సత్యం మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేకపోవడం, ధాన్యం తూకాల్లో ఆలస్యం, తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బంది పెట్టడం, సకాలంలో డబ్బులు చెల్లించకపోవడం వంటి సమస్యలతో రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య, బచ్చనగోని గాలయ్య, చేక్క వెంకటేష్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, యేశాల అశోక్ జిల్లా సమితి సభ్యులు కళ్ళేపల్లి మహేందర్, సోమన సబిత, అన్నెపు వెంకట్, మరుపాక వెంకటేష్, అన్నేమైన వెంకటేష్, ఇంజ హేమలత, చాపల అంజయ్య, కలకొండ సంజీవ, దాసరి లక్ష్మయ్య, బబ్బురి శ్రీధర్, మూల పోచయ్య, వడ్లకొండ భారతమ్మ, కాషపాక దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నదాతకు దిక్కెవరు..!

**ప్రజాపక్షం/అర్వపల్లి :** ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి గత రెండు నెలల నుంచి కొనుగోలు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండుటెండలు కావడంతో సేద తీరేందుకు వెళ్ళిన రైతుల ధాన్యాన్ని కొన్ని గేదెలు, కోతులు వచ్చి రైతు పండించిన ధాన్యాన్ని మేస్తున్నాయి. రైతులు 24 గంటలు కాపాలా కాయలేక ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

## నగలు ధరించి బయట నిద్రించొద్దు

### డిఎస్‌పి కె.శివరాం రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వృద్ధురాలి మెడలో నుంచి 30 గ్రాముల బంగారు గొలుసు లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను తిప్పర్తి పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని నల్లగొండ డిఎస్‌పి కె శివరాం రెడ్డి వెల్లడించారు.శనివారం నల్లగొండ డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిప్పర్తి మండలం ఎర్రగడ్డ గూడెం గ్రామంలో ఈ నెల 11న మర్రిచెట్టు కింద కూర్చున్న చింతమల్ల సత్యమ్మ (70) ఒంటరిగా ఉందని గమనించి బాణాలు హరిచంద్ర ప్రసాద్ తో ఓమైనర్ బాలుడు కలిసి బంగారు గొలుసు చోరీకి పాల్పడ్డారని తెలిపారు. బాధితురాలి ఫిర్యాదుతో తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని తిప్పర్తి పోలీస్, సీసీఎస్ బృందాలు ప్రత్యేకంగా రెక్కీ నిర్వహించాయని అత్యాధునిక టెక్నాలజీ, సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కదలికలపై నిఘా పెట్టడం జరిగింది అన్నారు. వాహనాల తనిఖీల సమయంలో పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ఇద్దరిని వెంటాడి పోలీసులు అదుపులోకి తీసుకుని నిందితుల వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారని వివరించారు. మహిళలు బయట ఒంటరిగా ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎండాకాలంలో ఆరుబయట నగలు ధరించి నిద్రించవద్దని సూచించారు. గ్రామాల్లో నేరాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఈ కేసు ఛేదనలో కీలకంగా పనిచేసిన పోలీసు సిబ్బందిని అభినందించారు.

# మనవడు సురక్షితం.. తాత కన్నుమూత

### బోరు గుంతలో పడిన బాలుడు...
### మనవడిని రక్షించి ప్రాణాలర్పించిన తాత
### ఊట్లపల్లిలో తీరని విషాదం



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** ఆడుకుంటూ ప్రమాదవశాత్తు వ్యవసాయ పొలంలో ఉన్న బోరు గుంతలో పడిన మనవడిని రక్షించబోయి తాను ప్రాణాలు కోల్పోయిన సంఘటన శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఊట్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవులు కావడంతో కూతు రు పిల్లలు ఊట్లపల్లిలో గల తాత వెంకన్న ఇంటికి వచ్చారు. ఉదయం తన మనవడు అయిన వేదాంష్ మనవరాలు అయినా లోహితలను తీసుకొని వెంకన్న తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. వెంకన్నకు చెందిన పొలంలో ఉన్న మామిడి చెట్టుకు నీళ్లు పోస్తుండగా, మనవరాలు తాత సెల్ ఫోన్‌తో ఆడుకుంటూ ఉంది. ఈక్రమంలో మనవడు వేదాంశ్ ఆడుకుంటూ బోరు గుంత వద్దకు వచ్చి గుంతలోకి తొంగి చూశాడు. ఇది గమనించిన తాత పరిగెత్తుకుంటూ వస్తున్న క్రమంలోనే మనవడు వేదాంష్ రెప్పపాటులోనే బోరు గుంతలోకి జారిపోయాడు. పరిగెత్తుకుంటూ వచ్చిన తాత వెంకన్న మనవడుని పట్టుకునే ప్రయత్నంలో తొంగి చూస్తుండగా తాను కూడా అందులోకి జారిపోయాడు. ఇది గమనించిన మనవరాలు లోహిత వెంటనే రోడ్డుమీదికి పరిగెత్తుకుంటూ వెళ్లి సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు వాళ్లకు తాత తమ్ముడు ఇద్దరు గుంతలో పడిపోయారని చెప్పడంతో వెంటనే వారు పరిసర ప్రాంత ప్రజలకు సమాచారం ఇవ్వడంతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు అధికారులు బోరు గుంత వద్దకు రెస్క్యూటివ్ చేరుకొని గుంతలో పడిన ఇద్దరితో కొంతసేపు మాట్లాడారు. మీకు ఎలాంటి భయం లేదు మేము వచ్చాము కొంచెం ఓపికతో ఉండండి అంటూనే.. రెస్క్యూ టీమ్ జెసిబి ప్రోక్లైన్ల సహాయంతో వారిని గంటల వ్యవధిలోనే బయటకు చాకచక్యంగా తీసుకువచ్చారు. ఈ రెస్క్యూటివ్ చేసిన ప్రయత్నంలో బాలుడు వేదాంష్ ప్రాణాలతో బయటపడగా మనవడిని రక్షించే ప్రయత్నంలో బోరు గుంతలో పడిపోయిన వెంకన్న ఊపిరాడక అపస్మారక స్థితిలోకి వెళ్లారు. వెంటనే పోలీసులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలోనే వెంకన్న మృతి చెందాడు.

**మనవడు సురక్షితం.. తాత కన్నుమూత**

బోరు గుంతలోంచి బయటకు తీసిన సమయానికి నాలుగేళ్ల బాలుడు వేదాన్ష్ స్వల్ప అస్వస్థతతో ప్రాణాలతో బయటపడ్డాడు. కానీ, లోపల ఎక్కువ సమయం ఉండటం, శ్వాస తీసుకోవడానికి ఆక్సిజన్ అందకపోవడంతో వెంకన్న (53) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు.పోలీసులు వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే వెంకన్న మృతి చెందాడు. మనవడిని కాపాడే ప్రయత్నంలో ఆతాత ప్రాణాలు కోల్పోయాడనే వార్త తెలియగానే ఊట్లపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# యాదాద్రి కొండపై దుకాణాల దందాకు చెక్ పెట్టాలి!

### టెండర్లు వేస్తే దేవస్థానానికి రూ.30 కోట్ల అదనపు ఆదాయం
### మంత్రి కొండా సురేఖకు స్థానికులు, నిరుద్యోగుల వినతి



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో పారదర్శకంగా టెండర్లు నిర్వహించి, దేవస్థాన ఆదాయాన్ని పెంచడంతో పాటు స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని స్థానిక వ్యాపారస్తులు, నిరుద్యోగులు మరియు రాజకీయ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకి ఒక బహిరంగ వినతి పత్రాన్ని సమర్పించారు. యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘం పేరిట దేవస్థానానికి సంవత్సరానికి 10 దుకాణాలకు గాను కేవలం రూ.1 కోటి 68 లక్షలు మాత్రమే చెల్లిస్తున్నారు. కానీ, అదే దేవస్థాన పరిధిలో ఒక సాధారణ సెల్‌ఫోన్ కౌంటర్ టెండర్ ద్వారా సంవత్సరానికి రూ.2 కోట్ల 22 లక్షలకు పైగా ఆదాయం సమకూరుతోంది. ఇతర చిన్న టెండర్ల ద్వారా కూడా కోట్లలో ఆదాయం వస్తుండగా, కొండపై దశాబ్దాలుగా తిష్టవేసిన వర్తక సంఘం వల్ల దేవస్థాన ఆదాయానికి భారీ గండి పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వర్తక సంఘం 10 దుకాణాల ఆదాయం: రూ.1.68 కోట్లు (సంవత్సరానికి)**
**ఒకే ఒక్క సెల్ ఫోన్ కౌంటర్ ఆదాయం: రూ.2.22 కోట్లు (సంవత్సరానికి)**

**బహిరంగ టెండర్లతోనే నిరుద్యోగులకు న్యాయం**

కొండపై ప్రస్తుతం ఉన్న 10 దుకాణాలను రద్దు చేసి, అదనంగా మరో 30 కొత్త దుకాణాలను కలిపి మొత్తం బహిరంగ టెండర్లు వేయాలని బాధితులు కోరుతున్నారు. దీనివల్ల దేవస్థానానికి సుమారు రూ.20 నుండి రూ.30 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దేవస్థానంలో కేవలం ఒకే వర్గానికి లేదా పాత వారికే వ్యాపార హక్కులు కల్పించాలనే నియమం లేదని, ప్రతి సంవత్సరం టెండర్ల ప్రకటన జారీ చేసి కొత్త వారికి అవకాశం కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. వర్తక సంఘం గడువు ఈ నెల (మే 31, 2026) నాటితో ముగియనుండటంతో తక్షణమే కొత్త టెండర్ల ప్రక్రియ ప్రారంభించాలని కోరుతున్నారు.

**అన్నదాన కాంప్లెక్స్ షాపులను ప్రారంభించాలి**

గత ప్రభుత్వ హయాంలో కొండ కింద అన్నదాన కాంప్లెక్స్ వద్ద వర్తక సంఘం వారికి కేటాయిస్తూ నిర్మించిన 112 షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు కూడా వెంటనే టెండర్లు నిర్వహించాలని స్థానికులు వేడుకుంటున్నారు. వీటి ద్వారా వేలాది స్థానిక నిరుద్యోగ కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని, అలాగే స్వామివారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుతాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. తరతరాలుగా సాగుతున్న ఈ ఆర్థిక దోపిడీకి అడ్డుకట్ట వేసి, యాదాద్రి అభివృద్ధికి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవ చూపాలని యాదగిరిగుట్ట వాసులు ఆశిస్తున్నారు.

## చివరి గింజ వరకూ ధాన్యం కొనుగోలు



### కేంద్రాల ఆకస్మిక తనిఖీల్లో ఎమ్మెల్యే వీరేశం

**ప్రజాపక్షం/నకిరేకల్ :** రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం భరోసా ఇచ్చారు. శనివారం నకిరేకల్ మండలం తాటికల్, మంగళపల్లి, కేతేపల్లి మండలం ఇనుపాముల, చీకటిగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కట్టంగూర్ మండలం కురుమర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన మరో ధాన్యం నిల్వ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియ,తూకం విధానం, ధాన్యం తరలింపు, రైతులకు అందుతున్న సౌకర్యాలను అధికారులతో కలిసి పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలని, తేమ, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో నకిరేకల్ తహశీల్దార్ యశ్వంత్ రాజ్, సివిల్ సప్లై అధికారి రాచకొండ జ్యోతి, పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, కురుమర్తి సర్పంచ్ దార సత్తమ్మ బిక్షం నాయకులు నకిరేకంటి ఏసు రత్నం, గాదగోని కొండయ్య, గుత్తా మాధవరెడ్డి, మహేందర్ రెడ్డి, నరేందర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల తీరుపై అనుమానాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పెన్‌పహాడ్ పోలీసుల వ్యవహార శైలిపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరావత్ బిక్షం నాయక్ ఆరోపించారు. శనివారం సూర్యాపేట సఖీ కేంద్రంలో మిస్సింగ్ అయిన గిరిజన మహిళను సంఘం నాయకులు పరామర్శించి అనంతరం మీడియాతో మాట్లాడారు. గిరిజన మహిళ కేసులో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు సరైన ధర్యాప్తు చేపట్టలేదని ఆరోపించారు. ఎస్‌పికి ఫిర్యాదు చేసిన వెంటనే మహిళ ఆచూకి లభించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మహిళతో ఉన్న వ్యక్తిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక కారణాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆ వ్యక్తి ఎస్‌ఐకు దగ్గర బంధువని గ్రామంలో ప్రచారం జోరుగా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు మహిళను తీసుకువచ్చే సమయంలో కుటుంబ సభ్యులు, మహిళా పోలీసు లేకుండా తప్పిపోయిన మహిళను, తనవెంట ఉన్న వ్యక్తి బూరుగడ్డకు కంపాటి అశోక్‌ని పోలీసులు తీసుకురావడం, తిరిగి పంపించడం వెనుక ఒక ట్విస్ట్ నెలకొందని ఆరోపించారు. ఈ విషయాన్ని అవసరం అయితే ఎస్‌పి ఎదుట బహిర్గతం చేస్తామన్నారు. గిరిజన మహిళకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులు ప్రత్యేక విచారణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవలనే మండలంలోనే ఓ తండలో ఈనెల 10న ఓ మైనర్ (16) బాలికపై అర్థరాత్రి వేళ దాడికి యత్నించిన ఘటనను కూడా ఆయన ప్రస్తావించారు. బాధిత కుటుంబం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేయకుండా పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని ఓ నాయకుడు హుకుం మేరకు ఎస్ఐ గోపికృష్ణ ఆదేశించినట్లు ఆరోపించారు. మైనర్ బాలికల భద్రత విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆందోళన కలిగిస్తుందన్నారు. గిరిజన మహిళలు, బాలికల సమస్యలపై పోలీసులు సున్నితంగా స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు భూక్య రాజు నాయక్, శ్రీరామ్ నాయక్, నాగు నాయక్, రమేష్ నాయక్, శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.

# ధరలు పెంచి పేదల నడ్డి విరిచిన కేంద్రం



### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్రోలో, డిజిల్, గ్యాస్ ధరలు పెంచి పేదల నడ్డి విరిచిందని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులు తాజాగా పెట్రోల్, డిజిల్ ధరల పెరుగుదలతో పేద, మధ్య తరగతి ప్రజలపై మరింత భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు దంతాల రాంబాబు, గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షులు రేగట్టి లింగయ్య, పట్టణ కార్యవర్గ సభ్యులు చామల అశోక్ కుమార్, దీకొండ శ్రీనివాస్, ఎండి పాషా, ఏఐవైఎఫ్ గౌరవ పట్టణ అధ్యక్షులు కుక్కడపు శౌరి, పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, పున్నం రమేష్, అయితగాని కామేష్, గురుస్వామి, పొదిల వెంకటమ్మ, దంతాల పద్మరేఖ, దేశగాని హేమలత, సివిల్ సప్లై హమాలీ నాయకుడు వెంకన్న పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ ప్రక్రియ మరింత వేగవంతం

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా, డివిజన్ స్థాయి, మండల స్థాయి అధికారులతో ధాన్యం సేకరణపై వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేయాలని పిలుపునిచ్చారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రస్తుతం అనుకున్న స్థాయిలో ధాన్యం సేకరణ జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రారంభంలో రోజుకు 5 వేల నుండి 10 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు తెలిపిన ఆయన ఇకపై ఆ వేగాన్ని పెంచి రోజుకు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని, ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో హమాలీల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు మూడు షిఫ్టులలో హమాలీలు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే లేదా నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, డిఎస్ఓ మోహన్‌బాబు, డిసిఓ ప్రవీణ్ కుమార్, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, డిఎంఓ నాగేశ్వర శర్మ, ఏఎస్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
ఆదివారం
17-05-2026
www.prajapaksham.in

"భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరల పెంపునకు సంబంధించి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్‌పై సిపిఐ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ధరల పెంపుకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టింది. ప్రజలపై మోదీ సర్కార్ మోయలేని భారం మోపుతుందని మండిపడింది. సామాన్యుల నడి విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. పెంచిన ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. తెలంగాణ వ్యాప్తంగా పెట్రో ధరలకు వ్యతిరేకంగా జిల్లాలు, మండల కేంద్రాల్లో ఆటోలను తాళ్లతో లాగుతూ, మహిళలు ఖాళీ సిండర్లను ప్రదర్శిస్తూ వినూత్నంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు."


భువనగిరిలో....


మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో..



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో..


దేవరకొండ పట్టణంలో....


నార్కెట్‌పల్లిలో....

# పెట్రో ధరల పెంపునకు వ్యతిరేకంగా సిపిఐ నిరసనలు


నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలంలో..

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో శనివారం సిపిఐ ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. భువనగిరిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ధర్నాలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం సెంటర్ నుండి శ్రీనివాస సెంటర్, నెహ్రూ సెంటర్, ఇందిరాగాంధీ సెంటర్ మీదుగా సిపిఐ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథి బైకులకు తాళ్లు కట్టి లాగుతూ, రిక్షాలపై గ్యాస్ బండలు, బైకులు పెట్టి వినుత్నంగా ర్యాలీ చేసుకుంటూ తాసిల్దార్ కార్యాలయం ముందుకు చేరుకొని నిరసన ఆందోళన చేపట్టారు, మణుగూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, దేవరకొండ మండల సమితి ఆధ్వర్యంలో పల్లా పర్వత్‌రెడ్డి భవన్ నుండి ఐబి, కోర్ట్, బస్టాండ్ వరకు ఆటోకు తాళ్లుకట్టి లాగి నిరసన ర్యాలీతో వెళ్ళి 167వ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, నార్కెట్‌పల్లి బస్టాండ్ దగ్గర సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు, నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యదర్శిపి.సుధాకర్, మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ సిపిఐ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ఆటోను తాడుతో లాగి నిరసన తెలిపారు, నాగర్‌గర్ కర్నూల్ జిల్లాలో రాస్తారోకో, నిరసన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్.ఎం.డి ఫయాజ్, సూర్యపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో ఆటోలను తాళ్లతో లాగుతూ వినూత్న నిరసన వ్యక్తం చేసిన సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మక్తల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన రాస్తారోకో చేపట్టన నారాయణపేట జిల్లా కార్యదర్శి టి. నరసింహులు


నాగర్‌గర్ కర్నూల్‌లో...


సూర్యపేట జిల్లా కేంద్రంలో...



మక్తల్ పట్టణంలో

## కొత్త మద్యం షాపులో పాత స్టాక్ విక్రయాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నగరంలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతంలో ఉన్న మంజునాథ వైన్స్‌పై ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పాత మద్యం స్టాక్ విక్రయాలు వెలుగుచూశాయి. హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ మహేష్ ఆధ్వర్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 2023–25 మద్యం పాలసీకి చెందిన మద్యం బాటిళ్లను కొత్త షాపులో విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం షాప్ యజమాని నివాసంలో కూడా సోదాలు నిర్వహించగా, 14 రకాలుకు చెందిన మొత్తం 198 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన మద్యం బాటిళ్లను చిక్కడపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ మహేష్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## సూత్రధారి అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సభ్యురాలిగా ఉన్న ఒక బయాలజీ లెక్చరర్‌ను సిబిఐ శనివారం అరెస్టు చేసిందని అధికారులు తెలిపారు. పేపర్ లీక్ కేసులో ప్రధాన సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పి.వి. కులకర్ణి, ఇతర నిందితులను విచారించిన ఆధారంగా ఈ అరెస్టు జరిగిందని వారు చెప్పారు. ఏజెన్సీ ప్రధాన కార్యాలయంలో విచారించిన అనంతరం బయాలజీ లెక్చరర్ మనీషా మంధారేను అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. ఆమె నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (అండర్ గ్రాడ్యుయేట్) పరీక్ష ప్రక్రియలో పాలుపంచుకున్నారని, ఎన్‌టిఎ ఆమెను నిపుణురాలిగా నియమించిందని ఆరోపణలు ఉన్నాయని వారు చెప్పారు. బోటనీ, జువాలజీ ప్రశ్నపత్రాలకు మంధారేకు పూర్తి ప్రాప్యత ఉందని అధికారులు తెలిపారు. అరెస్టు అయిన పుణెకు చెందిన మనీషా వాగ్మారే ద్వారా, ఏప్రిల్ 2026లో జరగబోయే నీట్ పరీక్ష అభ్యర్థులను మంధారే సమీకరించి, తన పుణె నివాసంలో విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. మంధారే లీక్ అయిన ప్రశ్నపత్రాలను, సమాధానాలను ఎంపిక చేసిన విద్యార్థులకు చెప్పి రాయించి, లక్షల రూపాయల ఫీజు తీసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రశ్నలలో చాలా వరకు 3న జరిగిన పరీక్షలో వచ్చిన ప్రశ్నలతో సరిపోయాయి. ప్రశ్నపత్రం లీక్ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో నీట్ పరీక్ష రద్దు చేయబడింది. కాగా, సిబిఐ శుక్రవారం లాతూరుకు చెందిన రసాయన శాస్త్ర నిపుణుడు ప్రొఫెసర్ పి.వి. కులకర్ణిని అరెస్టు చేసింది. కులకర్ణి చాలా సంవత్సరాలుగా నీట్ ప్రశ్నపత్రం రూపకల్పనలో పాలుపంచుకునే ప్యానెళ్లలో పనిచేశారు. రహస్య సమాచారానికి తనకు ఉన్న ప్రత్యేక ప్రాప్యతను దుర్వినియోగం చేస్తూ, కులకర్ణి ఏప్రిల్ చివరి వారంలో తన ఇంట్లో ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించి, 3న జరిగిన నీట్ యుజి ప్రశ్నపత్రంలో వచ్చిన ప్రశ్నలు, ఆప్షన్లు, సమాధానాలను తన విద్యార్థులకు చెప్పి రాయించారని ఆరోపణలు ఉన్నాయి. '2026 ఏప్రిల్ చివరి వారంలో, అతను మరో నిందితురాలైన మనీషా వాగ్మారే సహాయంతో విద్యార్థులను సమీకరించారు. ఆమెను మే 14న సిబిఐ అరెస్టు చేసిందని ఒక అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు తమ నోట్‌బుక్‌లలో ప్రశ్నలను రాసుకుని, వాటిని 3న జరిగిన అసలు నీట్‌యుజి పేపర్‌తో కచ్చితంగా సరిపోల్చుకున్న సెషన్‌లకు హాజరయ్యేందుకు కొన్ని లక్షల రూపాయలు చెల్లించారని అధికార ప్రతినిధి తెలిపారు. పరీక్ష రద్దుకు దారితీసిన పేపర్ లీక్ ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు, ఆ కేంద్ర సంస్థ ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది.

## ఆగ్రహ జ్వాలలు

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి తోడ్పాడాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శనివారం హైదరాబాద్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డి భవన్ నుంచి హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహా తదితరులు డీజిల్ ధరల పెంపు నిరసిస్తూ ఆటోను తాళ్లతో లాగి, వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ మహిళలు ఖాళీ సిలిండర్లను ప్రదర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అదాని, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు నష్టం వాటిల్లుతుందని, వారు నష్టాలను భరించలేరు కాబట్టి నిత్యావసర ధరలను పెంచి ప్రజలపై పన్నుల భారం మోపుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ పాలనలో శ్రీమంతులు ఇంకా సంపాదిస్తుంటే, పేద వారు ఇంకా పేదరికంలో మునిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ స్థాయిలో నాలుగవ స్థానంలో ఉందని జిడిపి పెరిగింది అంటూ ప్రగల్భాలు పలుకుతూ బంగారం కొనొద్దని, పెట్రోల్ వాడకం తగ్గించాలని ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాడని విమర్శించారు. ప్రధాని మోదీకి పరిపాలన చేతకాక పేదవాడి రక్తమాంసాలను పీక్కుతింటున్నారని ఆయన విమర్శించారు. గతంలో పి.వి.నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ వంటి వారు అనేక సంస్కరణలు తీసుకొచ్చి పేద ప్రజలపై భారం పడకుండా దేశాన్ని పరిపాలించారని గుర్తు చేశారు. బిజెపి తెలంగాణలో అధికారంలోకి రాకుండా అడ్డుకునే శక్తి సిపిఐకి ఉందని సాంబశివరావు స్పష్టం చేశారు. మోదీ రెండు కార్లలో తిరిగితే చమురు కొరత సమస్య తీరిపోతే, ఒక నెలంతా రెండు కార్లలో తిరిగితే దేశ ఆర్థిక వ్యవస్థ మారిపోతుందా చూద్దామని ఆయన పేర్కొన్నారు. బూటకపు మాటలతో మోదీ ప్రజలను మోసం చేస్తున్నారని, ప్రజలు జాగ్రత్త అని హెచ్చరించారు. ప్రధాని మోదీ అనేక మార్గాలు, మోసాలతో ఎన్నికలలో గెలవవచ్చు కానీ, ప్రజల హృదయాలను మాత్రం గెలవలేరని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా సిపిఐ అండగా ఉంటుందన్నారు. ఈ.టి.నరసింహా మాట్లాడుతూ అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాలపై తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ తనను వ్యతిరేకించే దేశాల చమురు ఇంధన వనరులను దోచుకోవటానికి దేశాలను కబలిస్తున్నదని పేర్కొన్నారు. అదాని, అంబానీలకు లాభం చేకూర్చేందుకు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలను కష్టాల్లోకి నెడుతున్నదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మతవిద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారే తప్ప, ప్రజల కష్టాల గురించి ఆలోచన లేదని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ ప్రజా వ్యతిరేక విధానాలు రద్దయ్యే వరకు, పెంచిన ధరలను తగ్గించేవరకు సిపిఐ పోరాటాలు కొనసాగిస్తుందని ప్రకటించారు. ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా బృందం పెంచిన ధరల వల్ల సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులపై పడిన పాటలు రోడ్డుపై వెళుతున్న ప్రజలను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పి.ప్రేమ్ పావని, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, జి.చంద్రమోహన్ గౌడ్, పడాల నళిని, కాంపల్లి శ్రీనివాస్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అనిల్ కుమార్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## అండమాన్‌ను తాకిన 'నైరుతి'

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నాయని కూడా ఆ శాఖ పేర్కొంది. ఈ కాలంలో అండమాన్ దీవులు, అండమాన్ సముద్రంలోని మిగిలిన ప్రాంతాలతో పాటు, తూర్పుమధ్య బంగాళాఖాతంలోని కొన్ని ప్రాంతాల్లో కూడా రుతుపవనాల ప్రవేశించే అవకాశముంది. ఈ ప్రాంతంలో నైరుతి రుతుపవనాల విస్తరణకు సంబంధించిన అన్ని ప్రమాణాలు నెరవేరాయని ఐఎండి తెలిపింది.నైరుతి రుతుపవనాలు ఈనెల 26న కేరళలోకి సాధారణం కంటే ముందుగానే ప్రవేశించే అవకాశం ఉందని ఆ శాఖ శుక్రవారం తెలిపింది. సాధారణంగా కేరళలో జూన్ 1న రుతుపవనాలు ప్రవేశిస్తాయి. ఇది నైరుతి రుతుపవన కాలం (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి ఇప్పటికే పేర్కొంది. ఈ కాలంలో 'ఎల్ నినో' పరిస్థితులు ఏర్పడటం దీనికి కారణం కావచ్చు. దీని వల్ల దేశంలో తక్కువ వర్షపాతం నమోదవడానికి ఈ పరిస్థితులే దారితీస్తాయి.

## బండి భగీరథ్ లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

40 నిమిషాల పాటు రికార్డు చేసారు. మరో పక్క పేట్‌బషీరాబాద్ పోలీసులు కూడా బాధితురాలి నుండి రెండవ సారి వాంగ్మూలాన్ని నమోదు చేసారు.

### చట్టంపై గౌరవంతోనే అప్పగించా : బండి సంజయ్

"మా అబ్బాయి బండి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చట్టంపై ఉన్న గౌరవంతో శుక్రవారం న్యాయవాదుల ద్వారా పోలీసుల విచారణకు మా కుమారుడిని అప్పగించాను. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరూ చట్టానికి లోబడి ఉండాల్సిందే" అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు.ఈ మేరకు 'సత్యమేవ జయతే' శీర్షికతో బండి సంజయ్ శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. తన కుమారుడు బండి భగీరథ్‌పై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో చట్టపరమైన ప్రక్రియకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నామని ఆయన తెలిపారు. భగీరథ్ తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ, తాను ఎలాంటి తప్పు చేయలేదని చెబుతున్నాడని బండి సంజయ్ తెలిపారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే స్టేషన్‌కు అప్పగించాలని భావించినప్పటికీ, న్యాయవాదులను సంప్రదించిన తర్వాత తమ వద్ద ఉన్న ఆధారాలను వారికి చూపించామని చెప్పారు. ఆ ఆధారాలను పరిశీలించిన న్యాయవాదులు కేసు కొట్టివేయబడే అవకాశం ఉందని, బెయిల్ కూడా తప్పకుండా వస్తుందని సూచించడంతో కొంత ఆలస్యం జరిగిందని బండి సంజయ్ తెలిపారు. అయినప్పటికీ, ఇక జాప్యం చేయడం సరికాదనే ఉద్దేశంతో శనివారం తన కుమారుడిని విచారణ కోసం పోలీసులకు అప్పగించినట్లు బండి సంజయ్ వెల్లడించారు. న్యాయ వ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉందని, కోర్టు ఉత్తర్వులు సోమవారం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, న్యాయ వ్యవస్థపై గౌరవంతో ముందుగానే విచారణకు పంపినట్లు బండి సంజయ్ తెలిపారు.

## త్రిభాషా విధానం

(మొదటి పేజీ తరువాయి)

కూడా ఇచ్చింది. 10వ తరగతి బోర్డు పరీక్షల సమయంలో మూడో భాషకు ఎలాంటి బోర్డు పరీక్ష ఉండదని స్పష్టం చేసింది. సిబిఎస్ఇ విడుదల చేసిన సర్క్యులర్ ప్రకారం, 9వ తరగతి నుంచి విద్యార్థులు మూడు భాషలను చదవాల్సి ఉంటుంది. వాటిని ఆర్1, ఆర్2, ఆర్3గా సిబిఎస్ఇ బోర్డు పేర్కొంది. ఇందులో రెండు భాషలు తప్పనిసరిగా భారతీయ మాతృభాషలై ఉండాలి. విదేశీ భాషలను మూడో భాషగా మాత్రమే ఎంచుకునే అవకాశం ఉంటుంది. అదనంగా నాలుగో ఐచ్ఛిక భాషగా కూడా విదేశీ భాషలను తీసుకునే వీలుంటుందని సిబిఎస్ఇ తెలిపింది. జాతీయ విద్యా విధానం 2020, నేషనల్ కరికులమ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సిఫార్సులను అమలులో భాగంగా సిబిఎస్ఇ ఈ నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తోంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com